# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 2 నవంబరు 2023 వెల : రూ.15

కీలకంగా మారిన ఐదు రాష్ట్రాల ఎన్నికలు

పాలస్తీనాలో యూదులు !

పాలస్తీనాను యూదులు ఆక్రమించిన వైనం

ఇది 75 ఏళ్ల పాలస్తీనా గాయం

పాలస్తీనాలో జాతి నిర్మూలన

భారత రాజ్యాంగం - వ్యవసాయ సంబంధాలు

భూసంస్కరణలపై స్వామినాథన్ సిఫారసుల విస్మరణ

కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు రాజ్యాంగం రీత్యా అవసరం

'సనాతన ధర్మం' మీద బ్రిటిష్ వాడి దాడి !

మనుస్మృతిని అంబేద్కర్ ఎందుకు తగలబెట్టారు

చార్వాకం - తొలి భౌతికవాదం

కుల రక్కసి వికృత రూపం.. పెరుమాళ్ మురుగన్ 'చితి' నవల

భారతీయత - జాతీయ సమైక్యత

సాహిత్య తత్వానికి దారి దీపం.. ఆర్వియార్

సమూహ - అవగాహన పత్రం

'మార్క్స్ - అంబేద్కర్లు మన మార్గదర్శులు'.. హైదరాబాద్‌లో పుస్తకావిష్కరణ

ఒక జిజ్ఞాసి లోతైన ఆలోచనలు

మార్క్స్ సిద్ధాంతాలు : సమాజం, భావజాలం

ప్రజాపక్ష మేధావి గరిమెళ్ల నారాయణ అస్తమయం

నవంబరు - 2023

# దారి దీపం

## మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 2


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1. కీలకంగా మారిన ఐదు రాష్ట్రాల ఎన్నికలు - సంపాదకీయం 3
2. పాలస్తీనాలో యూదులు! - మహాత్మాగాంధీ 4
3. పాలస్తీనాను యూదులు ఆక్రమించిన వైనం - జవహర్‌లాల్ నెహ్రూ 6
4. ఇది 75 ఏళ్ల పాలస్తీనా గాయం - పి.ప్రసాద్ (ఇఫ్టూ) 8
5. పాలస్తీనాలో జాతి నిర్మూలన -రామసుందరి 10
6. భారత రాజ్యాంగం - వ్యవసాయ సంబంధాలు - సారంపల్లి మల్లారెడ్డి 11
7. భూసంస్కరణలపై స్వామినాథన్ సిఫారసుల విస్మరణ - డాక్టర్ కొల్లా రాజమోహన్ 13
8. కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు రాజ్యాంగం రీత్యా అవసరం - రవివర్మకుమార్ 16
9. 'సనాతనధర్మం' మీద బ్రిటిష్‌వాడి దాడి! - సి.ఎస్.ఆర్ ప్రసాద్ 19
10. మనుస్మృతిని అంబేద్కర్ ఎందుకు తగలబెట్టారు - డాక్టర్ దేవరాజు మహారాజు 20
11.చార్వాకం - తొలి భౌతికవాదం -కె.శ్రీనివాసాచారి 22
12.కుల రక్కసి వికృత రూపం.. పెరుమాళ్ 'చితి' నవల -డా.పి.యస్.ప్రకాశరావు 24
13.భారతీయత - జాతీయ సమైక్యత - ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి 26
14.సాహిత్య తత్వానికి దారి దీపం.. ఆర్వియార్ - డీవీవీయస్ వర్మ 29
15.సమూహ - అవగాహన పత్రం - సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ 30
16.'మార్క్స్ - అంబేద్కర్లు మన మార్గదర్శులు' హైదరాబాద్‌లో పుస్తకావిష్కరణ 33
17.ఒక జిజ్ఞాసి లోతైన ఆలోచనలు - ఎన్.వేణుగోపాల్ 35
18.మార్క్స్ సిద్ధాంతాలు : సమాజం, భావజాలం - క్లిఫ్ స్లాటర్ 39
19.ప్రజాపక్ష మేధావి గరిమెళ్ల నారాయణ అస్తమయం - గౌరవ్ 42
20.కార్టూన్స్ 43
21.కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**


**దారి దీపం**

**మాసపత్రిక**

**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495



# కీలకంగా మారిన ఐదు రాష్ట్రాల ఎన్నికలు

2024 సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. దానికి కొద్ది నెలల ముందు ప్రస్తుతం ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. అందుకే ఇది సెమీ ఫైనల్స్ పోరు అంటున్నారు. పైగా రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లు ఉత్తర భారతంలో ఉన్నాయి. దక్షిణాన తెలంగాణ, ఈశాన్య ప్రాంతంలో మిజోరాం ఉన్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో వున్నవి 83 పార్లమెంటు స్థానాలే. ఇందులో రెండు రాష్ట్రాలు కాంగ్రెస్ పాలనలో ఉంటే, ఒకటి బీజేపీ పాలనలోను, మిగతా రెండు ఇతర పార్టీల పాలనలో వున్నాయి. ప్రధాన రాష్ట్రాల పోరు బీజేపీకి, కాంగ్రెస్‌కీ మధ్యనే వుంది. ఎన్నికలనగానే సర్వేలు సందడి చేస్తాయి. సోషల్ మీడియాలో అవి చక్కర్లు కొడుతుంటాయి. మొత్తం మీద మోదీ గ్రాఫ్ కిందికి, రాహుల్ గ్రాఫ్ పైకి సాగుతున్నట్లు కనిపిస్తున్నది. అయితే ఈ గ్రాఫ్‌లు ఆయా పార్టీల జయాపజయాల స్థాయికి చేరాయా ? అన్నది ఇంకా స్పష్టం కావాల్సి వుంది.

బీజేపీకి ఆర్థిక బలం, ఆర్ఎస్ఎస్ అంగబలం కనిపిస్తుంటే, కాంగ్రెస్ ప్రచారంలో జనం జోష్ కనిపిస్తున్నది. మోదీ ప్రచారంలో పాత అస్త్రాలు పనిచేస్తున్న జాడ అంతగా కనిపించడం లేదు. గత దశాబ్దాల కాంగ్రెస్ పాలన మీద విరుచుకు పడడం మీద ఆయన ప్రచారం ఆధారపడినట్లు కనిపిస్తున్నది. తన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి చేసే ఎదురుదాడి తప్ప ప్రజా సమస్యల్ని అవి ప్రతిబింబించడం లేదనే చెప్పాలి. కాంగ్రెస్ ప్రచారం దీనికి భిన్నంగా వుంది. బీజేపీ ఆర్ఎస్ఎస్‌ల విద్వేష రాజకీయాన్ని ఎండగడుతున్నారు. మోదీ పాలనంటే అందరినీ దోచుకోవడం దానిని తన మిత్రులకు పంచడం మాత్రమేనని ప్రకటిస్తున్నారు. దీనికితోడు ఆరు గ్యారంటీల పేరుతో పేదలకు, సామాన్యులకు తక్షణ ఉపశమనం కలిగించే రాయితీలు ఉచితాలు ప్రజల్ని ఆకర్షిస్తున్నాయి. పైగా తామిచ్చిన గ్యారంటీలు ఎన్నికైన మరుక్షణం నుంచి అమలు పరుస్తామని, హిమాచల్‌ప్రదేశ్‌లో, కర్నాటకలో చేసి చూపించామని ప్రకటిస్తున్నారు.

మొత్తం మీద ఉత్తర భారతంలో మోదీ అంధ భక్తులను మినహాయిస్తే సామాన్య ప్రజలు తమ నిత్య జీవిత సమస్యల మీద ఆలోచిస్తున్నారు. చర్చిస్తున్నారు. ప్రశ్నిస్తున్నారు. అవన్నీ సోషల్ మీడియాలో ప్రచారంలోకి వస్తున్నాయి. ఒకసారి జన జీవన సమస్యలు ముందుకొస్తే బీజేపీ విద్వేష రాజకీయం, విభజన రాజకీయం మెల్లమెల్లగా తెరవెనక్కి తరలిపోతుంది. ఈ ఎన్నికలలో ఈ క్రమం ప్రారంభం కావడం స్పష్టంగా కనిపిస్తున్నది.


ఇప్పుడు ఎన్నికల సంఘం గురించి కొంత చెప్పుకోవాలి. బీజేపీ ప్రభుత్వం ఒక స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఒక ప్రభుత్వ శాఖ స్థాయికి తెచ్చుకున్నట్లు కనిపిస్తున్నది. ఒకే దేశం, ఒకే ఎన్నిక అని మోదీ ప్రకటించిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం దానిని పూర్తిగా సమర్థించింది. తగినన్ని ఈవీఎంలు సమకూరిస్తే లోక్‌సభకు, శాసనసభలకీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించే స్థితి తమకు ఉన్నదని ప్రకటించింది.

ఇప్పుడు జరుగుతున్నవి ఐదు రాష్ట్రాల ఎన్నికలు. 83 పార్లమెంటు స్థానాలున్న ప్రాంతాల ఎన్నికలు. వీటికి ఈవీఎంల కొరత లేదు. పారా మిలటరీకి లోటు లేదు. ఒకే దేశం – ఒకే ఎన్నిక జరిపిస్తామని ప్రగల్భాలు పలికిన ఎన్నికల సంఘం ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ఆరు విడతలు చేసి, 40 రోజులు సాగదీసి ఎందుకు పెడుతున్నది ? కేవలం మోదీ షాల ప్రచార అవసరాల కోసం తప్ప వేరు కారణం కనిపించడం లేదు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగడానికి స్వతంత్ర ప్రతిపత్తిగల ఎన్నికల సంఘం అవసరం. అలాంటి ఎన్నికల సంఘం ఎంపిక కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తప్పక పాటించాలి.

**- డీవీవీఎస్ వర్మ**

**సంపాదకులు, 85006 78977**

# పాలస్తీనాలో యూదులు !



సేకరణ : దివికుమార్

\- మహాత్మాగాంధీ

పాలస్తీనాలో అరబ్బులు-యూదుల అంశంపైన, జర్మనీలో యూదుల ఊచకోతపైన నా అభిప్రాయం తెలియజేయాలని నాకు చాలా మంది ఉత్తరాలు రాశారు. ఈ క్లిష్టమైన అంశంపై కొంత జంకుతోనే నా అభిప్రాయాలను తెలియజేయడానికి సాహసిస్తున్నాను. యూదుల మీద నాకు సానుభూతి ఉంది. దక్షిణాఫ్రికాలో ఉండగా వారిని సన్నిహితంగా చూశాను. వారిలో కొందరు నాకు జీవితకాల సహచరులయ్యారు. ఇలాంటి మిత్రుల ద్వారానే దీర్ఘకాలంగా యూదులు అనుభవించిన వేధింపులు, క్షోభ గురించి నాకు తెలిసింది. వారిని క్రైస్తవులు అంటరానివారిగా చూసేవారు. క్రైస్తవులు యూదులను అంటరానివారిగా చూడడానికి, అంటరానివారిని హిందువులు చూడడానికి దగ్గరి పోలిక ఉంది. వారితో అమానుషంగా ప్రవర్తించడం కోసం ఈ రెండు మతాల్లోనూ మత సమ్మతి ఉన్నట్టు చిత్రీకరించారు. కొందరు యూదులు నాకు మిత్రులైనందు వల్లే కాకుండా వారి విషయంలో నాకు సానుభూతి ఉండడానికి విశ్వజనీనమైన ఉమ్మడి కారణం ఒకటి ఉంది. అయితే నాకు సానుభూతి ఉన్నంత మాత్రాన న్యాయం ఏదో తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకుపోలేదు. తమకు ఒక దేశం ఉండాలన్న యూదుల కోరిక నన్ను అంతగా ఆకట్టుకోలేదు. దీనికోసం బైబిల్ నుంచి సాక్ష్యాధారాలు వెతుకుతారు. పాలస్తీనాకు వచ్చిన తర్వాత వారిలో తమకు ఓ దేశం కావాలన్న మంకుతనం బాగా పెరిగింది. ఈ భూగోళం మీద ఉండే ఇతరుల్లాగా వారు తాము జన్మించిన, ఉపాధి చూసుకున్న, జీవనోపాధిని చూసుకున్న చోటనే తమ దేశంగా ఎందుకు భావించరు ? ఇదే అర్థంలో పాలస్తీనా అరబ్బులదే ! అంటే ఇంగ్లాండు ఇంగ్లీషు వారిదైనట్టుగా, ఫ్రాన్స్ ఫ్రెంచి వారిది అయినట్టుగా, అరబ్బుల మీద యూదులను రుద్దడం తప్పే కాదు అమానుషం కూడా !

ఏ నీతి సూత్రం ఆధారంగా చూసినా పాలస్తీనాలో ప్రస్తుతం జరుగుతున్న దాన్ని సమర్థించలేం. దీనికోసం ఇచ్చే ఆదేశాలకు యుద్ధాన్ని మించిన ధర్మబద్ధత ఏమీ లేదు. అరబ్బుల గౌరవాన్ని తగ్గిస్తే పాలస్తీనాను యూదులకు పాక్షికంగానో, సంపూర్ణంగానో అప్పగించేయవచ్చు అనుకోవడం మానవాళి మీద కొనసాగించే నేరమే. దీని బదులు యూదులు ఎక్కడ పుట్టి పెరిగినా వారిని న్యాయంగా పరిగణించడం మహత్తరమైన మార్గం అవుతుంది. ఫ్రాన్స్‌లో పుట్టిన యూదులు సైతం, ఫ్రాన్స్‌లో పుట్టినవారు ఫ్రెంచి వారైనంతగా అక్కడ పుట్టిన యూదులు ఫ్రెంచివారే. యూదులకు ఒక దేశం లేకపోతే, పాలస్తీనానే తమ దేశం అని పట్టుబడితే, తాము ఏ దేశాలలో అయితే స్థిరపడ్డారో అక్కడి నుంచి తరిమేస్తే సహిస్తారా ? లేదా వారు ఎక్కడబడితే అక్కడ ఉండడానికి రెండు దేశాలు కావాలా? తమకు ఒక దేశం కావాలన్న ఆరాటం జర్మనీ నుంచి యూదులను తరిమి వేయడాన్ని సమర్థించడానికే ఉపయోగపడుతుంది. అయితే జర్మనీలో యూదులను వేధించిన తీరుకు సాటి అయింది చరిత్రలో మరో ఉదంతమే లేదు. హిట్లర్ వెర్రిగా ప్రవర్తించినట్టు ఏ నియంతా ప్రవర్తించలేదు. హిట్లర్ చాలా కసిగా యూదులను వేధిస్తున్నాడు. అంటే ఆయన ఇతరులను, సమరశీలమైన జాతీయతావాదాన్ని సమర్థించడానికి నూతనోత్సాహంతో ఈ పని చేస్తున్నాడు. 'కొత్త మతోన్మాదాన్ని ప్రవేశపెడుతున్నారు' ఇలాంటి స్థితిలో ఎంతటి అమానుషమైనా మానవతావాదంగా చెలామణి అయిపోతుంది. దీనికి ప్రస్తుతం భవిష్యత్తులో కూడా గౌరవం ఉంటుంది. పూర్తిగా పిచ్చెత్తినట్టు, అత్యంత నిర్భయంగా ప్రవర్తించే యువత ఆ మొత్తం జాతిని నమ్మలేనంతటి క్రౌర్యంతో ఆవరిస్తోంది. మానవత్వం పేరుతో



ఇంతకన్నా సమర్థనీయమైన యుద్ధం ఏదైనా ఉంటే ఒక జాతినంతటినీ వేధించుకు తినడాన్ని నిరోధించడానికి జర్మనీపై యుద్ధంకన్నా సమర్థనీయమైంది ఏమీ లేదు. కానీ నాకు ఏ రకమైన యుద్ధంలోనూ నమ్మకం లేదు. అందువల్ల అలాంటి యుద్ధం మంచి చెడ్డలు చర్చించడం నా ఊహలోనూ, పరిధి లోనూ లేదు. యూదులను వేపుకు తిన్నందుకు జర్మనీపై యుద్ధం చేయలేక పోయినా జర్మనీతో సంబంధం మాత్రం కుదరదు. న్యాయం కోసం, ప్రజాస్వామ్యం కోసం నిలబడు తున్నామని చెబుతున్న ఒక జాతి ఈ రెండింటికీ బద్ధశత్రువు అయితే దానితో మైత్రి ఎలా కుదురుతుంది ? లేక ఇంగ్లాండ్ సకల విషయాల్లోనూ సాయుధ నియతృత్వం వైపు మొగ్గుతోందా? ఎలాంటి కపటమూ, బలహీనత లేకుండా మానవత్వం ముసుగులో సమర్థంగా హింసకు పాల్పడవచ్చో జర్మనీ నిరూపిస్తోంది. తన నగ్న స్వరూపాన్ని ప్రదర్శిస్తూ ఎంత వికృతంగా, దుర్భరంగా ప్రవర్తించవచ్చునో జర్మనీ రుజువు చేస్తోంది. ఇలాంటి వ్యవస్థీకృత, నిస్సిగ్గుతో కూడిన వేధింపును యూదులు ప్రతిఘటించగలరా ? వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకునే మార్గం ఏమైనా ఉందా ? నిస్సహాయంగా, నిర్లక్ష్యంగా, ఒంటరితనం అనుభవించకుండా ఉండడం సాధ్యమా ? నాకు సాధ్యమేననిపిస్తోంది. భగవంతుడి అస్తిత్వాన్ని నమ్మే ఏ వ్యక్తి అయినా ఒంటరిగా, నిస్సహాయంగా మిగిలి పోనక్కర్లేదు.

యూదుల యెహోవా క్రైస్తవుల దేవుడికన్నా, ముస్లింలు లేదా హిందువుల దేవుడికన్నా భిన్నమైనవాడు కాదు. ఆ దేవుడు అందరికీ సమానమే. అద్వితీయుడే. వర్ణించనలవి కానివాడే. కానీ యూదులు, దేవుడికి ఒక వ్యక్తిత్వం అంటగడతారు. ఆయనే తమ ప్రతి చర్యనూ సమర్థిస్తాడనుకుంటారు. అందువల్ల వారు నిస్సహాయులుగా ఉండిపోనక్కర్లేదు. నేను జర్మనీలో పుట్టి, అక్కడే నా జీవనోపాధి చూసుకున్న వాడిని అయి ఉంటే, జర్మనీ ఎంత శక్తిమంతమైంది అయినప్పటికీ జర్మనీయే నా దేశం అని గట్టిగా నినదించేవాడిని. సవాలు చేసేవాడిని. లేక నన్ను కాల్చేయమని లేదా చీకటి కూపంలో పడవేయమని కోరేవాడిని. కానీ బహిష్కరణను, వివక్షాపూరిత వ్యవహారాన్ని ఎట్టి పరిస్థితి లోనూ అంగీకరించే వాడిని కాదు. ఆ పని చేయడానికి తోటి యూదుల కోసం ఎదురు చూడనక్కర్లేదు. చివరకు అందరూ నా దారికే వస్తారన్న విశ్వాసం ప్రదర్శించేవాడిని.

### పాలస్తీనాలో యూదుల గురించి ఒక్క మాట


వారు తప్పుడు దారిలో ప్రయాణిస్తున్నారనడానికి నాకు ఏ మాత్రం సందేహం లేదు. బైబిల్ భావన ప్రకారం పాలస్తీనా అనేది భౌగోళికమైంది కాదు. అది వారి మనసుల్లో ఉంది. కానీ భౌగోళికంగా పాలస్తీనా తమ దేశం అని యూదులు అనుకు నేట్టయితే బ్రిటిష్ వారి తుపాకీ నీడన ఆ పని చేయనక్కర్లేదు. మతపరమైన చర్యను తుపాకులు లేదా బాంబుల సహాయంతో చేయకూడదు. అరబ్బుల మన:పూర్వక సమ్మతితోనేవారు ఆ పని చేయాలి. వారు అరబ్బుల హృదయాలను మార్చాలి. అరబ్బుల హృదయాలపై రాజ్య మేలే దేవుడే యూదుల హృదయాలపైనా రాజ్యమేలుతాడు. తమ మతపరమైన ఆకాంక్షల ఆధారంగా వారు ప్రపంచం అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చా లనుకుంటారు. అరబ్బులకు నచ్చచెప్పడానికి వందలాది మార్గాలు వున్నాయి. అయితే దీనికి వారు బ్రిటిష్ వారి తుపాకీ నీడను విడనాడాలి. ఇప్పటికే ఏ పొరపాటు చేయని ప్రజలను బ్రిటిష్ వారితో కలిసి అరబ్బులను విపరీతంగా లూటీ చేశారు. అరబ్బుల అకృత్యాలను నేను సమర్థించడం లేదు. వారు తాము నమ్మిన దాని కోసం ప్రతిఘటించాలనుకుంటే అహింసామార్గాన్ని అనుసరించవలసింది. తమ దేశాన్ని నిష్కారణంగా ఆక్రమించు కున్నారని అనుకున్నట్టయితే అహింసామార్గాన్ని ఎంచుకోవల సింది. అయితే తప్పొప్పులు అన్న సర్వజనామోదయోగ్యమైన భావనలకు అనుగుణంగా అనేక దురాగతాలను ఎదుర్కొన్న అరబ్బుల ప్రతిఘటనకు వ్యతిరేకంగా మాట్లాడలేం!

> **తాము దేవుడు నియమించిన వాళ్లం అని చెప్పుకునే యూదులు అహింసామార్గాన్ని అనుసరించి ప్రపంచంలో తమ స్థానం ఏమిటో నిరూపించుకోవాలి. దేవుడు తమను నియమించాడు అన్న అంశాన్ని రుజువు చేసుకోవాలి. పాలస్తీనా సహా అన్ని దేశాలూ యూదులకు తమ దేశాలే. అయితే అది దురాక్రమణ ద్వారా కాకుండా, ప్రేమాభిమానాలు, సేవాభావం వల్ల సాధించింది అయి ఉండాలి.**

ఒక మిత్రుడు సిసిల్ రోత్ నాకు రాసిన మానవ నాగరికతకు యూదులు చేసిన దోహదం మీద ఒక గ్రంథం పంపించారు. ప్రపంచ సాహిత్యాన్ని, కళలను, సంగీతాన్ని, నాటకాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని, వైద్యాన్ని, వ్యవసాయాన్ని సుసంపన్నం చేయడానికి యూదులు ఏం చేశారో ఆ గ్రంథంలో ఉంది. వారికి సంకల్పబలమే ఉంటే పశ్చిమ దేశాలు తమను వెలివేయడాన్ని అంగీకరించకూడదు. లేదా తమను అసహ్యించుకోవడాన్ని, మద్దతివ్వడాన్ని కూడా అంగీకరించకూడదు. దేవుడు నియమించినవారే అయితే ప్రపంచం గుర్తింపు పొందడానికి ఎవరి ముందూ లొంగి ఉండవలసిన అవసరం లేదు. అహింసాయుతమార్గం ద్వారా తాము ఇంతకు ముందు చేసిన దానికన్నా మానవాళికి ఎక్కువచేసి చూపించవచ్చు. ❑

**(పలస్తీనా నడిగడ్డపై యూదులకు దేశం ఏర్పాటు చేయడానికి పదమూడేళ్ల ముందే 1935లో గాంధీజీ రాసిన వ్యాసం.)**

# పాలస్తీనాను యూదులు ఆక్రమించిన వైనం



- జవహర్‌లాల్ నెహ్రూ


పాలస్తీనా సిరియా సరసనే ఉంటుంది. నానా జాతి సమితి (ఐక్యరాజ్య సమితికి పూర్వం ఉన్న వ్యవస్థ) పాలస్తీనా పాలనాధికారాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి అప్పగించింది. ఇది చాలా చిన్న దేశం. జనాభా పది లక్షలకులోపే. పాలస్తీనా యూదులకు, క్రైస్తవులకు, కొంతమేర ముస్లింలకు కూడా పవిత్రమైన ప్రాంతం. ఈ ప్రాంతంలో ఎక్కువగా నివసించేది ముస్లింలైన అరబ్బులే. సిరియాలాగే వారు తమకు స్వేచ్ఛ కావాలని కోరుతున్నారు. కానీ బ్రిటిష్ వారు అనుసరించిన విధానాల వల్ల యూదులు అల్ప సంఖ్యాకులయ్యారు. యూదులు బ్రిటిష్ వారికి అండగా ఉంటారు. పాలస్తీనియన్ల స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకిస్తారు. పాలస్తీనాకు స్వాతంత్ర్యం ఉంటే అరబ్బుల పాలన వస్తుందని యూదుల భయం. ఇద్దరూ చెరో వేపు లాగుతారు కనక ఘర్షణ అనివార్యం అవుతోంది.

అరబ్బుల జనాభా ఎక్కువ. కాని, యూదుల దగ్గర ఆర్థిక వనరులున్నాయి. ఇంగ్లాండ్ యూదుల మతపరమైన జాతీయతా వాదానికి, అరబ్బుల జాతీయ వాదానికి మధ్య పోటీ పెడుతుంది. ఈ రెండు పక్షాల మధ్య శాంతి నెలకొనడానికి, మధ్యవర్తిత్వం వహించడానికి తాము ఉండాలని ఇంగ్లాండ్ అనుకుంటుంది. ఇలాంటి పరిస్థితి సామ్రాజ్యవాద ఆధిపత్యంలో వున్న ఇతరచోట్ల కూడా కనిపించే పాత కుట్రే. అది పదే పదే పునరావృతం కావడమే ఆశ్చర్యకరం.

యూదులు విలక్షణమైన వారు. మొదట వారు పాలస్తీనాలో చిన్న తెగగా లేదా అనేక తెగలుగా ఉండే వారు. వారి ప్రాచీన చరిత్ర బైబిల్ పాత నిబంధనలో కనిపిస్తుంది. వారు తమను తాము దేవుడి సంతానం అనుకుని గర్వం ప్రదర్శించే వారు. కానీ అన్ని రకాల ప్రజలు ఇలాంటి గర్వం ప్రదర్శించిన వారే. యూదుల మీద పదే పదే ఆక్రమణలు జరిగాయి. వారిని అణచివేశారు. బానిసలను చేశారు. బైబిల్ సాధికారిక ఇంగ్లీషు అనువాదంలో వీరి అందమైన, కదిలించే కవిత్వం కనిపిస్తుంది. వారి విషాద గీతాలు ఉంటాయి. బైబిల్ ఉన్న మూలభాష అయిన హీబ్రూలో ఇవి మరింత అందంగా ఉంటాయనుకుంటాను.

**చివరకు యూదులు ప్రపంచమంతా చెల్లా చెదురయ్యారు. వారికి ఓ దేశము లేదు. వారు ఎక్కడికి వెళ్లినా ఆదరించలేదు. వారిని పరాయివారిగానే చూశారు. వీరివల్ల ఇతరులు కలుషితం కాకుండా వారిని ఊరి చివర వెలివాడల్లో ఉంచేవారు. వారిని అవమానించేవారు. దూషించేవారు. హింసించేవారు. మూకుమ్మడిగా హత్య చేసేవారు. 'యూదు' అన్న మాటే తిట్టు అయింది. పిసినారి, ముక్కు పిండి వడ్డీ వసూలు చేసే వడ్డీ వ్యాపారి అన్నట్టుగా తయారైంది.**

అయినా ఆశ్చర్యకరంగా వారు మనగలిగారు. తమ సాంస్కృతిక లక్షణమైన విపరీత లక్షణాన్ని కాపాడుకున్నారు. బాగా అభివృద్ధి సాధించారు. వారిలో చాలా గొప్ప వారు తయారయ్యారు. ఇప్పుడు వారు శాస్త్రజ్ఞులు, రాజనీతిజ్ఞులు, సాహితీవేత్తలు, డబ్బు మదుపు పెట్టే వారు. వ్యాపారస్థులుగా తయారయ్యారు. వారిలో గొప్ప సోషలిస్టులు, కమ్యూనిస్టులు కూడా ఉన్నారు. అయితే కొందరు అభ్యున్నతి చెందక పోగా తూర్పు యూరప్ నగరాల్లో కిక్కిరిసి ఉన్నారు. అప్పుడప్పుడు హత్యాకాండకు, మారణకాండకు గురయ్యారు. వీరికి ఒక స్వస్థలం లేదు. దేశం లేదు. కానీ వారిలో పేదవారు పాత జెరూసలెం తమ దేనని కలలు కంటూనే ఉన్నారు. వారి దృష్టిలో అది మునుపటికన్నా మహత్తరమైంది. వారు జెరూసలెంను జియాన్ అంటారు. జియానిజం (యూదు మతవాదం) వారిని



జెరూసలెంకు, పలస్తీనాకు లాగుతూ ఉంటుంది. 19వ శతాబ్ది చివరి నాటికి ఈ జియానిస్టు ఉద్యమం క్రమంగా వలసవాద ఉద్య మంగా తయారై చాలామంది యూదులు పలస్తీనా వెళ్లి స్థిరపడ్డారు. హిబ్రూ భాష కూడా పురుజ్జీవించింది. ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ సేనలు పాలస్తీనాను ఆక్రమించాయి. వారు జెరూసలెంను ఆక్రమించినప్పుడే 1917 నవంబర్‌లో బాల్ఫోర్ ప్రకటన జారీ చేశారు.

**పాలస్తీనాలో యూదులకు ఓ దేశం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 'యూదుల జాతీయ ఆవాసం' ఏర్పాటు చేయడం తమ ఉద్దేశం అని బ్రిటన్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూదుల అభిమానం పొందడానికి ఈ మాట చెప్పారు.**

దీనిలో డబ్బు ప్రాధాన్యమూ ఉంది. యూదులు దీనిని ఆహ్వానించారు. అందులో ఓ చిన్న లోపమూ ఉంది. అప్పటికి పాలస్తీనా నిర్జన ప్రదేశం కాదు. అది అంతకుముందే మరొకరికి ఆవాసం. అంటే బ్రిటిష్ ప్రభుత్వం యూదులకు ఇచ్చిన హామీ పలస్తీనాలో అదివరకే ఉంటున్న వారికి వ్యతిరేకంగా చేసిన ప్రకటన. అక్కడ అరబ్బులు, అరబ్బులు కాని వారు, ముస్లింలు, క్రైస్తవులు నిజానికి యూదులు కాని వారందరూ ఉండేవారు. వీరంతా బ్రిటన్ ప్రకటనను ప్రతిఘటించారు.

యూదులు అన్ని కార్యకలాపాల్లో తమతో పోటీ పడతారని, వారికి సంపత్తి ఉన్నందు వల్ల తమ దేశ ఆర్థిక వ్యవస్థను శాసిస్తారని భావించారు. యూదులు తమ నోటి దగ్గరి ముద్దను, తమ భూమిని, వ్యవసాయాన్ని లాగేస్తారని భయపడ్డారు. అప్పటి నుంచి పాలస్తీనా అరబ్బులు, యూదుల మధ్య ఘర్షణ మొదలైంది. బ్రిటిష్ ప్రభుత్వం అవసరం కొద్దీ ఎటు పడితే అటు మొగ్గింది. కానీ ఎక్కువగా యూదులనే సమర్థించేది. స్వయం పరిపాలన లేకుండా ఆ దేశాన్ని బ్రిటిష్ వలస రాజ్యంగా భావించేవారు. క్రైస్తవులు, యూదులు కాని ఇతరుల మద్దతుతో అరబ్బులు స్వయం నిర్ణయాధికారం, సంపూర్ణ స్వేచ్ఛ కావాలని కోరారు. కొత్తగా వలస వచ్చే వారిని వ్యతిరేకించారు. యూదులు వలస వస్తున్న కొద్దీ వారిలో భయం, ఆగ్రహం పెరిగాయి.

బ్రిటిష్ సామ్రాజ్యవాదంతోపాటే జియానిజం ఉంటుందని అరబ్బులు ప్రకటించారు. బలమైన యూదు దేశం ఇండియా చేరుకోవడానికి ఎలా ఉపకరిస్తుందో బాధ్యతాయుతులైన జియానిస్టు నాయకులు వాదించారు. ఎందుకంటే భారత్ అరబ్ జాతీయ ఆకాంక్షలను నిలువరిస్తుందనుకున్నారు. నిమిత్తం లేని చోట ఇండియా ప్రస్తావన అంటే ఇదే. అరబ్ కాంగ్రెస్ బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణ ప్రారంభించి బ్రిటిష్ వారు ఏర్పాటుచేసే చట్టసభల ఎన్నికలను బహిష్కరించింది. ఈ బహిష్కరణ విజయవంతమైంది. సహాయ నిరాకరణ చాలా సంవత్సరాలు కొనసాగింది. ఆ తర్వాత కొన్ని బృందాలు బ్రిటిష్ వారితో సహకరించడంతో ఆ వ్యతిరేకత బలహీనపడింది. అయినా చట్టసభ ఏర్పాటు కాలేదు. హైకమిషనర్ సర్వ శక్తి మంతుడైన సుల్తాన్ లా పాలించేవాడు. 1928లో వివిధ అరబ్బు బృందాలు మళ్లీ ఏకమై ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ తమకు హక్కుగా కావాలని కోరారు. పలస్తీనా ప్రజలు ప్రస్తుత వలసవాదాన్ని ససేమిరా అంగీకరించరని కూడా ప్రకటించారు. ఈ కొత్త అరబ్ జాతీయతా తరంగం ఆర్థిక అంశాల మీద దృష్టి కేంద్రీకరించింది.

1929లో అరబ్బులకు, యూదులకు మధ్య కలహాలు రేగాయి. యూదుల సంఖ్య వారి సంపత్తి క్రమంగా పెరగడం, దీనికి కారణం. పైగా యూదులు అరబ్బుల స్వాతంత్ర్య కాంక్షను వ్యతిరేకించారు. కానీ తక్షణ కారణం మాత్రం 'వెయిలింగ్ వాల్' ఇది హెరోద్ ఆలయంలో ఒక భాగం. ఇది యూదులకు పవిత్రమైంది. తమ పూర్వ వైభవానికి అది చిహ్నం అనుకుంటారు. ఆ తర్వాత అక్కడ ఒక మసీదు కట్టారు. ఈ గోడ మసీదులో భాగం అయిపోయింది. యూదులు ఈ గోడ దగ్గర తమ దుఃఖాన్నీ వెళ్లబోసుకుంటారు. విషాద గీతాలు ఆలపిస్తారు. అత్యంత ప్రసిద్ధమైన మసీదు దగ్గర ఏడ్వడాన్ని ముస్లింలు వ్యతిరేకిస్తారు.

కలహాలను అణచివేసిన తర్వాత వివిధ పద్ధతుల్లో పోరాటం కొనసాగింది. అరబ్బులకు పాలస్తీనాలోని చర్చిల మద్దతు లభించింది. ముస్లింలు, క్రైస్తవులు కలిసి పెద్ద సమ్మెలు, ప్రదర్శనలు నిర్వహించారు. మహిళలు పాల్గొన్నారు. నిజానికి ఇక్కడ సమస్య మతం కాదు. కొత్తగా వచ్చిన వారికి, అంతకు ముందు నుంచి ఉన్న వారికి మధ్య ఆర్థిక ఘర్షణలే కారణం. బ్రిటిష్ వైఫల్యాన్ని, ముఖ్యంగా 1929 నాటి ఘర్షణలను నిరోధించకపోవడాన్ని నానాజాతి సమితి ఖండించింది. అంటే పాలస్తీనా ఇప్పటికీ బ్రిటిష్ వలస రాజ్యంగానే ఉంది. కొన్ని విషయాలలో అంతకన్నా హీనమైంది. యూదులకు, అరబ్బులకు జగడాలు పెట్టి బ్రిటిష్ వారు కాలం గడుపుతున్నారు. అన్ని ఉన్నత పదవుల్లోనూ బ్రిటిష్ వారే. అరబ్బులు చదువు కావాలనుకున్నా బ్రిటిష్ వారు చేసిందేమీ లేదు. సంపత్తి ఉన్న యూదులు పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసుకున్నారు. ముస్లింల జనాభా మూడు వంతులైతే యూదుల జనాభా నాలుగో వంతు అయింది. వారి ఆర్థిక శక్తి చాలా ఎక్కువ. జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారి మద్దతు కోసం అరబ్బులు ప్రయత్నించారు. కానీ బ్రిటిష్ వారు నిరాకరించారు. అధికసంఖ్యాక ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారు. అందుకే అధిక సంఖ్యాకులైన అరబ్బులు, క్రైస్తవులు యూదుల వైఖరిని గట్టిగా ప్రతిఘటిస్తున్నారు. ❑

**(నెహ్రూ జైలులో ఉన్నప్పుడు ఇందిరా గాంధీకి రాసిన లేఖలు గ్లింప్సెస్ ఆఫ్ వర్ల్డ్ హిస్టరీ గ్రంథం అయింది. నెహ్రూ 1933 మే 29న రాసిన ఉత్తరం ఇది.)**

# ఇది 75 ఏళ్ల పాలస్తీనా గాయం



పి.ప్రసాద్ (ఇఫ్టూ)

గాజాను కేంద్రంగా చేసుకొని ఇజ్రాయెల్‌పై హమాస్ ఏక కాలంలో సముద్ర, వాయు, భూతల మార్గాలలో దాడి చేసింది. గాజా ప్రపంచంలోనే పెద్ద ఆరు బయలు జైలుగా పేరొందింది. ఇజ్రాయెల్ ఆధీనంలోని పాలస్తీనాలో వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం పోగా 365 చ.కి.మీ. విస్తీర్ణంతో మండలం కంటే చిన్నదే గాజా ప్రాంతం. అందువల్ల ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈజిప్టు, సిరియా, జోర్డాన్, లెబనాన్, ఇరాక్, పాలస్తీనా ఒక్కటిగా 1973 అక్టోబర్ 6వ తేదీన ఇజ్రాయెల్‌పై యుద్ధం చేశాయి. ఆరు రోజుల్లో ఇజ్రాయెల్ వాటిని ఓడించింది. యాభై యేళ్ల తర్వాత అదే అక్టోబర్ 7వ తేదీన హమాస్ దాడి జరిగింది. అప్పటికీ ఇప్పటికీ తేడా ఉంది. అది ఆరు దేశాల యుద్ధం. ఇది తన దేశంలోని ఓ ప్రాంత రాజ్యరహిత తిరుగుబాటు సంస్థ చేపట్టిన దాడి. అప్పుడు ఆరు స్వతంత్ర అరబ్ దేశాల్ని ఓడించిన ఇజ్రాయెల్ ఇప్పుడు ఓ తిరుగుబాటు సంస్థ చేతిలో ఉక్కిరిబిక్కిరవుతోంది. హమాస్ దాడులలో క్షిపణులు ఒక భాగమే. వాటికంటే, వేల మంది యువత భాగస్వామ్యం ప్రధానం. విద్యుత్ ముళ్ల కంచెల సరిహద్దు గోడల్ని ఛేదించి ఇజ్రాయెల్ సైనిక రాజ్యంలో చొరబడి దూసుకెళ్లడం అత్యంత సాహసోపేతమైనది. అది ప్రాణార్పణ, త్యాగనిరతి లేకుండా చేయగలిగేది కాదు. గాజా ప్రాంతాన్ని 15 ఏళ్లుగా పాలిస్తున్న హమాస్ వెనక వేలాది యువత ప్రాణార్పణలకు సిద్ధపడే స్థితి ఎలా సాధ్యమైంది?

పాలస్తీనా వివాదం మొదలై మూడు తరాలు గడిచింది. నేడు జీవించేది నాలుగో తరం. తమ ముత్తాతలు, తాతలు, తండ్రుల తరాలు కోల్పోయిన జీవితం నేటి తరాన్ని సాహసిక జాతిగా మార్చింది. తమ స్వంత నేల మీద జీవించే హక్కు లేకుండా తరమబడుతున్న దుస్థితి ఏ మతం వారినైనా ముమ్మాటికీ ఒక సాహసిక జాతిగా తీర్చిదిద్దుతుంది. నాజీ నరమేధానికి బలైన యూదుల పట్ల ప్రపంచవ్యాప్తంగా సానుభూతి వెల్లువెత్తిన నేపథ్యంలో తమకో ప్రత్యేక దేశం కావాలని యూదుల్లో కోరిక తలెత్తింది. అమెరికా, యుఎస్ఎస్ఆర్ సహాయంతో ఐక్యరాజ్య సమితిలో ప్రత్యేక ఇజ్రాయెల్ రాజ్యస్థాపన యత్నం జరిగింది. అరబ్ దేశాలు, భారత్ వంటి దేశాలు దాన్ని వ్యతిరేకించాయి. ఆ నాటి 56 సభ్య రాజ్యాల్లో ఇజ్రాయెల్ ఏర్పాటుకి అవసరమైన మెజారిటీ లేదన్న అనుమానంతో లాబీయింగ్ కోసం అమెరికా మూడు రోజులు ఓటింగ్ వాయిదా వేయించిందనే ఆరోపణ ఉంది. ఆ సందర్భంగా భారత ప్రధాని నెహ్రూ యూదు లాబీ ప్రలోభాలు, వత్తిళ్లపై ఆరోపించారు. ఐరాసలో భారతదేశ ప్రతినిధి విజయలక్ష్మి పండిట్‌కు బెదిరింపులు వచ్చాయని కూడా ఆరోపణ చేశారు. ఎట్టకేలకు 1947 నవంబర్ 29న 33 దేశాల



మద్దతుతో ఐరాస తీర్మానం ఆమోదం పొందింది. ఇండియా సహా 13 దేశాలు వ్యతిరేకంగా, 10 దేశాలు తటస్థంగా ఓటింగ్ చేశాయి. ఒక్క పాలస్తీనా దేశాన్ని 'ద్విరాజ్య పరిష్కారం' పేరిట రెండు దేశాలుగా విడగొట్టే తీర్మానమది. 76 ఏళ్ల తర్వాత నేడు అది కనీసంగా అమలు కావడం లేదు. ఆరు రోజుల యుద్ధం విరమణ తర్వాత-1967లో భద్రతా సమితిలో 242వ తీర్మానం ఏకగ్రీవ ఆమోదం పొందింది. దాని ప్రకారం పాలస్తీనా భూభాగాల నుండి ఇజ్రాయెల్ దురాక్రమణ సేనలు వెంటనే వెనక్కి వెళ్ళాలి. నేటికి 56 ఏళ్లు గడిచినా ఇజ్రాయెల్ దానిని అమలు చేయలేదు. ఈ యుద్ధం ముగిశాక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఆ ప్రకారం-1973 అక్టోబర్‌లో భద్రతా సమితి 338వ తీర్మానాన్ని ఆమోదించింది. ఐదు శాశ్వత సభ్యత్వ దేశాలు సహా 14 దేశాలు దీనిని ఆమోదించాయి. పైగా అమెరికా, సోవియట్ యూనియన్ ఉమ్మడి ప్రతిపాదిత తీర్మానమది. నేటికి సరిగ్గా యాభై యేళ్ళు గడిచినా ఇజ్రాయెల్ దానిని అమలు చేయలేదు. సుదీర్ఘంగా సాగిన రెండవ ఇంతిఫాదా తదనంతరం ఇరు పక్షాలను యుద్ధ విరమణ కోరుతూ-2002లో 1397వ తీర్మానాన్ని 14 దేశాలు ఆమోదించాయి. అయినా, ఇజ్రాయెల్ అమలు చేయలేదు. 1991 మాడ్రిడ్ సభ, 1993 ఓస్లో ఒడంబడిక సూత్రాల్ని ఇజ్రాయెల్ పాటించలేదు. జెనీవా స్ఫూర్తికి విరుద్ధంగా వెళ్ళింది. రెండవ ఓస్లో ఒప్పంద క్రమంలో భద్రతా సమితి-2003లో తిరిగి చర్చని చేపట్టింది. ఈసారి 15 దేశాల ఏకగ్రీవ ఆమోదం ఉంది. అది కూడా పాత తీర్మానాల్ని ఇజ్రాయెల్ అమలు చేయాలని చెప్పింది. దాని గతి కూడా అంతే. పోనీ అంత వరకూ ఫతా హయాంలో జరిగిందని అనుకుందాం. ఆనాటికి పాలనా పగ్గాలు హమాస్ చేపట్టలేదు. ఇజ్రాయెల్ చేత మూడు భాగాలుగా విడగొట్టబడ్డ పాలస్తీనాలో ఒక భాగమే గాజా. ఓస్లో ఒప్పందం ప్రకారం గాజా ప్రాంత ఎన్నికల్లో హమాస్ 2007లో గెలిచింది. హమాస్‌తో చర్చల ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ భీష్మించింది. నెలలపాటు ప్రతిష్టంభన సాగింది. అంతర్జాతీయ దౌత్య ఫలితంగా హమాస్ అధికారం చేపట్టింది. ఆ తర్వాత తీర్మానాలు జరుగుతూనే ఉన్నాయి, ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తూనే ఉంది. 2008లో భద్రతా సమితి ద్విరాజ్య తీర్మానం అమలును కోరుతూ మరో తీర్మానాన్ని ఆమోదించింది. 15 ఏళ్ళు గడిచినా, ఇజ్రాయెల్ అమలు చేయడం లేదు. అమెరికా, పశ్చిమ దేశాలపై తీర్మానాలకు అనుకూలంగా ఓటింగ్ చేస్తుంటాయి. వాటిని బేఖాతరు చేస్తున్న ఇజ్రాయెల్‌పై వత్తిడి మాత్రం తీసుకురావు. దాంతో దౌత్యబంధం తెంచుకోవు. ఈ నేపథ్యంలో ప్రతిఘటన అనివార్యమౌతుంది. అదే మొన్న జరిగింది.

1947 ఐరాస సాధారణ సభ ప్రతిపాదించిన ద్విరాజ్య పరిష్కార తీర్మానం మీద అరబ్బు దేశాలు, భారత్ వంటి దేశాలు వ్యతిరేకంగా ఓటింగ్ చేశాయి. యూదులు, అమెరికా నాడు ద్విరాజ్య వాదన చేశాయి. నేడు అదే 'ద్విరాజ్య విధానం' అమలు కావాలని ఫతా సహా అరబ్బు దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆచరణలో ఇజ్రాయిల్ ఏకరాజ్య విధానాన్ని అమలు చేస్తోంది.

ఇజ్రాయెల్ ఏకరాజ్య విధానానికి ప్రతీకారంగా బలపడి స్థిరపడిందే హమాస్ ఏకరాజ్య విధానం. అయితే, ఇటీవల హమాస్ ప్రతినిధి ఓ రహస్య ప్రదేశం నుండి ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాము సూత్రరీత్యా ఏకరాజ్య విధానానికి కట్టుబడి ఉన్నామనీ, ఇజ్రాయెల్ తన నడమంత్రపు ఏకరాజ్య విధానాన్ని వదులుకొని భద్రతాసమితి తీర్మానాలకు అనుగుణంగా ఆచరణలో ద్విరాజ్య విధానం అవలంబించిన తర్వాత తమ వైఖరి చెబుతామని ఓ మాటన్నాడు. అంటే, ఇజ్రాయెల్ తన పూర్వ ద్విరాజ్య వైఖరికి కట్టుబడి, ఆచరణలో పాలస్తీనా స్వతంత్ర దేశ మనుగడకి అంగీకరిస్తే, హమాస్ కూడా తన పూర్వ ఏకరాజ్య వైఖరి విడనాడి ద్విరాజ్య వైఖరి చేపట్టే అవకాశం ఉందని అర్థం. 1947 ముందు ఉన్న పాలస్తీనా దేశాన్ని రెండుగా విడగొట్టి ఒక భాగం ఇజ్రాయెల్‌గా ఏర్పరిచి, ఇటు పాత పాలస్తీనా, అటు కొత్త ఇజ్రాయెల్ సహజీవనం చేయాలని ఐరాస తీర్మానం 181 చెప్పింది. దానిని అరబ్ దేశాలు వ్యతిరేకించి పాలస్తీనా దేశంలో యూదులకు నివాస అవకాశాలు ఉండాలన్నాయి. 'ఓకే రాజ్యం- రెండు జాతులు' విధానమది. 'మీ పాలస్తీనాతో మా ఇజ్రాయెల్ ఒక దేశం'గా సహ జీవనం చేస్తుందని 75 ఏళ్ల క్రితం యూదుల వాదన. అది 181 ప్రకారం 'ద్విరాజ్య వాదన!'. ఓస్లో చర్చల ప్రక్రియ అరాఫత్ నేతృత్వంలోని ఫతా సంస్థని తన పూర్వ ఏకరాజ్య వైఖరికి స్వస్తి పలికించాయి. 181కి కట్టుబడి 'ద్విరాజ్య' విధానానికి మారింది. అది ఆచరణలో కార్యరూపం ధరించి ఉంటే హమాస్ పుట్టేది కాదేమో ! అంటే ఇజ్రాయెల్‌పై తాజా దాడులు జరిగివుండేవి కాదేమో ! కానీ, ఓస్లో ఒప్పందం ఒకనాటి పాలస్తీనా జాతి హీరో అరాఫత్‌ని జీరో చేసింది. హమాస్ సంస్థని పుట్టించి ప్రబల రాజకీయ శక్తిగా మార్చింది. ఏదీ గాలి నుంచి ఊడిపడదు. నేటి పరిణామానికి మూలకారణం ఐరాస తీర్మానాలు అమలు కాకపోవడం. మొదట 242, 338, 1397, 1515 నెంబర్ తీర్మానాలను ఇజ్రాయెల్‌తో అమలు చేయించడం ప్రపంచ దేశాల బాధ్యత. అదేమీ జరగకుండా హమాస్ ఒక టెర్రరిస్టు సంస్థ అని నిందిస్తూ, గాజాని ధ్వంసం చేస్తే ఫలితం ఉండదు. ఒక జాతి తరాలుగా ఇళ్లు వాకిళ్ళు కోల్పోయి, 75 ఏళ్ల నుండి నెత్తురోడుతున్న దృశ్యాన్ని విస్మరించి, ఇంకోవైపు భారీ పబ్లిసిటీ పొందుతున్న కేవలం ఒకరోజు నెత్తుటి దృశ్యాన్ని మాత్రమే చూసి స్పందించడం సరికాదు. పాలస్తీనా జాతీయులైనా, యూదు జాతీయు లైనా ప్రజలు ప్రజలే. ఏ ప్రజలైనా ఒకటే. ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)**

# పాలస్తీనాలో జాతి నిర్మూలన




- రమాసుందరి

పాలస్తీనా గురించి తెలుసుకోవాలంటే The ethnic cleansing of Palestine అనే ఈ పుస్తకాన్ని తప్పక చదవండి. ఇలాన్ పాపే (Ilan Pappe) అనే పేరుగల ఇజ్రాయిలీ రచయిత, చరిత్రకారుడు ఈ పుస్తకాన్ని రాశాడు. పాలస్తీనా కాజ్‌కు పూర్తి మద్దతుదారులుగా ఉన్న యూదులలో నోమ్ చోమ్‌స్కీ తరువాత అంతటివాడు ఇలాన్ పాపే. ఈ పుస్తకం అంచలంచెలుగా పాలస్తీనా ఎలా ఆక్రమణకు గురైందో వివరిస్తుంది. పాలస్తీనాలో స్వజాతి తుడిచివేతకు ఇజ్రాయిల్ పన్నిన పన్నాగాలు, అమలు పరిచిన విధానాల గురించి సవివరమైన విశ్లేషణ ఈ పుస్తకంలో ఉంది. Ethnic cleansing నిర్వచనం గురించి రాస్తూ 'అనేక జాతుల సమాహారంగా ఉన్న దేశంలో ఒక జాతిని వెళ్లగొట్టి ఇతర దేశాల్లో వారిని శరణార్థులుగా మార్చే ప్రక్రియను జాతి తుడిచివేత' అని అంటారని రాశారు. ఈ ప్రక్రియను అమలుపర్చటానికి మారణ హోమాలు జరుగుతాయని, తరువాత కాలంలో వెళ్లగొట్టిన వారి పేర్లను చరిత్ర నుండి తొలగిస్తారనీ ఆయన రాశారు. 1948 నుండి పాలస్తీనాలో జరిగింది అదేనని అంటారాయన.

'యూదుల రాజ్య'కాంక్షకు ఉన్న మూలాలను ఈ పుస్తకం చర్చిస్తుంది. ఆ రాజ్యం కోసం జియోనిస్టు ఆలోచనాపరులు బిబిలికల్ భూభాగాన్ని తమ అభిమతానికి అనుగుణంగా ఎలా నిర్వచించారో, ఆ నిర్వచనం నుండి యూదులలో అతివాద జాతీయ ఉద్యమాన్ని ఎలా నిర్మించారో చెబుతుందీ పుస్తకం.

1918లో బ్రిటిష్ పాలస్తీనాను ఆక్రమించే వరకు జియోనిజమ్ ఒక జాతీయవాదంగానే ఉందని అంటారు రచయిత. అప్పటికి జియోనిస్టులు పాలస్తీనాలో ఐదు శాతంగానే ఉండేవాళ్లట. వాళ్లు సెటిలర్ కాలనీలలో, ఎవరికీ ఇబ్బంది కలగకుండా జీవించేవారట. మార్క్సిస్టు పదజాలాలన్ని ఉపయోగించి పాలస్తీనాలో సామాజిక, మార్క్సిస్టు విప్లవానికి జియోనిజం ఉపయోగపడుతుందని అధికారిక ఇజ్రాయిలీ చరిత్రక్రమం చెప్పటాన్ని ఈ పుస్తకం ప్రస్తావిస్తుంది. అయితే జియోనిస్టు ప్రాజెక్ట్ అసలు ఉద్దేశం మాత్రం యూదులకు పాలస్తీనాను సొంత దేశంగా, స్వర్గంగా తయారు చేయటమేనని అంటారు రచయిత.




పాలస్తీనా సమస్య మీద ఐక్యరాజ్యసమితి ఆడిన నాటకాల గురించి ఈ పుస్తకంలో ఒక అధ్యాయం ఉంది. పాలస్తీనాలో నివసిస్తున్న మూలవాసుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఐక్యరాజ్యసమితి చేసిన '181 తీర్మానం' (రెండు దేశాల సిద్ధాంతం) ఎంత మోసపూరితమైనదో, దాని ప్రభావం ఎంత నష్టం కలగచేసిందో ఈ పుస్తకం చెబుతుంది. ఈ తీర్మానం చేసిన 1947 నాటికి కేవలం 6 శాతం భూభాగమే ఉన్న యూదులకు ఈ తీర్మానం ద్వారా సగం పాలస్తీనా భూభాగాన్ని కట్టబెట్టారని అర్థం అవుతుంది. ఇది కేవలం పాలస్తీనాను అరబ్ అతీతంగా చేసే ప్రయత్నపు కుట్రని వాలిబ్ ఖలిది అనే రచయిత ఆనాడు అన్న మాటలను రచయిత ప్రస్తావించారు. ఈ అన్యాయం గురించి ఏ పాశ్చాత్య పత్రికలు ఆనాడు రాయలేదని రచయిత చెప్పారు. ఇప్పటి మీడియా కూడా పాలస్తీనా విషయంలో నిజాలను దాచి, అబద్ధాలను ఎలా ప్రచారం చేస్తుందో మనం చూస్తూనే ఉన్నాం. ఈ కుట్రలకు కొనసాగింపుగా జరిగిన నక్బా గురించి సవివరంగా ఈ పుస్తకంలో రాశారు. గ్రామాల నుంచి పాలస్తీనీయులను వెళ్లగొట్టటానికి వాళ్ళ బావుల్లో విషం కలపటం, వాళ్ల ఇళ్లను తగలబెట్టటం, సైనిక బలగాలను ఉపయోగించటం చేశారు.

పాలస్తీనా ప్రజల ప్రతినిధులుగా వచ్చిన వివిధ ప్రభుత్వాలు ఏ ఏ దశల్లో అంతర్జాతీయ

(మిగతా 15వ పేజీలో)

# భారత రాజ్యాంగం..
# వ్యవసాయ సంబంధాలు



- సారంపల్లి మల్లారెడ్డి

రాజ్యాంగ విరుద్ధంగా మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కేంద్రం ఆధీనంలోకి తీసుకొని రాష్ట్రాల హక్కులను కాజేస్తున్నది. రాష్ట్రాల హక్కులలో భూ సమస్య, విద్య, వైద్య, సాగు నీరు తదితర అంశాలు ఉన్నప్పటికీ వాటిని కేంద్రం ఆధీనంలోకి తీసుకోవడానికి పార్లమెంట్‌లో చట్టాలు చేశారు. వాటిని లోక్‌సభ, రాజ్యసభల్లో మూజువాణి ఓటుతో ఆమోదింపజేసుకున్నవే. ఇలాంటి కీలక బిల్లుపై చర్చ జరగకుండానే ఆమోదించి చట్టాలు చేశారు. వీటికి వ్యతిరేకంగా సంవత్సరానికి పైగా లక్షల సంఖ్యలో రైతులు చేసిన పోరాటానికి 2021 నవంబర్ 19న పార్లమెంట్‌లో చేసిన చట్టాలను ఉపసంహరిస్తూ ప్రధాని ప్రకటించారు. పార్లమెంట్‌లో నవంబర్ 29న మూడు చట్టాలను ఉపసంహరిస్తూ సవరణ ప్రతిపాదించారు. అయినప్పటికీ పరోక్షంగా నల్ల చట్టాల భావాలను అమలు జరిపే విధంగా కేంద్ర ప్రభుత్వం జీవోలు విడుదల చేసున్నది. నియంత్రణ తొలగించడంతో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాను కోరుకున్న విధంగా ఫెడరలిజానికి హాని కలిగిస్తున్నది.

### భూ సంస్కరణలు-కేంద్రం అనుసరించిన విధానం

భూ సంస్కరణల చట్టాలు చేయడం రాష్ట్ర జాబితాలో ఉన్నప్పటికీ కేంద్రం ఒత్తిడి మేరకు రాష్ట్రాలు చట్టాలు చేశాయి. సీలింగ్‌ను కుటుంబ అవసర ప్రాతిపదికకు మించి నిర్ణయించడం వలన పేదలకు భూములు దక్కలేదు. 1973లో చట్టాలు చేసి 1975లో అమలుచేశారు. 2005 నాటికి మొత్తం దేశంలో 73,35,937 ఎకరాలు మిగులు భూమిగా తేల్చి, 64,96,471 ఎకరాలు సేకరించారు. అందులో 54,02,101 ఎకరాలు మాత్రమే పంపిణీ చేశారు. నేటికీ లక్షల ఎకరాలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. పట్టణ సీలింగ్ చట్టాన్ని సుస్తవస్థలో పెట్టారు. గ్రామీణ సీలింగ్ చట్టాలను అనేక రాష్ట్రాలు రద్దు చేయడానికి కేంద్రం ఒత్తిడి తెస్తున్నది. ప్రభుత్వ అవసరాల పేరుతో రైల్వేలైన్లు, రవాణా హైవేలకు ఆనుకొని కిలోమీటర్ వరకు భూ సేకరణ చేయడానికి కేంద్రం చట్టం రూపొందించింది. ఈ విధంగా సేకరిస్తే మొత్తం భూమిలో 33 శాతం భూమిని కేంద్రం సేకరించే హక్కు ఏర్పడుతుంది. రైతులకు తగిన పరిహారం ఇవ్వకుండా ఈ భూములను కార్పొరేట్‌లకు హస్తగతం చేస్తారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత వ్యవసాయ ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాధించడానికి రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో కేంద్రం, పంచవర్ష ప్రణాళికలను రూపొందించి పథకాలు కొనసాగించింది. 3వ పంచవర్ష ప్రణాళిక (1961–66) రూ.11,600 కోట్లు, 4వ పంచవర్ష ప్రణాళిక రూ. 24,880 కోట్లు వ్యయం చేసి అధికోత్పత్తి సాధించారు. బ్యాంకులు జాతీయం చేయడం, సంకరజాతి విత్తనాలు రూపొందించడం, మార్కెట్లలో గిట్టుబాటు ధర కల్పించడం, సాగునీటి వనరుల కల్పన, భూ సంస్కరణల అమలు తదితర చర్యలు చేపట్టడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల నుండి ఎగుమతుల స్థాయికి దేశం చేరుకుంది. అలాంటిది గత అనుభవాలను తమకు అనుకూలంగా మార్చుకొని బీజేపీ ప్రభుత్వం ఎగుమతుల స్థాయి నుండి దిగుమతుల స్థాయికి మార్చింది.

### రాజ్యాంగం-హక్కులు

రాజ్యాంగం అర్టికల్ 246 ప్రకారం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలను ప్రకటించడం జరిగింది. దేశంలో వ్యవసాయ పరిశోధనలను సంస్కరణల పేరుతో ఉపసంహరించి విదేశీ టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్నాము. బడా కార్పొరేట్ కంపెనీలైన మాన్‌షాంటో, డూ–పాయింట్, కార్గిల్, సింజెంటాలకు అవకాశం కల్పించారు. దేశంలో 80 శాతం విత్తనరంగం ఈ కంపెనీల చేతిలోనే ఉన్నది. మాన్‌షాంటో తన కంపెనీని బేయర్‌కు అమ్మడం ద్వారా, బేయర్ కంపెనీ వ్యవసాయరంగంపై తమ పట్టును కొనసాగిస్తున్నది. ప్రస్తుతం దేశంలో వ్యవసాయ పరిశోధనలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇతర దేశాల ఉత్పత్తులు ఇక్కడ సక్రమమైన ఫలితాలివ్వడం లేదు. కేంద్రం రాష్ట్రాల మార్కెట్లపై పట్టు సాధించడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. గతంలో 580 మార్కెట్లలో 'ఈ–నామ్' మార్కెట్ పద్ధతిని తెచ్చింది. దేశంలో ఎక్కడి నుండైనా వ్యాపారులు పాల్గొనవచ్చని చేసిన ప్రయత్నం విఫలమైనదని ప్రధాన మోడీ అంగీకరించాడు. తర్వాత మార్కెట్లలో కార్పొరేట్ సంస్థల పెత్తనాన్ని సుస్థిరపర్చడానికి ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర జాబితాలో ఉన్న మార్కెట్లపై కేంద్రం చట్టాలు చేస్తున్నది. ఏటా 18 లక్షల కోట్ల వ్యవసాయ మార్కెట్ లావాదేవీలు సాగుతున్నవి. కనీస మద్ధతు ధరల అమలు జరుగకపోవడం వల్ల ఏటా రైతులు రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆర్థికవేత్త అశోక్ గులాటి ప్రకటించారు. సహకార వ్యవస్థను ఇప్పటికే కేంద్రం హస్తగతం చేసుకుంది. దేశంలోని 92 వేల సహకార సంఘాలను విస్తరించడానికి చట్టాలలో మార్పులు తెచ్చింది. మరో 2 లక్షల సంఘాలను ఏర్పాటు

చేస్తానని ప్రకటించింది. బహుళ రాష్ట్రాల సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి చట్టం చేసి, దాని నిర్వహణను కేంద్ర హెూంశాఖా మంత్రి అమిత్‌షాను నియమించింది. గతంలో అమిత్ షా గుజరాత్ సహకార మంత్రిగా వున్నప్పుడు అక్కడి వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాడు. ఎఫ్.పి.ఓ (ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్)ను 10 వేల సంఘాలను ఏర్పాటు చేసి, వాటి వ్యా పార లావాదేవీలు కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నా రు. ప్రజలను మభ్యపెట్టడానికి సహకారరంగాన్ని అభివృద్ధి చేస్తు న్నట్లు చెబుతూనే ప్రజల భాగస్వామ్యాన్ని రద్దు చేసి, కార్పొరేట్ల హక్కులను సుస్థిరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం సహ కార సంఘాల్లో గల 12 కోట్ల సభ్యుల వాటా ధనాన్ని కాజేయ డానికి కేంద్రం పథకం రూపొందించి, అనుకూలంగా చట్టాలు చేస్తున్నది. ఇది సూటిగా రాష్ట్రాల హక్కులను కాజేయడమే.

ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలను కేంద్రం కార్పొరేట్‌లకు అనుకూలంగా పార్లమెంట్‌లో చట్టాలు చేస్తున్నది. ఈ మధ్య అడవుల్లో గనుల తవ్వకాలకు అనుకూలంగా చట్టం చేసింది. దీని వలన అడవుల్లో నివసిస్తున్న గిరిజనులకు ప్రమాదం ఏర్ప డింది. వారు సాగుచేస్తున్న పోడు భూముల నుండి గెంటి వేస్తు న్నారు. అడవులలోనే పుట్టి అక్కడే ఉంటున్న కోట్లాది మంది గిరి జనులకు ఈ చట్ట సవరణ ప్రమాదకరంగా మారింది. ఆహార పదార్థాల కల్తీ, జంతువులపై క్రూరత్వ నిషేదాలకు అనుగుణం గా చట్టాలను రూపొందించి గోవధ నిషేధం పేరుతో దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు చేస్తున్నారు. ఆహారపు అలవాట్లను మార్చివేస్తున్నారు. స్వయంపోషకత్వం పెంపుదల చేయకుండా దిగుమతులపై ఆధారపడుతున్నారు. అధికోత్పత్తి జరిగినప్పటికీ వంట నూనెలు, పప్పులు, పత్తి, పంచదార, జూట్, మాంసం, పాలు, పాల ఉత్పత్తులు ఏటా 5 లక్షల కోట్ల రూపాయల విలువ కలవి దిగుమతి చేసుకుంటున్నాము. తద్వారా మన ఉత్పత్తులపై ప్రభావం పడి రైతులు దెబ్బతింటున్నారు. 41 కోట్ల ఎకరాల సాగు భూమితో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్న దేశంలో దిగుమతులు చేసుకోవడం వలన స్వదేశీ ఉత్పత్తులు దెబ్బ తింటు న్నాయి. చివరికి హార్టికల్చర్ పంటలు, కూరగాయలు కూడా దిగుమతులు చేసుకుంటున్నాము. రాష్ట్ర పట్టికను పరిశీలిస్తే భూమి హక్కులు రాష్ట్ర జాబితాలో ఉన్నాయి. కానీ కేంద్రం భూ సేకరణ చట్టానికి సవరణ తేవ డానికి ప్రయత్నించి విఫలమైంది. రాష్ట్రాలకే సవరణల బాధ్యతలను అప్పగించింది. ప్రణాళికా బోర్డులు రద్దుచేసి, నీతి ఆయోగ్‌ను ఏర్పాటుచేసి కౌలు చట్టాలను రూపొందించి అమలు చేయాలని రాష్ట్రాలను కోరింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాలలో కౌలు చట్టాలు ఉన్నాయి. వ్యవసాయ రుణాలు ఇవ్వడంపై రిజర్వుబ్యాంక్ రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఆ సూచనల ప్రకారం రాష్ట్రాలలోని బ్యాంకులు తమ వ్యాపార ధనంలో 40 శాతం వ్యవసాయ రుణాలివ్వాలి. కానీ కేంద్రం అడ్డుపడి, రుణాలివ్వకుండా విధానాలు రుపొందిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల రుణాలు మాఫీ ప్రకటించినప్పుడు బ్యాంకుల నుండి నిధులు విడుదల కాకుండా కేంద్రం అడ్డుపడుతున్నది. ఫలితంగా రాష్ట్రాలు రుణమాఫీ ప్రకటించినప్పటికీ, రైతుల వడ్డీ భారం పెరుగుతున్నది. బ్యాంకులు రుణాలివ్వకపోవడంతో ప్రైవే టు రుణాలపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. వ్యవసా య భూములు అన్యాక్రాంతం చేయడం, భూముల కొలతలు, రిజిస్ట్రేషన్ తదితర అంశాలన్నీ రాష్ట్రాల హక్కుల కిందికే వస్తాయి. పంటల ధరలు నిర్ణయించడం, సేకరించడం రాష్ట్రాలే చేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలను నిర్ణయించి దేశ రైతులకు ఏటా రూ.4 లక్షల కోట్ల నష్టం కలిగిస్తూ, కార్పొరేట్‌లకు లాభాలు చేకూర్చి పెడుతు న్నది. మార్కెట్‌లపై కార్పొరేట్‌ల అధికారాన్ని సుస్థిరం చేయడా నికి జీవోలు విడుదల చేస్తున్నది. విత్తనాల పరిశోధన, విస్తరణ, బాధ్యతలు రాష్ట్రానికే ఉన్నప్పటికి రాష్ట్రాలు విత్తన చట్టం చేయ కుండా కేంద్రం అడ్డుపడుతున్నది. 2004లో కేంద్రం పార్లమెం ట్‌లో ప్రవేశపెట్టిన విత్తన బిల్లు నేటికి పెండింగ్‌లోనే ఉంది. రాష్ట్రాలు చట్టం చేయకుండా కేంద్రం బెదిరింపులు సాగిస్తున్న ది. ప్రోసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేసి రైతులకు అదనపు ఆదాయం రాబట్టడానికి జరుగుతున్న ప్రయత్నాలకు కేంద్రం విఘాతం కలిగిస్తున్నది. ముడి వ్యవసాయ ఉత్పత్తులను అమ్మ డం వలన రైతులు నష్టపోతున్నారు. ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు-దిగుమతుల ద్వారా రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నారు. మిగులు పంటలు ఎగుమతులు చేసి అవసర మైన పంటల ఉత్పత్తులను దిగుమ తులు చేయాలి. కానీ ప్రపం చంలోనే మొదటి స్థానంలో ఉత్పత్తి అవుతున్న పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, కోళ్ళు, పత్తి, పంచదార ఉత్పత్తులను దిగు మతి చేసుకుంటున్నాము. ఫలితంగా ఇక్కడి పంటలకు ఉత్పత్తి వ్యయం కన్నా తక్కువ లభిస్తున్నది. దివాళా తీసిన రైతులు ఏటా 12,600మంది 13 రాష్ట్రాల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యల నివారణకు ఏ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. ఈ మధ్య బియ్యం ఎగుమతులను నిషేధించడంతో ఇక్కడ ధరలు తగ్గడమే కాక విదేశాలలో ధరలు పెరిగి అక్కడ ఉన్న వ్యాపారు లకు కోట్ల డాలర్ల లాభాలు వచ్చాయి. జి-7 దేశాల ఆదేశాలకు లొంగి మన వ్యవసాయ విధానాన్ని రూపొందిస్తున్నారు. గతంలో తెచ్చిన మూడ నల్ల వ్యవసాయ చట్టాలను డబ్ల్యూటిఓ డైరెక్టర్ జనరల్ ఒత్తిడి మేరకే తేటవడం జరిగింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల దృష్ట్యా పార్లమెంట్‌లో ఆమోదించిన నల్ల చట్టాలను ఉపసం హరించుకోవడం చారిత్రాత్మకమే. సెజ్‌ల పేరుతో(పారిశ్రామిక) కేంద్రాలు ఏర్పాటు చేయాడానికి లక్షల ఎకరాల భూములను రాష్ట్రాలతో సంబంధం లేకుండా సేకరిస్తున్నారు.

**(మిగతా 15వ పేజీలో)**

# భూసంస్కరణలపై స్వామినాథన్ సిఫారసుల విస్మరణ



- డాక్టర్ కొల్లా రాజమోహన్

ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ గారి మరణం భారతదేశ రైతాంగానికి తీవ్రమైన విషాదం కలిగించింది. అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి విత్తనాలను అభివృద్ధి చేసి వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర వహించిన డాక్టర్ స్వామినాథన్, భారతదేశం గర్వించదగ్గ వ్యవసాయ శాస్త్రవేత్త. ఇంటర్నేషనల్ బోర్డ్ ఫర్ జెనిటిక్ రీసెర్చ్, ఇక్రిసాట్ రూపకల్పన, ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లను స్థాపించారు. ఫిలిప్పీన్స్‌లో అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థను రాక్ ఫెల్లర్, ఫోర్డ్ ఫౌండేషన్ల సహాయంతో స్థాపించి, అధిక దిగుబడి వరి వంగడాలను కనుగొన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారమైన వరల్డ్ ఫుడ్ ప్రైజ్ 1987లోనే ప్రప్రథమంగా అందుకున్నారు. ఆ ప్రైజ్‌మనీ రెండు లక్షల డాలర్లను భావి తరాల పరిశోధనకు స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఇచ్చారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్, రామన్ మెగసెసే అవార్డ్, అల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రపంచ సైన్స్ అవార్డ్, ఇందిరాగాంధీ శాంతి బహుమతి, ఇందిరాగాంధీ సమైక్యతా పురస్కారాలను అందుకున్నారు. వరి, గోధుమ పంటలపై ఆయన చేసిన పరిశోధనల మూలంగా భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. హరిత విప్లవంగా పిలిచే గ్రీన్ రివల్యూషన్ సృష్టికర్త స్వామినాథన్. అమెరికా షరతులను ఒప్పుకుని, పీఎల్ 480 నిధులద్వారా గోధుమలను దిగుమతి చేసుకున్న భారతదేశాన్ని, ఆహారాన్ని ఎగుమతి చేసే దేశంగా తీర్చిదిద్దారు. జాతీయ రైతు కమిషన్ అధ్యక్షులుగా, భారత వ్యవసాయాన్ని పరిశోధించి ఐదు సంపుటాలను భారతజాతికి అంకితమిచ్చారు. రైతు అభివృద్ధికి కొన్ని ఫార్ములాలు రూపొందించి సిఫార్సులను చేశారు. అందులో మొదటిది భూసంస్కరణలు. తర్వాత ప్రాధాన్యత నీరు. రైతు శ్రమ, రైతు పెట్టుబడి, భూమికౌలు, సమగ్ర వ్యవసాయ ఖర్చులు అన్నీ కలిపి దానికి 50శాతం చేర్చి, కనీస మద్దతు ధర వుండాలని C2+50 ఫార్ములా రూపొందించారు. దీనిని అన్ని రాజకీయపార్టీలు, రైతు సంఘాలు ఆహ్వానించాయి. దీనికై ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదికి పైగా చారిత్రాత్మకంగా ఆందోళనలు చేశారు. కానీ ఇప్పటికీ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించనందున రైతాంగ పోరాటం కొనసాగుతోంది.



ఎంఎస్ స్వామినాథన్

వ్యవసాయంలో ఉత్పత్తిని పెంచుకుంటూ, వాతావరణాన్ని కాపాడుకుంటూ, వ్యవసాయ విప్లవం నిరంతరం సాగాలన్నారు. దానికి 'ఎవర్ గ్రీన్ రివల్యూషన్' అని పేరుపెట్టారు. వ్యవసాయ టెక్నాలజీని రైతులకు అందించి ఆకలిని దూరంచేయటమే కాకుండా రైతుల స్థితిగతులను అభివృద్ధి చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రైతుల ఆదాయాలు పెరగాలన్నారు. చిన్న ప్రభుత్వ ఉద్యోగుల కనీస వేతనంకన్నా రైతుల ఆదాయం తక్కువగా వున్న విషయాన్ని నిరసించారు. బ్రిటిష్ ప్రభుత్వ వలస విధాన ఒత్తిడి వలన ఆహారపంటలకు బదులుగా నీలిమందు, తేయాకు, పొగాకు లాంటి వ్యాపార పంటలను రైతులు బలవంతంగా సాగుచేశారు. వలసపాలన వలన పండించిన పంటలకు సరైన ధర లేదు. పెరుగుతున్న భారతదేశ జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగలేదు. స్వాతంత్ర్యం వచ్చే సమయానికి మన దేశంలో ఏటా 60 లక్షల టన్నుల గోధుమలు మాత్రమే పండేవి. 1960లో గోధుమల ఉత్పత్తి కోటి టన్నులు మాత్రమే. 1965, 66 రెండేళ్ల వరసగా వర్షాభావం వలన సంభవించిన కరువు కారణంగా కోటి టన్నుల గోధుమలను అమెరికా షరతులకు లోబడి దిగుమతి చేసుకోవలసి వచ్చింది. 'షిప్ టు మౌత్' అంటే ఓడలో ఆహారధాన్యాలు వస్తేనే మన నోట్లోకి ముద్ద దిగని పరిస్థితి. 1960కి ముందు హెక్టారుకు రెండు టన్నులున్న వరి దిగుబడి స్వామినాథన్ గారి నూతన విత్తనాల వలన రెట్టింపయింది. 21వ శతాబ్దం నాటికి 300 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసి ఎగుమతి చేయగలుగుతున్నాము.

మన దేశం క్లిష్ట సమయంలో వుండటానికి ప్రధాన కారణం వ్యవసాయ సంక్షోభం అని నమ్మిన మేధావులలో స్వామినాథన్ ముఖ్యులు. వ్యవసాయంలో ఆయన శాస్త్రజ్ఞుడిగా అపారమైన కృషి చేసి ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి దేశానికి ఆహార భద్రత కల్పించారు.

## జాతీయ రైతు కమిషన్

భారత ప్రభుత్వం నవంబరు 18, 2004న నియమించిన జాతీయ రైతు కమిషన్ (NCF) ప్రొఫెసర్ స్వామినాథన్ అధ్యక్ష తన ఏర్పాటైంది. కమిటీలో రైతు నాయకులు అతుల్‌కుమార్ అంజన్ సహా 8 మంది సభ్యులున్నారు. NCF వరుసగా డిసెంబర్ 2004, ఆగస్టు 2005, డిసెంబర్ 2005 మరియు ఏప్రిల్ 2006లో నాలుగు నివేదికలను సమర్పించింది. సిఫారసులతో కూడిన ఐదో రిపోర్టును 2006 అక్టోబర్ 4న సమర్పించింది.

## NCF అధ్యయనానికి ప్రభుత్వం చేసిన సూచనలు

- ప్రధాన వ్యవసాయ పంటల ఉత్పాదకత, లాభదాయకత పెంపొందించడం.
- ఆహార భద్రత, పోషకాహార భద్రత వ్యూహం.
- రైతుల ఋణాలను పెంచడానికి విధాన సంస్కరణలు.
- మెట్ట ప్రాంతాలు, నిస్సార భూములు, పోడు భూములు, కొండ, తీర ప్రాంతాల్లోని రైతులకు వ్యవసాయం కోసం ప్రత్యేక కార్యక్రమాలు.
- వ్యవసాయ వస్తువుల నాణ్యత పెంచి, ధరలలో పోటీ తత్వాన్ని పెంపొందించి, తద్వారా వాటిని ప్రపంచవ్యాప్త పోటీగా మార్చడం.
- అంతర్జాతీయ ధరలు బాగా పడిపోయినప్పుడు దిగుమతుల నుండి రైతులను రక్షించడం.
- స్థిరమైన వ్యవసాయం కోసం, పర్యావరణ పరిరక్షణకు, ఎన్నికైన స్థానిక సంస్థలకు అధికారం ఇవ్వడం వంటి కీలక సిఫార్సులను జాతీయ రైతు కమిషన్ చేసింది.

## రైతుల కష్టాలు - ఆత్మహత్యలకు కారణాలు

జాతీయ రైతు వ్యవసాయ కమిషన్‌కు స్వామినాథన్ గారే ఛైర్మన్. రైతుల కష్టాలకు, ఆత్మహత్యల పెరుగుదలకు కారణాల పై దృష్టి సారించి పరిష్కారాలను సూచించారు. వాటిలో మొదటిది భూసంస్కరణల అసంపూర్తి కార్యక్రమం. తరువాత నీటి పారుదల అసౌకర్యాలు, అందుబాటులో లేని వ్యవసాయ సాంకేతికత, సరైన సమయంలో అందని సంస్థాగత ఋణాలు, ప్రతికూల వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు. బీమా, సాంకేతిక పరిజ్ఞానం. మార్కెట్లతో సహా ప్రాథమిక వనరులపై రైతులకు భరోసా, నియంత్రణ ఉండాలన్నారు. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో "వ్యవసాయం" చేర్చాలని NCF సిఫార్సు చేసింది.

## భూమి గురించి

- దేశంలోని మొత్తం భూయాజమాన్యంలో దిగువన వున్న 50 శాతం గ్రామీణ కుటుంబాల వాటా కేవలం 3 శాతం మాత్రమే అని, ఎగువన వున్న 10 శాతం మంది చేతిలో 54 శాతం భూమి వున్నదన్న గణాంకాలను రిపోర్టులో ఎత్తి చూపించారు. వ్యవసాయ సంక్షోభ పరిష్కారానికి భూసంస్కరణలే కీలకమన్నారు. మిగులు భూముల, బంజరు భూముల పంపిణీనే పరిష్కార మన్నారు.
- ప్రధాన వ్యవసాయ భూములను, అటవీ భూములను కార్పొరేట్ రంగానికి మళ్ళించటాన్ని నిరోధించాలన్నారు.
- అడవిలోవున్న గిరిజనుల అటవీ హక్కులను రక్షించాలన్నారు.
- భూమిని, వాతావరణాన్ని రక్షించటానికి జాతీయ భూమి వినియోగ కమిషన్‌ను ఏర్పరచమన్నారు. భూమి, నీరు, జీవన వనరులు, రైతుల ఆదాయం మరియు బీమా, సాంకేతిక విజ్ఞాన నిర్వహణ, మార్కెట్‌తో సహా ప్రాథమిక వనరులపై జాతీయ భూమి వినియోగ కమిషన్‌కు నియంత్రణ వుండాలన్నారు.
- వ్యవసాయ భూమి పరిమాణం, వినియోగం, కొనుగోలుదారుల వర్గాన్ని బట్టి భూమి విక్రయం నియంత్రించాలన్నారు.

డా. స్వామినాథన్ చేసిన ప్రధాన సిఫారసు అయిన భూసంస్కరణల సంగతి ఎత్తిన వారే లేకపోవటం, వ్యవసాయ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టటాన్ని ఎదుర్కోలేకపోవటం దేశ దౌర్భాగ్యానికి పట్టిన దుర్గతికి తార్కాణం. భూమి గురించి వ్యవసాయ కమిషన్ చేసిన సిఫారసులను రైతు సంఘాలు, జాతీయ పార్టీలు విస్మరించాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందటానికి కీలకం భూసంస్కరణలు అని స్వామినాథన్ కమీషన్ రిపోర్టు మొదటి రికమండేషన్‌గా పేర్కొంది. తెలిసి చేసినా తెలియక చేసినా, భూసంస్కరణల ఎజెండాను పక్కన పెట్టడం తీవ్రమైన పొరపాటు. పాలకవర్గ పార్టీల అవినీతి వ్యవహారాలన్నీ భూమి చుట్టూ తిరుగుతున్న విషయాన్ని గ్రహించాలి. భూసంస్కరణలకు భూమి ఎక్కడుందంటూనే వేల ఎకరాలను కార్పోరేట్లకు అప్పగిస్తున్నారు.

భూమి వ్యాపార వస్తువై ధనవంతుల స్పెక్యులేషన్‌లో ఆట వస్తువైపోతున్నది. వ్యవసాయం చేసేవారి చేతిలో భూమి లేదు. అమెరికాలోనో, హైదరాబాద్‌లోనో వున్న వారికే గ్రామాలలో భూములు ఎక్కువగా వుంటున్నాయి. భూమి కోసం పోరాటాలు చేయలేమని, పోరాటాలు చేసినా పాలక వర్గాలు అంగీకరించవని, ప్రజలు రావటం లేదని, ప్రస్తుత ఉద్యమకారుల వాదన. సోవియట్ పతనం తరువాత కమ్యూనిస్టు పార్టీ చీలికలయినా ఉద్యమకారులలో ఆశయాలపట్ల ఆరాధన తగ్గలేదు. కానీ ఆచరణ గణనీయంగా తగ్గింది.

## ఎరువులు-పురుగు మందులు-కలుపు మందులు

భూసారాన్ని గమనించకుండా, భూమిని తీవ్రంగా సాగు చేయటంవలన భూమి ఎడారిగా మారుతుందన్నారు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు విచక్షణారహితంగా

వాడటం వలన ఆహార పదార్థాలలో వాటి అవశేషాలు కేన్సర్ జబ్బులకు కారణం అవుతాయన్నారు. భూగర్భ జలాలను అశాస్త్రీయంగా ట్యాపింగ్ చేయటం వలన అద్భుతమైన భూజల వనరు అంతమౌతుందన్నారు.ఇరిగేషన్, డ్రైనేజ్‌కు పెట్టుబడిని గణనీయంగా పెంచాలని కమిషన్ చెప్పింది. సాయిల్ టెస్టింగ్, భూమిలో సూక్ష్మ పోషకాల పరీక్షకు ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఋణం, బీమా ప్రాథమిక అవసరాలకు సరైన సమయంలో సరిపోను రుణాలను నాలుగు శాతం సాధారణ వడ్డీకి ప్రభుత్వం అందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలలో, రైతులు నష్టాలలో వున్నపుడు తాత్కాలికంగా రైతుల పరిస్థితి మెరుగయ్యే వరకూ ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థల అప్పు వసూళ్ళను నిలిపివేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల నష్టాన్ని తట్టుకోవటానికి ఒక నిధిని ప్రభుత్వం ఏర్పరచాలన్నారు. రైతుల ఆరోగ్యానికి, అప్పులకు, పంటకు, పశువులకు, ఒకటే భీమా ప్యాకేజీ ని ఏర్పాటు చేయాలన్నారు. స్వయం సహకార సంఘాలను ఏర్పాటు చేసి మానవ వనరులను అభివృధి చేసి ఆర్థిక సేవలు, మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ అందరికి అందించాలన్నారు. ఆహార భద్రత. 2400 కేలరీల కన్నా తక్కువ ఆహారం తీసుకునే పేదలు గ్రామీణ ప్రాంతాలలో 77 శాతం మంది వున్నారన్నారు. పేదరికం, సరైన ఆహారం లేకపోవటం గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా వర్షాధార వ్యవసాయ ప్రాంతాలలో కేంద్రీకృతమై వుందన్నారు. సార్వత్రిక పంపిణీ వ్యవస్థను అమలు చేసి, జాతీయ ఆహార పథకాలను అమలుపరచుటకు జీడీపీలో 1 శాతం నిధులు సరిపోతాయన్నారు. పనికి ఆహార పథకం వల్ల పేదలకు ఉపాధి, ఆహారం లభిస్తాయన్నారు. ఎక్కువ రిస్క్‌తో కూడిన బీటీ కాటన్ లాంటి పంటలకు దూరంగా వుంటూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, ఆదాయం వచ్చే పంటలను సాగుచేయాలన్నారు.దిగుమతి సుంకాలను విధించి ఇతరదేశాల దిగుమతుల పోటీ నుండి రైతులను రక్షించాలన్నారు. రైతులకు వినియోగదారులకు మధ్య అనుసంధాన్ని పెంచి దళారులు లేని మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

### కనీస మద్దతు ధర

వ్యవసాయ ఖర్చులకు 50 శాతం కలిపి కనీస మద్దతు ధరను నిర్ణయించాలన్నారు. C2+50 ఫార్ములాను రూపొందించారు. C2 అంటే కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్‌కు (సమగ్ర వ్యవసాయ ఖర్చులకు) 50 శాతం కలపాలన్నారు. వరి, గోధుమలతోపాటు జొన్న, పప్పు ధాన్యాలు లాంటి పంటలన్నిటికీ కనీస మద్దతు ధర నిర్ణయించి ఆ ధరకు కొనేటట్లుగా చట్టం చేయాలన్నారు.రైతుల నికర ఆదాయం ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయంతో పోల్చదగినదిగా వుండాలన్నారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర C2+50 అమలు పరచటమే కీలక సమస్యగా రైతు సంఘాలు ముందుకు తెచ్చాయి. కనీస మద్దతు ధరపై చట్టం చేయటమే ముఖ్య డిమాండ్‌గా రైతుల ఐక్యతను సాధించి, ప్రశంసనీయమైన చారిత్రాత్మక మహోద్యమాన్ని నడిపారు. భారత రాజకీయ ఎజెండాలో కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కానీ అమలుకానందున ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. డాక్టర్ స్వామినాథన్ చేసిన రికమండేషన్లు అన్నిటినీ అమలు చేసినపుడే వారి కృషికి సార్థకత చేకూరుతుంది. రైతుకు భద్రత- దేశానికి ఆహార భద్రత లభిస్తుంది. భూసంస్కరణలు, నీటి వనరులు, కనీసమద్దతు ధరకు చట్టబధతతో సహా అన్ని సిఫారసులను అమలు చేయటమే వారికి సరైన నివాళి. రైతు కమీషన్ సిఫారసులన్నిటినీ అమలు చేయాలని రైతులు పోరాడాలి. (వేదిక.కామ్ సౌజన్యంతో) ❑

---

## భారత రాజ్యాంగం వ్యవసాయ సంబంధాలు

**(12వ పేజీ తరువాయి)**

పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా దశాబ్దాల తరబడి బీళ్లుగా పెడుతున్నారు. 140 కోట్ల జనాభా కలిగి ప్రపంచంలో మొదటి స్థానంలో వున్న దేశం ఆహార ధాన్యాల దిగుమతులకు చేరడం ఆందోళనకరం. ఆహార కొరత వలన ఇప్పటికే 40 కోట్ల మంది ఇబ్బందులు పడుతున్నారు. 80 కోట్ల మంది పౌష్టికాహార లోపంతో రక్తహీనతకు గురయ్యారు. అందువలన రాజ్యాంగ సూత్రాలు అదేశించిన ప్రకారం రాష్ట్రాల జాబితాలో ఉన్న వ్యవసాయాన్ని కేంద్రం హస్తగతం చేసుకోరాదు. రాష్ట్రాల హక్కులను కాపాడాలి. ❑

## పాలస్తీనాలో జాతి నిర్మూలన

**(పదో పేజీ తరువాయి)**

వత్తిడులకులోనై ఇజ్రాయిల్‌కు తల వంచిన సంగతుల ప్రస్తావన కూడా ఈ పుస్తకంలో ఉంది. హామాస్ ఆవిర్భావం ఈ పాలక పక్షాల లొంగుబాటు ఫలితంగానే వచ్చిందని చరిత్ర క్రమం చెబుతుంది. యుద్ధ వ్యతిరేకులు, 'సర్వజనో సుఖీభవ' అని కోరుకొనే వాళ్లు-ప్రజా యుద్ధం ఎక్కడ నుండి పుడుతుందో తెలుసుకోవటానికి ఈ పుస్తకం తప్పక చదవాలి. పాలస్తీనాలో దశాబ్దాల పీడన ఫలితమే నేటి హమాస్ దాడి అని అర్థం చేసుకోవాలంటే, మనకున్న Geographical, political privileges దాటి ఆలోచించాల్సి ఉంటుంది. ఫాసిస్టు పాలనతో తలపడుతున్న ఈ సందర్భం-పాలస్తీనాను, కశ్మీర్‌ను అర్థం చేసుకోవాల్సిన అత్యావశ్యకతను ముందుకు తెస్తుంది. ❑

# కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు రాజ్యాంగం రీత్యా అవసరం

సంక్షిప్తానువాదం : పి.మాధవి

- రవివర్మ కుమార్

ప్రతి ఐదు దశాబ్దాలుగా మన దేశంలో, కులాల వివరాలను పరిగణనలోకి తీసుకోకుండానే, జనాభాను లెక్కించడం జరిగింది. వెనుకబడిన తరగతుల నిమిత్తం స్థాపించబడిన మూడు జాతీయస్థాయి, మరెన్నో రాష్ట్రస్థాయి సంఘాలకు, వెనుకబడిన తరగతులను గుర్తించటానికి ఈ సమాచారం ఏ విధంగానూ ఉపయోగపడలేదు. జనాభా గణన జరిగిన ప్రతి సారీ, కీలకమైన ఈ సమాచారం మరుగునపడి పోవటం వలన వెనుకబడిన తరగతులలో 70-80 శాతం ప్రజలకు అందాల్సిన సంక్షేమం అందుబాటులో ఉండడం లేదు. జనాభా లెక్కల కులానికి సంబంధించిన వివరాలను మినహాయించటం అనే పద్ధతిని సమీక్షించాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది. 'కులం' అనే పదాన్ని భావవాచకంగాను, వాస్తవమైన అర్థంలోను చెప్పుకోవచ్చు. వాస్తవమైన అర్థంలో కులం అంటే, వ్యక్తుల కుటుంబాల సమూహం, భావవాచకంగా ఒక వృత్తిని సూచించే స్థితి. ప్రస్తుతం జనాభా లెక్కింపులో వాస్తవమైన అర్థంలోనే వాడుతున్నారు. భారతదేశం, రాష్ట్రాల సమ్మేళనం మాత్రమే కాదు. వివిధ కులాల, సమూహాల తెగల సమ్మేళనం కూడా. భారతదేశపు రాజ్యాంగం ఆమోదించబడే నాటికి అమలులో ఉన్న కులాల, తెగల సమూహాల వ్యక్తిగత అనుశాసనాలను (పర్సనల్ చట్టాలను), గుర్తించి కొనసాగిస్తోంది.




మనం, మాతృస్వామిక, పితృస్వామిక వ్యవస్థలను రెండింటినీ గుర్తిస్తాము. పుట్టుకతో ఉండే సమానత్వాన్ని గుర్తించే సమూహాలు కూడా, కాలక్రమేణా కులాల ఆధారంగా ఉండే విభజనకు సరిపోల్చదగిన పద్ధతిని అవలంబించటం మొదలుపెట్టాయి. భారతదేశంలో కుల వ్యవస్థ ఒక సామాజిక విభజననేకాక, రాజకీయ, వృత్తిపరమైన విభజనలను కూడ ప్రతిబింబిస్తుంది. కాబట్టి, ప్రణాళికీకరణకు, అభివృద్ధికి, దేశంలోని కులాలకు, తెగలకు సంబంధించిన వివరాలు సేకరించడం తప్పనిసరి. ఈ దృక్పథాన్ని ప్రభుత్వం గ్రామాలలో జరిపే సామాజిక జనాభా అధ్యయనంలో కుటుంబానికి సంబంధించిన ప్రశ్నావళి పత్రంలో గుర్తించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రామాణికమైన 'ఎవరీ శూద్రులు' అనే రచనలో ఈ విషయాన్ని ఈ విధంగా చర్చించారు.

> **'ప్రజలకు శూద్రుల సమస్య యొక్క పరిమాణం ఎంత అని తెలియకపోవటానికి గల కారణం దేశంలో శూద్రుల జనాభా ఎంత అనే విషయం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలనే ఆసక్తి వాళ్ళకు లేకపోవడమే దురదృష్టవశాత్తూ జనాభా లెక్కలు పెద్దగా శూద్రుల సంఖ్యను గుర్తించి చూపించవు. అంటరానివారి సంఖ్యను మినహాయిస్తే, హిందూ జనాభాలో శూద్రులు 70-80 శాతం వరకు ఉంటారనటంలో సందేహం లేదు'.**

**(అంబేద్కర్, 1946:9)**

### రాజ్యాంగంలో నిబంధనలు

1953లో నియమించబడిన మొట్టమొదటి జాతీయ సంఘం మొదలుకొని వెనుకబడిన తరగతులను గుర్తించటం కోసం నియమించబడిన సంఘాలన్నీ, జనాభా లెక్కలలో కులానికి సంబంధించిన వివరాలు దొరకకపోవటం వలన కలుగుతున్న ఇబ్బందిని ప్రస్తావించాయి. ఈ సంఘాలన్నీ, జనాభా లెక్కలలో సమాచారాన్ని

సేకరించాల్సిన అవసరం ఉందనే సూచనను బలంగా చేసాయి. ఈ సూచనలను పట్టించుకోకపోగా ఇవి ఉద్దేశపూర్వకంగా అణచివేయబడ్డాయి (కలేకర్ 1956, హవనూర్ 1975, మండల్ 1980) రాజ్యాంగంలో 15(4) ప్రకరణను అనుసరించి సామాజికంగా, విద్య విషయంలో వెనుకబడిన తరగతుల ప్రగతికి ప్రత్యేక నిబంధనలు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. దీని ఆధారంగానే వృత్తి విద్యలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. అయితే వెనుకబడిన తరగతులను గుర్తించటానికి వివిధ రాష్ట్రాల సగటు విద్యాస్థాయి కనుగొని, వీరు ఎంత మేరకు వెనుకబడ్డారో తెలుసుకోవాలంటే, ప్రతి రాష్ట్ర జనాభాలో వివిధ కులాలకు సంబంధించిన వివరాలు తెలియాలి. జనాభా లెక్కలలో తెలపాల్సిన అంశాలు-జనాభాలో వెనుకబడిన తరగతి ప్రజల నిష్పత్తి, అక్షరాస్యత స్థాయి, ఆంగ్ల భాషతో గల పరిచయ స్థాయి, ఉన్నత విద్యాభ్యాసము కలవారి నిష్పత్తి, వైద్యులు, ఇంజనీర్లు, ఇతర వృత్తులలోను ప్రభుత్వ రంగాలలో పనిచేసే వారి నిష్పత్తి –మొదలైనవి. జనాభా లెక్కలు పై వివరాలతో కూడుకుని ఉన్నప్పుడే ఈ నిష్పత్తులు కనుక్కోవడం వీలుపడుతుంది. తగిన సమాచారం లేకుండా, సామాజిక విద్యా రంగాలలో ఏ కులం/తెగ స్థాయిని నిర్ధారించటంగానీ, ఈ రంగాలలో రాష్ట్రస్థాయి సగటుతో పోల్చి చూసి, కులాల వెనుకబాటుతనాన్ని గుర్తించడం గానీ చేయలేము.

అదే విధంగా, రాజ్యాంగంలో 16(4) ప్రకరణం ప్రకారం, రాష్ట్రస్థాయి ఉద్యోగాలలో వెనుకబడిన తరగతులకు, ఆ ఉద్యోగాలలో వారికి 'తగినంత' ప్రాతినిధ్యం లేదని నిరూపించగలిగినప్పుడే రిజర్వేషను వర్తిస్తుంది. 'తగినంత' అంటే రాష్ట్ర జనాభాలో ఒక కులానికి చెందిన వారి జనాభా ఏ నిష్పత్తిలో ఉంటుందో, ఆ నిష్పత్తి ప్రకారము అని అర్థము. అయితే దీనిని నిర్ధారించటానికి కూడ జనగణనలో కులాలకు సంబంధించిన వివరాలు అవసరమని తెలుస్తోంది. జనాభాలో వివిధ కులాల ప్రాతినిధ్య వివరాలు దొరకక పోవటం చేత ఇప్పటి వరకు నియమించబడిన వెనుకబడిన తరగతుల సంఘాలు, ఈ వివరాలు సంపాదించటానికి ఇతర పద్ధతులను అవలంబించాల్సి వచ్చింది. ఈ రకంగా చేయడం వల్ల న్యాయస్థానాల విమర్శకు గురిచేయటమే మాత్రమే కాకుండా, వీరు అవలంభించిన పద్ధతులను, తద్వారా చేసిన వర్గీకరణ చెల్లనివిగా ప్రకటించడం జరిగింది. ఉదాహరణకు రామకృష్ణ సింగ్ కేసు (ఎఐఆర్ 1960, ఎమ్మెఎసన్ 338లో చెప్పబడిన మైసూర్ హైకోర్టు తీర్పు) ఈ అంశం నాగన్ గౌడ్ కమిటీ నియామకానికి దారితీసింది. వెనుకబడిన తరగతులను గుర్తించి జాబితాలను తయారుచేసిన సంఘాలన్నీ, ఈ జాబితాల నుంచి క్రమానుగతంగా (పీరియాడికల్లీ) సామాజికంగా ఎదిగిన వ్యక్తులను, సమూహాలను తొలగించి, కొత్తగా వెనుకబడిన తరగతులుగా గుర్తించదగిన వారిని గుర్తించటానికి వీలుగా వీటిని సవరించాల్సి ఉంటుందని సూచించాయి. క్రమానుగతంగా ఇటువంటి సవరణ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు కూడా భావించి, ఆ మేరకు నిర్దేశించింది. ఈ ధ్యేయంతో సుప్రీంకోర్టు వెనుకబడిన తరగతులకు శాశ్వతమైన సంఘాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా నిర్దేశించింది (ఇందిరా సహానీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా, 1992 ఎస్సిసి (ఎల్ మరియు ఎస్.అనుబంధం) ఈ విధమైన సవరణ చేయటానికి వెనకబడిన తరగతుల జాబితాలో చేర్చబడని కులాలన్నిటికీ సంబంధించిన సమగ్ర సమాచారం అవసరం. ఈ వివరాలు ఒక్కొక్క కులానికి సంబంధించిన జనాభా సంఖ్య, వారి విద్యాభ్యాసస్థాయి, రాష్ట్రస్థాయి ఉద్యోగాలలో ఒక్కొక్క కులం ప్రాతినిధ్యం, సూచించాలి. ఈ సమాచారం జాతీయస్థాయిలో పది సంవత్సరాల కొకసారి జరిగే జనగణన ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. ఈ వివరాలు లేకుండా, వెనుకబడిన తరగతుల జాబితా నుంచి, ఎదుగుదల సాధ్యపడటం వలన వెనుకబాటుతనం పోయిన వారిని గుర్తించి, మినహాయించటం సాధ్యపడదు. రాజ్యాంగంలో 81వ ప్రకరణ లోక్ సభ కూర్పును నిర్ధారిస్తుంది. దీనికి ఒక్కొక్క రాష్ట్రానికి కేటాయించబడిన సీట్లు రాష్ట్ర జనాభాకు ఉన్న నిష్పత్తిని దృష్టిలో పెట్టుకోవటం జరుగుతుంది.

82వ ప్రకరణ ప్రకారం లోక్ సభలో రాష్ట్రాలకు కేటాయించిన సీట్లను మారుస్తూ, సర్దుబాటు చేయటం తప్పనిసరి. ఈ రెండు పనులూ మరియు నియోజక వర్గాలను నిర్ధారించడం, పది సంవత్సరాలకొకసారి జరిగే జనగణన ఆధారంగానే చేయడం జరుగుతుంది. ఇటువంటి నిబంధనలే రాష్ట్ర శాసన సభలకు కూడా వర్తిస్తాయి. అయితే, నియోజక వర్గాల పరిమితులను, పైన పేర్కొన్న ఇతర నిబంధనలను, రాజ్యాంగ 42 వ సవరణ (1976) ద్వారా నిలిపివేసి, 2000 సంవత్సరం తరువాత జనగణన ద్వారా సేకరించిన సంబంధిత సమాచారం లభించే వరకు వాయిదా వేయడం జరిగింది. ఇప్పుడు, 25 సంవత్సరాల తరువాత, నియోజక వర్గాల పరిమితులను, లోక్‌సభ కూర్పు, రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగలకు అనుకూలంగా సీట్ల రిజర్వేషను చేపట్టాలి. అంతే కాకుండా, మహిళలకు, వెనుకబడిన తరగతి మహిళలకు అనుకూలంగా సీట్లు రిజర్వు చేయాలనే డిమాండ్ ముందుకొస్తున్న తరుణంలో, 2001 జనగణన ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. వీటి దృష్ట్యా చూసినప్పుడు కూడ ప్రస్తుతం చేపట్టిన జనాభా లెక్కింపులో కులాల వివరాలు సేకరించే అవకాశం ఇంకా ఉందనే విషయాన్ని మరచిపోకూడదు. అంతేకాదు, ఈ వివరాలు ఇప్పుడైనా సేకరించకపోతే, మహిళలకే రిజర్వు చేయబడే నియోజకవర్గాలలో వెనుకబడిన తరగతి మహిళలకు రిజర్వేషన్ కల్పించే అవకాశాలకు శాశ్వతంగా తెరపడుతుంది.

భారత రాజ్యాంగం 243డి ప్రకరణను అనుసరించి పంచాయతీ వ్యవస్థలో బీసీలకు రిజర్వేషనుంది. అదే విధంగా 243 ప్రకరణ ప్రకారము బీసీల గురించి తగినంత సమాచారం లేకపోయినా, మున్సిపాలిటీలలో వీరికి అనుకూలమైన రిజర్వేషను ఏర్పాటు చేయవలసి వుంది. ఈ రకంగా చేసే రిజర్వేషను సహేతుకం కాకపోయే ప్రమాదం ఉండటమే కాకుండా పక్షపాతంతో వ్యవహరించటానికి అవకాశం ఇయ్యవచ్చు. సుప్రీంకోర్టు గతంలో, వెనుకబడిన తరగతులకు చెందిన వారి వివరాలు జన గణనలో సేకరించటానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతిస్తూ, అటువంటి జన గణన రాజ్యాంగ విరుద్ధంకాదని పేర్కొంది (అనుగ్రహ నారాయణ్ సింగ్ Vs యూపీ ప్రభుత్వము 1996, 6 ఎసి సిసి 303) ఈ పరిస్థితులలో, 2001 జన గణనలో కులాలకు సంబంధించిన వివరాలు సేకరించడం జాతీయ స్థాయిలో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఈ లెక్కింపు పైనే వెనుకబడిన తరగతులను గుర్తించడం, ఆ జాబితాలను సవరించటం, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డు కులాల తెగల సంక్షేమం, బీసీ నియోజకవర్గాలలో మహిళల రిజర్వేషను, పూర్తిగా ఆధారపడి ఉంటాయి.

### అభ్యంతరాలు, సమాధానాలు

జనాభా లెక్కింపులో కులాల వివరాలు సేకరించటానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం (ప్రయత్నం) జరుగుతోంది. ఈ వ్యతిరేకతకు ప్రధాన ప్రాతిపదిక, ఇది సమాజంలో కులతత్వం పెరగటానికి దారి తీస్తుందన్న భావన. ఇది ఆధారంలేని భయం. గత 50 సంవత్సరాల కాలంలో కులాలకు సంబంధించిన వివరాలు సేకరించకపోవటం ద్వారా సమాజం కులరహిత సమాజంగా పరివర్తన చెందకపోగా ఈ విషయంలో సంకుచిత దృష్టిని కూడా పోగొట్టుకోలేదు. అదీగాక, కాలక్రమేణా, కులతత్వంతో పాటు మతతత్వం కూడా మన పౌర వ్యవస్థను పట్టి పీడిస్తోంది. తరచు వ్యక్తీకరించబడుతున్న భయాలలో ఒకటి, జన గణనలో కులాలకు సంబంధించిన సమాచారం ఆధారంగా, అనూహ్యమైన డిమాండ్లు ముందుకు వచ్చే అవకాశం ఉంది అన్నది. ఇక్కడ తలెత్తే ప్రశ్న ఏమిటంటే, ఇలా వచ్చే (లేక రావటానికి అవకాశం ఉండే డిమాండ్లంటే భయం ఎవరికి? ఇప్పటిదాక జాతీయ సంపదపై, విద్య, మిగిలిన సేవలపై, సంపూర్ణ అధికారం ఉన్న కులాలకు చెందిన వాళ్ళకు మాత్రమే ఈ డిమాండ్లు తలయెత్తుతాయనే భయం ఉంది. నిజానికి, దేశంలోని వివిధ వనరులపై ఇటువంటి గుత్తాధిపత్యాన్ని అంతమొందించాలనే లక్ష్యంతోనే జనాభా లెక్కింపులో కులానికి సంబంధించిన వివరాలు కావాలని కోరుకోవటం. దీనికి వ్యతిరేకమైన భయాలను వ్యక్తీకరిస్తున్న వారెవరంటే, విద్యారంగంపైన, ప్రభుత్వ ఉద్యోగాలపైన ఇప్పటివరకు గుత్తాధిపత్యాన్ని కలిగి, స్వార్థ ప్రయోజనం ఉండి ఇప్పుడున్న స్థితి కొనసాగాలని కోరుకునే వారే. రాజ్యాంగం జాతి, కుల, మత, లింగం, పుట్టిన స్థలం, వారసత్వం, భాష, నివాస స్థలము వంటి వాటి ఆధారంగా రాజ్యం చేసే వివక్షతను నిషేధిస్తుంది. రాజ్యాంగం 15, 16, 29 (2) ప్రకరణలలో పేర్కొన్న ఈ నిషేధాల వలన జనగణనలో కులానికి సంబంధించిన సమాచారం సేకరించటం సాధ్యపడదనే వాదన ఉంది. హావనూర్ కమిషన్ దీనిని సమర్థవంతంగా ఎదుర్కొంది.

> **'రాజ్యాంగంలో 15, 16, 29(2) ప్రకరణలు రాజ్యం పౌరులను కుల, మత, లింగ, భాష, ప్రాంత, వారసత్వ, భాషల ప్రాతిపదికలపై వివక్షతను గురిచేయటాన్ని నిషేధిస్తుంది అనేది వాస్తవం. జన గణనలో కులానికి సంబంధించిన వివరాలు వివక్షతకు దారి తీస్తాయి అని చెప్పే వాదనలే, మిగిలిన అంశాలైన మతం, జాతి, లింగం, ప్రాంతం, భాష మొదలైన అంశాలకు కూడా వర్తిస్తాయి. హిందువులలో కులానికి సంబంధించిన వివరాలు సేకరించకపోవటం వివక్షత కాదా?'**
>
> **(హావనూర్ 1975:334)**

గత 50 సంవత్సరాలలో కులాల వివరాలు సేకరించకపోయినా ఆదివాసీ తెగలకు సంబంధించిన వివరాలు, రాజ్యాంగం 341, 342 ప్రకరణలో పేర్కొనబడిన కులాలకు సంబంధించినవి సేకరిస్తూనే ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం ఒక్కదానిలోనే షెడ్యూల్డు తెగలుగా గుర్తించబడేవి 49 ఉన్నాయి. జనాభా వివరాలకు సంబంధించిన అంశాలలో, అన్ని కులాలకు, తెగలకు ఒకే ప్రమాణాలు వర్తించాలి. హిందువుల జనాభా లెక్కింపులో కుల వివరాలు సేకరించటం గర్వించదగిన విషయమైతే షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల విషయంలో కూడా అది వర్తించాలి. జనాభా లెక్కింపులో సమాచార సేకరణలో ఎటువంటి వివక్షతకు చోటు లేదు. షెడ్యూల్డు కులాల, తెగలకు సంబంధించిన అన్ని వివరాలు సేకరించటం మిగిలిన కులాల వివరాలు సేకరించక పోవటం రాజ్యాంగం 14,15,16 ప్రకరణలు ఇచ్చే సమానత్వ హామీలను ఉల్లంఘించటం ద్వారా వివక్షతకు పాల్పడటమే అవుతుంది. అణచివేతకు, దోపిడీకి పాల్పడే కులాలను వ్యవస్థీకరించి, ప్రోత్సహించటం కులతత్వానికి నగ్నమైన ఉదాహరణ. దీనిని ఖండించటం, న్యాయబద్ధంగా ఆలోచించగల వారందరు చేయాల్సిన పని. సామాజిక శాస్త్రవేత్తలు దీనిని వ్యతిరేకించటం సరైనదే. అణచివేతకు, దోపిడీకి గురైన వర్గాల వారు సంఘటితం కావటం కార్మిక సంఘాల కార్యకలాపంలాగ న్యాయ సమ్మతమైనదే. వీరికి, జనగణన ద్వారా అణచివేతకు గురైన వారి సంఖ్య, ఇతర వివరాలు ప్రకటించబడాలి అని కోరుకునే హక్కుంది. (Anveshi Broadsheet సౌజన్యంతో). ❑

# 'సనాతన ధర్మం' మీద బ్రిటిష్ వాడి దాడి !



- సి.ఎస్.ఆర్ ప్రసాద్

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని స్వాములు, సన్యాసులు, పీఠాధిపతులు, కొందరు ప్రజా నాయకులు స్టేట్‌మెంట్లు ఇస్తుంటారు. అంతేకాని అసలు సనాతనధర్మం అంటే ఇదీ అని చెప్పరు. మరి సామాన్యులకు సనాతనధర్మం అంటే ఏమిటో ఏం తెలుస్తుంది ? వేల సంవత్సరాల నుంచి మన మహారాజులు, భరత ఖండంలో పరిపాలిస్తూ, సనాతనధర్మాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. తర్వాత కాలంలో ముస్లిం సుల్తానులు రాజ్యాలను చేజిక్కించుకున్నా, వారికి సామంతులుగా మన మహారాజులు, తమ ఏలుబడిలో సనాతన ధర్మాన్ని కాపాడుతూ, నాలుగు పాదాల మీద నడిపించారు. ముస్లిం సుల్తానులు మన సనాతన ధర్మంలో జోక్యం చేసుకోలేదు. కాని వారి తర్వాత వచ్చిన బ్రిటిష్ దుర్మార్గులతోనే చిక్కొచ్చింది. మన సనాతన ధర్మంపై దాడి ప్రారంభించారు.

మహారాజులు సనాతన ధర్మం ప్రకారం పరిపాలిస్తున్న కాలంలో శూద్రులకు ఆస్తి హక్కు లేదు. భూమి అంతా రాజుదే. పృథ్వీపతి. వారి అభిమానం పొందిన బ్రాహ్మణులకు అగ్రహారం పేరుతో దానం చేసి హక్కు కల్పించేవారు. దేవాలయం నిర్వహణకు భూమిని రాసిచ్చేవారు. శూద్రులైన రైతులు కౌలు దారులు మాత్రమే. వారికి భూమిపై హక్కు లేదు. పండించిన పంటలో నాలుగోవంతు నుంచి సగం వరకూ కౌలు వసూలు చేసేవారు. కానీ, 1795లో బ్రిటిష్ ప్రభుత్వం శూద్రులకు ఆస్తిహక్కు కల్పిస్తూ చట్టం చేసింది. 'దున్నేవాడిదే భూమి' అని కమ్యూనిస్టులు ఇప్పుడు అంటున్నారు కాని, ఆ పని బ్రిటిష్‌వారు అప్పుడే చేశారనేది చారిత్రక సత్యం. ఎంత అన్యాయమో కదా!

పరమ పవిత్రమైన మన సనాతన ధర్మంలో ఆడ శిశువు పుట్టగానే తీసుకెళ్లి గంగలో పడేసే ఆచారం ఉండేది. గంగ అంటే నది, చెరువు, సముద్రం ఏదైనా కావచ్చు. ఎందుకు? సనాతన ధర్మపరిరక్షణకే. ఆడపిల్లకు ఎనిమిదేళ్లు రాగానే పెళ్లి చేసేయ్యాలి - అష్టవర్షాద్భవేత్కన్యా. రజస్వలానంతర వివాహం మహాపాపం. అలా చేస్తే రౌరవాది నరకాలకు పోతారు. అప్పటికే ఒకరో, ఇద్దరో ఆడ పిల్లలున్న గృహస్థు ఏం చేస్తాడు ? మళ్లీ ఆడపిల్ల పుడితే, ఎనిమిదేళ్లు రాగానే పెళ్లి చేయలేనేమో అనే భయంతో ఆ శిశువును సనాతనధర్మం ప్రకారం గంగార్పణం చేసి పుణ్యం దక్కించుకునే వాడు. సనాతన ధర్మ పరిరక్షకులైన గృహస్థులు ఇలా పుణ్యం దక్కించుకోకుండా కుట్ర చేసింది బ్రిటిష్ ప్రభుత్వం. 1904లో ఆడ శిశువులను గంగార్పణం చేయడాన్ని నిషేధిస్తూ చట్టం చేసింది. మన సనాతన ధర్మంలో వేలు పెట్టిన బ్రిటిష్ వాడు నాశనమైపోవాలి.

మన సనాతన ధర్మంలో శూద్రులు విద్య నేర్వకూడదు. వారికి విద్యాహక్కు లేదు. గురుకులాలలో మహారాజుల పిల్లలకు, అగ్రకుల బాలురకు మాత్రమే ప్రవేశం. గొడ్లు కాచుకొనే శూద్రుల పిల్లలు పొరపాటున గురుకులం వైపు వెళ్లినప్పుడు, గురుదేవులు చెప్పే పాఠం విన్నాడని అనుమానం వస్తే, తీవ్రమైన శిక్షలు ఉండేవి. శూద్రులు బ్రహ్మదేవుడి కాళ్ల నుంచి పుట్టినవారు కనుక, అగ్రకులాల వారి కాళ్లకు మొక్కుతూ, బానిసలుగా పడివుండాలి. కాని బ్రిటిష్ వారికి ఈ ధర్మసూక్ష్మం తెలిసి చస్తే గదా? తెలివి తక్కువ దద్దమ్మలు. 1813లో శూద్రులు కూడా చదువుకోవచ్చు అని చట్టం చేశారు. ఇంకేం ఉందీ క్రైస్తవ మిషనరీ వాళ్లొచ్చి ఇక్కడ స్కూళ్లుపెట్టి ఇంగ్లీషు చదువులు మొదలుపెట్టారు. మన సనాతన ధర్మం ప్రకారం మహారాజులు శూద్రులకు ఎందుకు విద్య నేర్పలేదో బ్రిటిష్ పాలకులకు ఆ తర్వాత కానీ అర్థం కాలేదు. చదువు నేర్చిన జనం వారికి ఎదురుతిరిగి తన్ని తగలేశారు - గట్టిగా రెండొందల ఏళ్లు పరిపాలించలేకపోయారు. అదే మన మహారాజులు శూద్రులను చదువుకోనివ్వకుండా చేసి వేల సంవత్సరాలు చప్పన్నారు దేశాలను చక్కగా పరిపాలించారు. శూద్రులు, స్త్రీలు చదువులు నేర్వబట్టేగదా, పాలనలో తమ వాటా అడుగుతున్నారు!

సనాతన ధర్మం ప్రకారం నేరస్థులకు కులాల వారీగా శిక్షలు విధించే చట్టం ఉండేది. మహారాజులు ఒకే నేరానికి అగ్రకులాల వారికి ఒక రకం శిక్ష, శూద్రులకు వేరే కఠిన శిక్షలు విధించే వారు. ఒకే నేరం చేసిన వారికి కులం ప్రకారం ఇలా శిక్షలు విధించడం ఏమిటి 'నాన్సెన్స్' అని నేరస్థులకు శిక్షలు విధించేటప్పుడు వివక్ష చూపరాదంటూ 1817లో చట్టం చేసింది బ్రిటిష్ ప్రభుత్వం. ఇది సనాతన ధర్మానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారు చేసిన కుట్ర అని వేరే చెప్పనవసరం లేదు.

సనాతన ధర్మం ప్రకారం, భార్య చనిపోతే భర్త ఏడాది తిరిగే లోగా మరొక స్త్రీని పెళ్లి చేసుకోవచ్చు. కాని భర్త చనిపోయిన స్త్రీ మాత్రం మరొక పురుషుడిని వివాహం చేసుకోకూడదు. పైగా, ఈ వితంతువు వయసుతో కలిగిన కోరికలకు తట్టుకోలేక పర పురుషుడితో అక్రమ సంబంధం పెట్టుకునే అవకాశం ఉంది. ఇది ఘోరమైన పాపం. స్త్రీలను ఇటువంటి పాపకూపంలో పడకుండా రక్షించడానికి **(మిగతా 23వ పేజీలో)**

# మనుస్మృతిని అంబేద్కర్ ఎందుకు తగలబెట్టారు ?



- డాక్టర్ దేవరాజు మహారాజు

పైకి ఎదగడానికి ఏ మాత్రం వీలులేని కుటుంబంలో పుట్టి, ఏ అవకాశమూ లేని సామాజిక పరిస్థితుల్లో పెరిగి, అస్పృశ్యుడిగా అవమానాల పాలవుతూ కూడా నిబ్బరంగా ఉంటూ, ఆత్మ విశ్వాసంతో, మొక్కవోని దీక్షతో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ విశ్వమానవుడిగా ఎదిగినవారు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్. ఆ కాలంలో అన్ని పుస్తకాలు చదివి, అన్ని డిగ్రీలు సంపాదించి అత్యున్నత స్థాయికి చేరిన మేధావి ఆయన! మరి, మనుస్మృతి లాంటి గ్రంథాన్ని బహిరంగంగా, బాహాటంగా, ధైర్యంగా ఎందుకు తగులబెట్టారు? అలా తగులబెట్టాల్సిన ప్రమాదకరమైన విషయాలు, సమాజానికి హాని కలిగించే విషయాలు అందులో ఏమున్నాయి? - అని పరిశీలిస్తే.. ఉన్నాయి! ఈ అత్యాధునిక వైజ్ఞానిక సమాజాన్ని వెనక్కి నడిపించే చెత్తంతా అందులో ఉంది. అంబేద్కర్ ఆ గ్రంథాన్ని తిరస్కరించడంలో న్యాయముంది. మనువాద భావజాలాన్ని వదులుకోవాల్సి ఉందన్న సందేశం ఈ దేశ ప్రజలకు ఇవ్వడం కోసం ఆయన అలా ఆ గ్రంథాన్ని తగలబెట్టి చూపించారు. అయినా, సమాజంలో రావాల్సినంత మార్పు రాలేదు. అణగారిన వర్గాలకు చెందిన వారే మూర్ఖంగా మనువాద భావజాలంలో కొట్టుకుపోతున్నారు. వైదిక ధర్మ ప్రభోదాలకు ప్రభావితులై, వాటిని పాటిస్తూ తాము అగ్రవర్ణాల వారి స్థాయికి చేరుకున్నామని సంతృప్తి పడుతున్నారు. కానీ అది అర్థం లేనిది. ఏ వర్గం వారైనా, ఏ వర్ణం వారైనా తమ తమ స్థాయి భేదాల్ని వదులుకుని, అందరం మనుషులమేనని గుర్తించుకున్న నాడే మానవత్వం పరిమళిస్తుంది. ఆధునిక జన్యుశాస్త్ర సారాంశం గ్రహించిన నాడే మానవవాదం బలపడుతుంది. మనుస్మృతిని అంతా ఇక్కడ పరిచయం చేయబోవడం లేదు గానీ, మానవీయ విలువలకు విఘాతం కలిగించే అంశాలు ఏమేమున్నాయో కొన్నిటిని విశ్లేషించుకుందాం ! మతిలేని సూక్తులు ఆ గ్రంథంలో ఇంతగా ఉన్నాయా ? అని ఆశ్చర్యపోవాల్సి వచ్చినా.. ఏ మాత్రం ఆశ్చర్యపోవద్దు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అనుసరిస్తే చాలు!!

- బ్రాహ్మణుడు మూడు రోజులు పాలు అమ్మితే గనక, అతను శూద్రుడయిపోతాడు(మనుస్మృతి 10/92) అంటే పాల వ్యాపారం చేసేవారు ఎవరైనా బ్రాహ్మణుల దృష్టిలో శూద్రులే.
- యజ్ఞంలో కొడుకును బలి ఇచ్చినా బ్రాహ్మణుడు బ్రాహ్మణుడిగానే ఉంటాడు (మనుస్మృతి 10/105)
- బ్రాహ్మణుడు కుక్క మాంసం భుజించినా బ్రాహ్మణుడిగానే ఉంటాడు (మనుస్మృతి 10/106-10/108) ఇతరులు గనక ఏ మాంస భక్షణ చేసినా పతితులైపోతారు. ఇదేం న్యాయం?

ఇక మను స్మృతి 10వ అధ్యాయంలోని 95 నుండి 98 వరకు నాలుగు శ్లోకాల సారాంశమేమంటే-

**బ్రాహ్మణవర్గానికి చెందని తక్కువస్థాయి వ్యక్తులెవరూ బ్రాహ్మణులు చేసే పనులు చేయగూడదు. పైనున్న బ్రాహ్మణ వర్గం వారు మాత్రం అవసరమై నప్పుడు జీవిక కోసం తక్కువ స్థాయి వారి పనులు చేసుకోవచ్చు. ఆ విధంగా కొంచెం నిలదొక్కుకున్న తర్వాత మళ్ళీ వారు, వారి కుల వృత్తిని స్వీకరించవచ్చు. ఇలాంటి అవకాశం కింది కులాల వారికి లేదు. అంటే బ్రాహ్మణులు బతకడానికి నిమ్న వర్గాల వారి వృత్తులు చేసుకోవచ్చు. నిమ్న వర్గాల వారి బతుకుదెరువు మీద దాడి చెయ్యొచ్చు. వారికి పుట్టగతులు లేకుండా చేసే అధికారం బ్రాహ్మణులకు ఉంది. కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ నిమ్న వర్గాల వారు పైవర్గం వారి కులవృత్తిని దెబ్బ తీయకూడదు.**

తమ వర్గం వారికి అనుగుణంగా మనుస్మృతి రాసుకుని, దాన్ని బలవంతంగా జనం మీద రుద్దారని అనడానికి ఇంతకన్నా ఏ సాక్ష్యాలు కావాలి? ఇందులో ఏ న్యాయముంది? ఏ మానవీయ విలువలున్నాయి. లోకంలో ఉన్న వాస్తవానికీ మనుధర్మ శాస్త్రంలో వారు రాసుకున్నది పూర్తి వ్యతిరేకం. పూజలు, వ్రతాలు, యాగాలు, కర్మకాండలు వగైరా చేసి భూరి సంభావనలు స్వీకరించి, సంపాదించుకున్నది వారి స్వంత ఆస్తి అని భ్రమపడుతున్నారు పాపం! బ్రాహ్మణార్యులకు ఉన్న బ్రహ్మ జ్ఞానమేమిటో వివరంగా చెప్పుకుంటే బావుండేది.

**ఉత్పత్తి రేప విప్రస్య మూర్తిర్ధర్మస్య శాశ్వతీ,**
**సహి ధర్మార్థముత్పన్నో బ్రహ్మభూయాయ కల్పతే. 98**

**బ్రాహ్మణో జాయమానో హి పృథివ్యామధి జాయతే,**
**ఈశ్వరస్సర్వ భూతానాం ధర్మకోశస్య గుప్తయే. 99**

**సర్వం స్వం బ్రాహ్మణ స్యేదం యత్కించి జ్జగతీగతం!**
**శ్రేష్ఠే నాభిజనేనేదం సర్వం వై బ్రాహ్మణోర్హతి. 100**

ఈ సృష్టి యందు ప్రాణులు గొప్పవి. ప్రాణుల యందు బుద్ధి వల్ల జీవించు జీవులు గొప్పవి. ఆ జీవులయందు మానవులు మిక్కిలి గొప్పవారు. వారిలో బ్రాహ్మణులు గొప్పవారు. ఆ

బ్రాహ్మణులలో విద్వాంసులు శ్రేష్ఠులు. ఆ విద్వాంసుల యందు యుక్తాయుక్త విచక్షణ కలవారు శ్రేష్ఠులు. కాగా వారి కంటె బ్రహ్మ జ్ఞానము కలవారు మిక్కిలి గొప్పవారు. ఈ బ్రాహ్మణుడు ధర్మ రక్షణకై పుట్టినాడు. ధర్మాన్ని ఆచరిస్తున్నందు వల్లనే అతడు బ్రహ్మత్వాన్ని పొందుతున్నాడు. అతడు సర్వశ్రేష్ఠుడు. అందరకు సమీపస్థుడు కావున, ఈ ప్రపంచ మంతయు అతని సొత్తుగానే పరిగణింపబడుచున్నది. పైశ్లోకాలకు తాత్పర్యం అలా ఉంటే, అందులో మనుషులందరిలో బ్రాహ్మణుడు ఎందుకు శ్రేష్ఠుడ య్యాడో వివరణ లేదు. ఇక్కడ ధర్మ రక్షణ అంటే– తమ పూట తాము గడుపుకోవడమేనని అర్థం చేసుకోవాలి! వారు కష్టపడిందీ లేదు. ఇతరులకు సహాయపడింది లేదు. సామాజిక కార్యాచరణ లోగడ ఏమీ లేదు. ఇప్పుడూ లేదు. భవిష్యత్తులోనూ ఉండదు. పూజలు చేయకపోతే అరిష్టం అని బ్లాక్ మెయిల్ చేసి, భయపెట్టి సొమ్ము లాగేసుకోవడం తప్ప మరొకటి లేదు కదా? అది అక్రమార్జన అవుతుంది తప్ప సక్రమార్జన కాదు. ఈ దేశం మూఢనమ్మకాల్లో కూరుకుపోవడానికి వీళ్ళే ముఖ్య కారణం! వీరితో పాటు అన్ని మతాల మత బోధకులు కూడా కారణం!!

స్వమేవ బ్రాహ్మణో భుఙ్క్తే స్వం వస్తే స్వం దదాతి చ,
ఆనృశంస్యాద్బ్రాహణస్య భుంజతే హీతరే జనా: 101

బ్రాహ్మణుడు తన సొత్తును తానే అనుభవించుచున్నాడు. తన వస్త్రమును తానే ధరించుచున్నాడు. తన వస్తువులనే దానము చేయుచున్నాడు. పైగా అతని దయాదాక్షిణ్యముల వలన ఇతరులు బ్రాహ్మణుని సొత్తుననుభవించుచున్నారు. ఈ శ్లోకాన్ని, దాని తాత్పర్యాన్ని అర్థం చేసుకుని, కొంచెం ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే విషయం బోధపడుతుంది. సరే ఇంగిత జ్ఞానమంటే ఏమిటీ? అని అడిగే వారే ప్రస్తుతం అధికారంలో ఉన్నారు. అందుకే కదా జనాన్ని ఆలోచింపజేయడానికి ఈ ప్రయత్నం?

శ్రమ జీవుల్ని అదిరించి, బెదిరించి సంపాదించిన సొత్తు శతాబ్దాలుగా అన్యాయంగా అనుభవిస్తున్నారన్నది వాస్తవం. వారు తినే తిండి వారు పండించుకున్నది కాదు. వారు కట్టుకునే గుడ్డ వారు నేసుకున్నది లేదు. కాళ్ళకు వేసుకునే చెప్పులు వారు కుట్టుకున్నవి కావు. మాసిన గుడ్డలు వారు ఉతుక్కున్నది లేదు. వారు వాడుకునే ఏ వస్తువూ వారు తయారు చేసుకున్నది కాదు. ఒళ్లు వంచింది లేదు. చమటకార్చిందీ లేదు. అప్పనంగా వచ్చింది కూర్చుని ఆరగించడం తప్ప, శ్రమ శక్తి విలువ ఏమిటో వారికేమి తెలుసూ? యదార్థం ఆలోచిస్తే, దానాలు వీరు స్వీకరించడమే గానీ, మరొకరికి వీరిచ్చిం దెపుడూ? ఒకసారి గతాన్ని నెమరు వేసుకుని చూడండి.

తోటి మనుషుల పట్ల మనువాదుల అభిప్రాయాలు, ఆలోచనలు ఎంత నీచంగా ఉంటాయో గమనించండి.. పంది వాసన చూచుట చేతను, కోడి రెక్కల గాలి చేతను, కుక్క చూపు పడుట వలనను, శూద్రుడు తాకుట చేతను పదార్థములు అపరిశుద్ధమగును (మనుస్మృతి 3–24)

ఇది ఒప్పుకోదగ్గదేనా? అసలైన పరిణామవాదం మనుధర్మ శాస్త్రంలో ఉంది చూస్కోండి !

ఒకటవ అధ్యాయం 9–12 శ్లోకాలలోనే అంతా ఉంది. బ్రహ్మ అండం నుండి పుట్టాడు. పుట్టి ఆ అండాన్ని తనే స్వయంగా రెండుగా విడగొట్టాడు. ఆ రెండు భాగాల నుండి ఇంకా ఏమేమి సృష్టించాడో 13వ శ్లోకంలో ఉంది. ఆ పదమూడవ శ్లోకం ప్రకారం ఆకాశం, పృథ్వి, ఆ రెండింటి మధ్య స్వర్గం ఏర్పరిచాడు. ఇంకా వాటి వెంట ఎనిమిది దిక్కులు, ఎనిమిది సముద్ర జలాలు సృష్టించాడు. ఇంత అత్యద్భుతమైన పరిణామ సిద్ధాంతం మనకు మనువాదులు ఇస్తే, దాన్ని గుర్తించకుండా అనవసరంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం వెనక పడ్డారెందుకూ? పాపం! ఈ ప్రస్తుత ప్రభుత్వాన్ని మనం అనవసరంగా ఆడిపోసుకుంటున్నామా? ప్రపంచం ఆమోదించిన డార్విన్ సిద్ధాంతం పాఠ్య గ్రంథాల్లోంచి తీసేసి భావిభారత పౌరుల జీవితాల్లో చీకటి నింపకండని అనవసరంగా గగ్గోలు పెడుతున్నామా? ఒక్కసారి ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే ఎవరి జవాబు వారికే లభిస్తుంది. మనమేమంటున్నామనీ? ప్రభుత్వం వారు అతిగా స్పందిస్తున్నారు ? ఉన్నది ఉన్నట్టుగా చెప్పి, ఆలోచించుకునే స్వేచ్ఛ జనానికి ఇవ్వండని అంటున్నాం! అంతే– కల్లబొల్లి కబుర్లు చెప్పి జనాన్ని మభ్య పెట్టకండని అంటున్నాం. అయినా జనం గతంలో లాగా అమాయకత్వంలో ఏమీ కూరుకు పోలేదు. వారు తెలుసుకుంటున్నారు. ఆలోచిస్తున్నారు. విశ్లేషిం చుకుంటున్నారు. వాస్తవాల వైపు, నిజాలవైపు ఆకర్షితులవు తున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన పరిణామాన్ని మనం ఆహ్వానించాలి!

ఈ ఆధునిక వైజ్ఞానిక యుగానికి సరిపడే విధంగా మనుషుల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలన్న తపన తప్ప, మనుస్మృతి పేరుతో ఒక వర్గం వారిని ఉద్దేశించి, వారిని ఎద్దే వా చేయడానికి రాస్తున్నది కాదు. ఇందులోని అమానవీయ మైన విషయాలని మన రాజ్యాంగం, కోర్టులు ఒప్పుకుంటాయా అన్న ఆవేదన ఆందోళన తప్ప ఎవరినో తక్కువ చేసి చూపడానికి కాదు! గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దే బాధ్యత ఈ దేశ పౌరులందరిదీ– అని గుర్తు చేయడం కోసమే ఈ విషయాల్ని ఇక్కడ సమీక్షించడం జరిగింది. శతాబ్దాలుగా ద్వేషం పెంచి పోషించి, మనుషుల్ని విభజించింది చాలదా? ఇకనైనా దృక్పథాలు మార్చుకోవాల్సిన అవసరం లేదా ?

**'నువ్వు ఆనందకరమైన జీవితం గడపాలనుకుంటే, దాన్ని వ్యక్తులతోనో లేక వస్తువులతోనో గాక, ఒక లక్ష్యంతో ముడి పెట్టుకో' – ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.**

❑

# చార్వాకం - తొలి భౌతికవాదం



-కె.శ్రీనివాసాచారి

**'చార్వాకులవిగా చెప్పబడిన సూత్రాలన్నీ కనీసం రెండున్నర వేల సంవత్సరాల తరువాత - ఈనాడు కూడా అదే రూపంలో సమర్థనీయం కాకపోవచ్చు, కానీ ఆనాటికి అవి 'ఉన్నత దార్శ నికస్థాయి'కి చెందినవనే విషయంలో సందేహానికి తావులేదు'**

**- రావిపూడి వెంకటాద్రి**

ప్రపంచంలోనే భౌతికవాద దృక్పథంతో తొలి తాత్విక అడుగులు వేసిన వారు - చార్వాకులు! జైన, బౌద్ధాలకు ముందే ప్రపంచంలోనే తొలిసారిగా భౌతిక వాదాన్ని ప్రతిపాదించినవారు చార్వాకులనే చెప్పవచ్చు. వేదాలకు సమాంతరంగా, సమకాలీనంగా సాగిన చార్వాక ఆలోచనా దృక్పథం వేదాలకు భిన్నంగానే సాగింది. నిజానికి భారతీయ తత్వం అంతా భావవాద చింతనే అని భావించే వారి సంఖ్య ఎక్కువ. కానీ ప్రపంచంలో తొలిసారిగా భౌతికవాద తాత్విక దృక్పథాన్ని చార్వాకులు కలిగి ఉన్నారని చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. ఆదిమ చింతనాపరులు అందరూ కూడా భౌతికవాద దృక్పథంతోనే, ప్రాపంచిక దృక్పథంతోనే ప్రకృతిని పరిశీలించారు. కార్యకారణబద్ధంగానే ఆలోచించారు. అయితే కొందరు కార్యకారణ గొలుసులో కొన్ని కార్యాలకు లేదా సంఘటనలకు కారణాలను గుర్తించడంలో వైఫల్యం చెందిన కారణంగా వారు ఆ కారణాలను ప్రకృతికి బాహ్యంగా ఊహించి సంతృప్తి పడ్డారు. కానీ మరికొందరు తమకు తెలియని కారణాలు కూడా ప్రకృతిలోనే అజ్ఞాతంగా ఉన్నాయని, వాటిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## ఇంతకీ ఏది ప్రాథమికం ?

'ఏది ప్రాథమికం?' అనే చర్చ జరగడంతో భావం ప్రధానం అన్న వారు భావ వాదలైనారు. పదార్థమే ప్రధానం అన్నవారు పదార్థ/భౌతికవాదులు అయినారు. కార్యకారణ సంబంధాలను తెలుసుకోవడంలో ఆగిపోయిన వారిని మనం 'భావవాదులు' అంటున్నాం! ప్రకృతిని నిరంతరం తెలుసుకుంటూ, కార్య కారణాలను ఈ ప్రకృతిలోనే వెతుకుతున్న వారిని 'భౌతికవాదులని' అంటున్నాము ! వీరి మధ్య సంఘర్షణ అనాదిగా నడుస్తూ వస్తున్నదే. కానీ భారతదేశంలో చార్వాకులు ఎలాంటి చారిత్రక ఇబ్బంది పరిస్థితుల్లో కూడా భౌతిక వాదాన్ని వదల్లేదు, ఆ ఆలోచనా ధోరణినీ ఆపలేదు. వారు రూపొందించిన 'సమగ్ర భౌతిక వాద తత్వమే'-చార్వాకం అని, లోకాయతం అని, స్వభావ వాదమని, అవైదికం, పాషండం అని ఇతర పేర్లతో పిలిచారు. నేడది "నాస్తికత్వం"గా ప్రసిద్ధి పొందింది అనడం కంటే కూడా కించపరచుబడుతున్నది అనడం సమంజసమే. బార్హస్పత్యం అనే మరో పేరు కూడా ఉంది. పాషండులు, హైతుకులు, తీర్థికులు, ఆజీవకులు, వితండవాదులు, శుద్ధ తార్కికులు, శుద్ధ ప్రత్యక్ష వాదులు, వేద బాహ్యులు, అసురులు అని చార్వాకులను పిలిచే వారంటేనే వారి వైవిధ్యత అర్థమవుతున్నది.

## చార్వాకం అంటే ఏమిటి ?

'చార్వాకం' అనే పదాన్ని గమనిస్తే చార్వీ లేదా చార్వాక అనే ఆచార్యుని బట్టి వీరికి ఆ పేరు వచ్చిందని కొందరంటారు. చారు అంటే అందమైన అని అర్థం, వాక్కు అంటే మాటలు అని మనకు తెలిసిందే. చార్వాకులు అంటే చక్కగా మాట్లాడేవారని ఆ మాటకు అర్థం. అంటే వివేక పూరితంగా, హేతుబద్ధంగా మాట్లాడడమే అని అర్థం.

## మానవేంద్రనాథ్ రాయ్ ఏమన్నాడు ?

ప్రఖ్యాత భారతీయ మానవవాద తత్వవేత్త ఎమ్.ఎన్.రాయ్ చార్వాకం గురించి 'ప్రాచీన భారతదేశంలో పెంపొందిన స్వభావవాద, హేతువాద, సంశయవాద, అజ్ఞేయవాద, భౌతిక వాద ఆలోచనా విధానాలన్నీ సమ్మేళనం చెంది చార్వాకతత్వంలో కనిపిస్తున్నాయి. ఈ చార్వాక సిద్ధాంతాన్ని గ్రీకు దేశంలో విలసిల్లిన ఎపిక్యూరియన్ల సిద్ధాంతంతో పోల్చవచ్చు. అందువల్ల దాన్ని ప్రాచీన భారతదేశంలోని మేధావుల సంస్కృతి నుండి పరిడవిల్లిన అనుకూల అంశంగా అభినందించవచ్చు' అన్నారు.

## చార్వాకుల కాలం మరియు ప్రాచీనత

అన్ని వేదాలకన్నా ఋగ్వేదం ప్రాచీనమైనది. ఋగ్వేద రచన కాలం క్రీస్తుపూర్వం 1500 - 1400 ప్రాంతంలో జరిగిందన్న అంచనాను చరిత్ర బలపరుస్తున్నది. చార్వాకులు వేదకాలానికి సమకాలికులుగా ఉన్నారని చెప్పవచ్చు. అలాగే వేద ప్రమాణాన్ని ఒప్పుకోలేదు,పైగా వేద ఆధిపత్యాన్ని తిరస్కరించారు, కనుక వేద కాలానికి సమాంతరంగా వీరు జీవించి ఉంటారని తెలుస్తున్నది. చార్వాకులు క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం నుండి క్రీస్తుపూర్వం 4వ శతాబ్దానికి మధ్య ఉన్న కాలానికి చెందిన వారై ఉంటారని వారి వ్యతిరేకుల గ్రంథాలను పరిశీలించి చూసినట్టయితే తెలుస్తున్నది. వైదిక మతం క్రీస్తు పూర్వం 1450 నుండి క్రీస్తుపూర్వం 650

వరకు కొనసాగింది. దీనినిబట్టి చూస్తే చార్వాకం కూడా క్రీస్తు పూర్వం 1450 లోనే మొదలైనట్టు తెలుస్తున్నది. చార్వాకుల కంటే ముందు పాశ్చాత్య దేశాలలో ఎపిక్యూరియన్లు భౌతిక వాదాన్ని ప్రచారం చేశారని కొంతమంది చరిత్రకారులు అంటుంటారు. కానీ చారిత్రక సంవత్సరాలను చూస్తే ఎపిక్యూరియన్లు క్రీస్తు పూర్వము 370 నుండి క్రీస్తుపూర్వం 230 సంవత్సరాల మధ్య జీవించినట్టు తెలుస్తోంది. కనుక చార్వాకం కంటే ఎపిక్యూరియనిజమనేది ముందుండే అవకాశము లేదని స్పష్టం అవుతుంది

### భౌతిక వాదాన్ని వదలలేదు!

భౌతికవాద ప్రచారం కేవలం చార్వాకుల కారణంగానే జరిగిందని చెప్పవచ్చు. వారు ఏ కాలంలోనూ విడవకుండా భౌతికవాద ప్రచారాన్ని చేశారు. అవి శుష్క తర్కాల కంటే ప్రజలను వేల రెట్లు అధికంగా ఆకట్టుకున్నాయి. ఒక వాదం వైపు ప్రజలను నడిపించాయి. చార్వాకులకు సమాంతరంగా, సమకాలికంగా పాశ్చాత్య దేశాలలో ఎవరు భౌతికవాదాన్ని ప్రతిపాదించి ముందుకు తీసుకు పోయినట్టు కనిపించరు. భౌతికవాదాన్ని ఆవిష్కరించడంలో, ప్రచారం చేయడంలో భారతీయ తత్వవేత్తలు ముఖ్యంగా చార్వాకులు, జైనులు, బౌద్ధులు, సాంఖ్యులు నిర్వహించిన పాత్ర సామాన్యమైనది కాదు.

### లోకాయత పేరు ఎలా వచ్చింది?

ప్రజలలో సర్వత్రా వ్యాపించి ఉన్నది కనుక, ఇహ లోకాన్ని మాత్రమే విషయముగా గల ఆలోచనా ధోరణి కనుక దీనిని లోకాయతం అంటుంటారు. అనగా అది ప్రజల తత్వ జ్ఞానమే! ఈ తత్వం ప్రధానమైన నొక్కు 'ఈ లోకం' మరియు 'ఈ లోక జీవితం' మీదనే ఉంటుంది, కనుక భౌతిక సంబంధమైనదనేది నిర్వివాదాంశం.

### భౌతికవాద ప్రముఖులు వీరే

అనాదిగా ఉన్న భారతీయ తత్వచింతనను గమనిస్తే కొందరు అతి ముఖ్యమైన భౌతికవాద ప్రముఖులను మనం గుర్తించ వచ్చు. అందులో.. 1.అసిత కేశకంబలి, 2.మక్కలి గోశాలుడు, 3.పూర్ణ కాశ్యపుడు, 4.ప్రకృధ కాత్యాయనుడు, 5.సంజయ వేలెట్టి పుత్ర, 6.పాయసి, 7.కణాదుడు, 8.చరకుడు, 9.సుశ్రుతుడు, 10.గౌతముడు, 11.కపిలుడు, 12.బృహస్పతి ఇలా అనేకమంది చార్వాక ఆలోచనా ధోరణిని ముందుకు తీసుకు వెళ్లారు. అయితే వైదిక మతం వారిని చూస్తూ కూర్చోలేదు. తమ ఆలోచనలను వ్యతిరేకించిన ప్రతి ఒక్కరిని రకరకాలుగా హింసించింది. వారి సాహిత్యం ముందు తరాలకు అందకుండా నాశనం చేసింది. వైదికులు రాసిన సాహిత్యంలోనే తప్ప మరి ఎక్కడా 'అవైదికం' గురించిన సాహిత్యం అందుబాటులో లేదు. వైదికులు, అవైదికులను శత్రువులుగా చిత్రించి, వారిని సంహరించిన గాథలనే ప్రముఖంగా ప్రకటించారు. ఆస్తిక, నాస్తిక శబ్దాలు అనేవి-పరలోకాన్ని ఆమోదించడం, ఆమోదించకపోవడం అనే అంశం ఆధారంగా వాడబడినవి. పరలోకం ఉన్నదని నమ్మిన వారు ఆస్తికులు గాను, పరలోకం లేదనే వారు నాస్తికులుగా ఘుణుతికెక్కారు. ఆ తర్వాత దేవుడు లేడు అనే వాడు నాస్తికుడని మరి కొందరు వ్యాఖ్యానించారు. కానీ ఒక్క చార్వాకులకే వేద నిందకులు అనే ముద్ర స్థిరపడిపోయింది. మనిషి అసహాయ స్థితిలో ఉన్నప్పుడు, దానికి ప్రతిబింబంగా దేవుడు అనే భావనను ఏర్పాటు చేసుకున్నాడు అనేది సుస్పష్టం. ప్రపంచంలోని అన్ని సంస్కృతులలో ఈ విషయం సాధారణంగా కనిపిస్తూనే ఉంటుంది.

### చార్వాకంలోని ప్రధానాంశాలు

1. హేతువును బలంగా ప్రయోగించడం.
2. సర్వాన్ని స్వాభావిక తత్వంగా పరిగణించడం.
3. దేవుడిని కాదనడం.
4. వేద ప్రమాణాన్ని తిరస్కరించడం.
5. మానవునికి ఆలోచనా శక్తి ఉన్నది. దాన్ని సరళంగాను, సమగ్రంగానూ రూపొందించుకొని మనన శీలమైన ఆలోచన ద్వారా మానవుడు సమస్తమైన సమస్యలను అర్థం చేసుకొని, వాటిని పరిష్కరించుకోవాలి.
6. సత్యాసత్యాల నిర్ణయానికి వేదాలు ప్రమాణం కాజాలవు.
7. ఈ దేహం స్వయం చోదక యంత్రం వంటిది. దీనికి వేరే సారధి అవసరం లేదు.
8. మానవుల మధ్య వర్ణ భేదాలు పాటించడం హేయం.
9. సంకరం కాని వర్ణమే లేదు.

### చార్వాకుల గురించి చెప్పింది ఎవరు ?

చార్వాకం గురించి, చార్వాకుల ఆలోచనల గురించి మొదటి సారిగా ప్రపంచానికి తెలియజేసినవారు దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ (1918–1993) అని కొడవటిగంటి రోహిణీ ప్రసాద్ గారు రాశారు భారతీయ తత్వ శాస్త్ర చరిత్రలో ప్రథమ అవైదిక సిద్ధాంతం చార్వాకమే. ప్రప్రథమ భౌతికవాద సిద్ధాంతం కూడా చార్వాకమే.. కానీ దాదాపు 2500 సంవత్సరాలకు పూర్వమే ఉద్భవించిన చార్వాకం నేటికీ సజీవంగా కొనసాగుతుండటం అందులోని శాస్త్రీయ సత్యానికి, తాత్విక బలానికి నిదర్శనంగా చెప్పవచ్చు. చార్వాకుల తాత్విక భావాలలో ఆధునిక విజ్ఞానశాస్త్రం ఆమోదించే భావాలు చాలా ఉండటం గొప్ప విషయంగా చెప్పవచ్చు. యజ్ఞయాగాదుల పేరుతో ఆనాడు పురోహిత వర్గం సాగించిన కర్మకాండ వెనుక దాగిన మోసాల్ని, దోపిడీని ప్రప్రథమంగా బయటపెట్టిన విప్లవకారులుగా చార్వాకులు చరిత్రలో నిలిచిపోయారు. ❑

**(ఇది సంక్షిప్తీకరించిన వ్యాసం మాత్రమే)**

# కుల రక్కసి వికృత రూపం పెరుమాళ్ మురుగన్ 'చితి' నవల



-డా.పి.యస్.ప్రకాశరావు

'ఒక సరి బుసకొట్టు నాతని గాలిసోక/నాల్గు పడగల హైందవ నాగరాజు' ఎనిమిది దశాబ్దాల క్రితం జాషువాగారు వాపోయా రు. భారతదేశంలో ఎన్ని మార్పులొచ్చినా నేటికీ ఆ 'నాగరాజు' కోరలు చాస్తూనే ఉన్నాడు. వర్ణాంతర వివాహం చేసుకున్న ఎందరో యువతీ యువకులను కులనాగు కాటేస్తూనే ఉంది. అలా వర్ణవివక్ష పీడనకు గురైన ఓ జంట కథే పెరుమాళ్ మురుగన్ 2017 రచించిన 'చితి'నవల.

తమిళనాడులోని ఓ మారుమూల గ్రామంలో ప్రజల అమాయకత్వాన్నీ ఆర్థిక స్థితిగతులనూ, కుల మౌఢ్యాన్నీ 167 పేజీల ఈ నవలలో ప్రతిభావంతంగా చిత్రించాడు రచయిత. కుమరేశన్ తమిళనాడులోని కాట్టుపట్టి అనే కుగ్రామం. రేడియోలే కానీ అప్పటికింకా టీవీలు రాని కాలం అది . అతని రెండో ఏట 'తండ్రిని దయ్యం చంపేస్తే' ఇరవై ఏళ్ల తల్లి మరయి కొడుకుని అల్లారు ముద్దుగానే పెంచి 11వ తరగతి వరకూ చదివించింది. ఒక మేకల మంద, పైకప్పు లేని పెంకుటిల్లు, కొద్దిగా పొలం ఆమె ఆస్తి. (కొద్దిపాటి పొలం ఉన్నా కూడా ఇంటికి పైకప్పు లేకపోవడం ఏమిటో మరి!) కాబోయే కోడలు ఏడు వారాల నగలతో, బండి నిండా సామానుతో ఘనమైన సారెతో రావాలని ఆమె కోరిక. ఆ ఊరోళ్ళకి ప్రాణం కంటే పరువు ముఖ్యం. కూటికంటే కులం ముఖ్యం. జావలో గంజి నీళ్ళు కలుపుకుని తాగుతారు. పండక్కో పబ్బానికో వరి అన్నం తింటారు. కులం గీతను దాటితే కుళ్ళబొడిచి చంపేస్తారు. యవ్వనంలోకి అడుగుపెట్టిన కుమరేశన్ వాళ్ళ ఊరిపక్క నున్న తోలూరు అనే పట్నంలో దుకాణాలకు సోడాలు సప్లై చేసే పనికి కుదిరాడు. సరోజ అనే కులం తెలియని అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని వచ్చాడు. కానీ తానొకటి తలిస్తే తన ఊరొకటి తలచింది. కొత్తలో కొట్టినట్టు మాట్లాడినా కొన్నాళ్ళకు చూసీ చూడనట్టు వదిలేస్తారనుకుంటే సూటి పోటి మాటలతో హింసించారు. బంధువులు రాబందులయ్యారు. కులం కట్టు బాట్లు కుమరేశన్ తల్లి మరయికి వెన్నులో వణుకు పుట్టించాయి. కొత్త జంటను చూసి తోక తొక్కిన తాచులా లేచింది. కొడుకు ఛాతీ మీద చెళ్ళున బాదింది. కొడుకునీ కోడల్నీ తిట్టాలనుకున్న తిట్లన్నీ తన మేకల్నే తిట్టడం మొదలెట్టింది. ఆమె తిట్లు సాదా సీదాగా ఉండవు 'ఎముక నుంచి కండను కుక్క వేరు చేసినంత' బాధగా ఉంటాయి. మరయి దృష్టిలో కోడలు 'అనాథ కుక్క'. చిన్నప్పుడు భుజాల మీద ఎత్తుకుని పెంచిన అతని మేనమామకు కుమరేశన్' చెత్త తినే బజారు కుక్క'. మేనత్త దృష్టిలో 'విశ్వాసం లేని కుక్క' కుమరేశన్ భార్య ఊరోళ్ళ చూపులకు 'మాయలో పడేసుకున్న మంత్రగత్తె. అక్కడి లోకులు కాకులకంటే ఘోరం. 'ఊరంతటినీ వ్యతిరేకం చేసుకుని బతికి ఉండగలనని అనుకుంటున్నావా ? అంటుందో కాకి. 'ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఆమెను తిరిగి పట్నంలో వదిలేసొస్తే అన్నీ సర్దుకుంటా యి. కావాలంటే అప్పుడప్పుడు వెళ్లి ఆమె తో గడిపిరావచ్చు' మరో కాకి ఉచిత సలహా. కుమరేశన్ సాహచర్యంలో జీవితం పూలనావలా సాగిపోతుందని కలలుకంది సరోజ. ఆ ఊరిజనం కాని మాటలన్నా కాల క్రమేణా ఆదరిస్తారనుకుంది. చివరికి తోడేళ్ళ గుంపులో జింక పిల్లనయ్యానని కుమిలిపోయింది. అందంగా ఆరోగ్యంగా పెరుగుతున్న మొక్కను పీకేసి ఆలనా పాలనా లేని చోట నాటినట్టుంది ఆమె పరిస్థితి. చిన్న పిల్లలతో సహా చీరను గోచీ పోసి కట్టుకునే అలవాటున్న ఆ ఊళ్ళో కుచ్చెళ్లు పోసి చీర కట్టుకున్న సరోజ ఒక వేశ్యలా కనిపిస్తుంది వాళ్లకి. 'నీ మెడ పిసికి చంపేసి, ఆనక నీ వంటికి నీలం రంగు పులిమి విషపు పాము కరవడం వల్ల చనిపోయావని చెబుతారు జాగ్రత్త' కూర గాయలమ్మే ఓ వృద్ధురాలి హెచ్చరించింది. 'ప్రేమించిన అమ్మా యిని పెళ్ళి చేసుకోవడం నేరమా? నేనెవరినీ డబ్బు అడగలేదే! అందరూ ఎందుకని మమ్మల్ని తరిమేస్తున్నారు? 'పెద్ద చేశామని దెప్పుతున్నారు. పిల్లల్ని అందరూ అలాగే పెంచుతారు కదా!' అనుకుంటాడు కుమరేశన్.




ఆ ఊళ్ళో మరియాత దేవత జాతర జరుగుతుంది. కుండల్లో నిప్పు తీసుకెళ్ళి మరియాతని పూజిస్తారు. ఎవ్వరైనా వేరే కులం అమ్మాయిని పెళ్లి చేసుకుని వస్తే ఊరంతా మైలపడుతుంది. దేవతకి కోపం వస్తుంది. ఆమె ఇతర కులాలను సహించదు. మైల వదిలించుకోకుండా జాతర ఏర్పాట్లు చెయ్యకూడదు. ఈ విషయాన్నిలా వదిలేస్తే ప్రతి ఒక్కరూ వేరే కులాల అమ్మాయిల్ని తీసుకొస్తారు. కాబట్టి కుమరేశన్‌ని వెలేస్తారు. అతని నుంచి

విరాళం తీసుకోరు. జాతరకి రానివ్వరు. అతని పొలంలో పనికె వరూ రారు. ఇరుగు పొరుగుతో సంబంధాలుండవు. ఊరు వదిలి వేరేచోట జీవించాలి. ఈ విషయాలన్నీ ఊరందరికీ తెలిసే లా చాటింపు వేస్తారు. కులస్తుల వెలి తల్లి ప్రేమను తోసి పారేసింది. 'నా వంశమంతా భ్రష్టుపట్టి పోయింది. మీ ఆంక్షల న్నీ ఈ కుక్క (తన కొడుకు) మీద అమలు చెయ్యండి. కానీ నన్ను వదిలి పెట్టండి' అని మరయి ఊరోళ్ళను ప్రాధేయపడింది. చివరికి తను కూడా కొడుకుని కోడల్ని వెలేసింది. వాళ్ళు వండిన అన్నం తినదు. తన వస్తువులు ముట్టుకోనివ్వదు. పశువుల కొట్టంలో నివసిస్తుంది. 'నీకంటే నాకు ఊరే ముఖ్యం. అంటుంది. కుమరేశన్ పక్కనున్న విరించి పాళయం అనే ఊళ్ళో తను కొత్తగా పెట్టే సోడాల కొట్టు ఏర్పాట్లు చూడ్డానికి వెళ్ళాడు. పొద్దు పోయినా రాలేదు. అప్పుడు రక్కసి మూకలు ఒక్కటయ్యాయి. గర్భవతి అయిన సరోజను మట్టుబెట్టాలని, లైంగిక దాడి చెయ్యాలని ఇంటిని చుట్టుముట్టారు. అదృష్టవశాత్తూ ఆమె బహిర్భూమికి సమీపంలోని పొదల మధ్యకు వెళ్ళింది.(భార్య మీద ఎంతో ప్రేమ ఉన్న కుమరేశన్ కనీసం చిన్న మరుగుదొడ్డి కూడా ఏర్పాటు చేయలేకపోవడం ఆశ్చర్యమే!) సరోజ ఇంట్లో లేకపోవడంతో ఆ దుండగులు పొదలవేపు వెతుక్కుంటూ వచ్చారు. కుమరేశన్ ఊరి నుంచి వస్తే అతన్ని కూడా హతమార్చాలనేది వాళ్ళ ఆలోచన. కుమరేశన్ తల్లి కూడా ఆ కులోన్మాదులకు వంత పాడింది. 'నా కొడుక్కి ఏమైనా అవుతుందేమో అని ఇన్నాళ్ళూ ఓపిగ్గా ఉన్నాను. లేదంటే ఎప్పుడో గరికమట్టతో దాని గొంతు కోసి ఉండే దాన్ని' అంటుంది. వాళ్ళు భరోశా ఇచ్చారు. 'ఊరంతా మనవేపు ఉన్నారు. ఓ గంటలో పని పూర్తిచేస్తాం. ఆమె కన్న వాళ్లొస్తే మొసలి కన్నీరు పెడదాం. భయపడకు' అని ధైర్యం చెప్పింది ఆ మూక. వాళ్ళకి కనిపిస్తానేమో అని ఆమె భయంతో కంపించిపోయింది సరోజ. కర్రలతో కొట్టి చంపు తారో! కొడవళ్ళతో నరికి చంపుతారో! అనే ఆందోళనతో ప్రాణం ముందే పోయేలా ఉంది. భర్త వచ్చే వరకూ ప్రాణంతో ఉంటే చాలను కుంది. విషంతో సమానమైన ముళ్ళూ, పురుగూ పుట్రా ఆమెను భయపెట్టడం లేదు. ముళ్ళపొదలు ఆగంతకులకు ఆటంకంగా ఉన్నాయి. 'పొదలకు నిప్పు పెడితే ఆమె పీడ విరగడవుతుందని' ఓ కిరాతుడి సలహా. వెంటనే మంటపెట్టారు.

మంటలు సమీపిస్తున్న వేళ కుమరేశన్ సైకిలు శబ్దం వినిపించడంతో సరోజ ఊపిరి పీల్చుకోవడంతో నవల ముగుస్తుంది. మనుషుల పేర్లూ , ఊరి పేర్లూ లేకపోతే ఇది అనువాద నవల అని మనకు అన్పించదు. కె.సురేష్ గారి అనువాదం అంత సరళంగా ఉంది. మంచి అనువాదానికి ఇంతకంటే తార్కాణం ఏముంటుంది? ❑

## 'సనాతనధర్మం' మీద బ్రిటిష్ వాడి దాడి!

(19వ పేజీ తరువాయి)

ధర్మ పరిరక్షకులు సతీసహగమనం అనే పవిత్రకార్యం కనిపెట్టారు. బతికున్న మనిషిని మంటల్లో పడవేసి హత్య చెయ్యడం ఏమిటి? అని బ్రిటిష్ ప్రభుత్వం 1829లో సతీసహగమన నిషేధ చట్టం చేసింది. అసలు మా సనాతన ధర్మంలో వేలు పెట్టడానికి మీకేమి హక్కు ఉందండీ? అంటూ ఆనాటి ధర్మదీక్షాపరులైన కొందరు లండన్ కోర్టుకు వెళ్లి, ఈ క్రూరమైన చట్టం రద్దు చేయమని వ్యాజ్యం వేశారు. కాని అక్కడి జడ్జీలకు మన సనాతన ధర్మంలోని విశిష్టత, గొప్పదనం వగైరాలు తెలిసి ఏడిస్తేగా ? సతీ సహగమనం శిక్షార్హమైన నేరం అని తీర్పు ఇచ్చారు. ఆనాటి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగించే ఉద్యోగులకు కులం ఆధారంగా దూరదూరంగా సీట్లు కేటాయించేవారేమో ? మనకైతే స్కూళ్లల్లో దళితుల పిల్లలను వేరుగా కూర్చోబెట్టడం తెలుసు. ప్రభుత్వ కార్యాలయాల్లో కుల మత వివక్ష ఉండరాదని 1831లో బ్రిటిష్ ప్రభుత్వం చట్టం చేసింది. వాళ్లు నియంతలు కాబట్టి కుల మత వివక్ష కూడదంటూ పరిపాలన సాగించారు. కాని ఇప్పుడు డెమోక్రసీలో ఓటర్లను కుల, మత ప్రాతిపదికన విడదీయకుండా ఎలా కుదురుతుంది? కులాలను, మతాలను కాపాడవలసిన బాధ్యత ప్రజా ప్రభుత్వానికి ఉంటుంది కదా, అందుకేగా కులాలవారీ కార్పొరేషన్లు, కులాలకు బిల్డింగులు కట్టించి ఇస్తున్నది ప్రభుత్వం. సనాతన ధర్మం పునాదులు ఉన్నది కులాలలోనే కదా ? కులాలు మాయమైపోతే సనాతన ధర్మ సౌధం కూలిపోదా? మన సనాతన ధర్మంలో మహారాజులు, చక్రవర్తుల సుపరిపాలన కాలంలో శూద్రులు ఆసనాలపై కూర్చోరాదు. ఎక్కడైనా సరే నేల మీద కూర్చోవాల్సిందే. అగ్రకులాల వారికే ఆసనాలు. కానీ, శూద్రులు కుర్చీలలో కూర్చోవచ్చు అంటూ, 1835లో వారికి ఆ హక్కు ఇస్తూ బ్రిటిష్ ప్రభుత్వం చట్టం చేసింది. సనాతన ధర్మంలో ముఖ్యమైనది ఆడ పిల్లకు ఎనిమిదో ఏట పెళ్లి చెయ్యడం. ఆడపిల్లల పాలిట పీడగా తయారయిన ఈ సనాతన ధర్మం అన్యాయమని భావించిన బ్రిటిష్ ప్రభుత్వం 1929లో బాల్య వివాహ నిషేధచట్టం తెచ్చింది. దీని ఫలితం ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం కదా ? ఆడపిల్లలు ముందు చదువు, తర్వాత ఉద్యోగం, కెరీర్ ఆ తర్వాతే పెళ్లి అంటూ పాతికేళ్ళు వచ్చినా పెళ్ళిళ్లు చేసుకోకుండా ధర్మహననానికి పాల్పడుతున్నారు. ఆకాశంలో సగం అంటున్నారు. అన్ని రకాల ఉద్యోగాలు చేస్తామంటూ, చట్టసభల్లో సగం సీట్లు ఇస్తారా, చస్తారా ? అంటూ బరితెగిస్తున్నారు. ఇదంతా దేనివల్ల ? బ్రిటిష్ దుర్మార్గులు మన సనాతన ధర్మం నాశనం చేయడానికి చట్టాలు చేయడం వల్లనే. ఇప్పుడు ఏలినవారి తక్షణ కర్తవ్యం ఏమంటే, గతంలో బ్రిటీష్ వారు తెచ్చిన చట్టాలన్నీ రద్దు చేసి, ధర్మ వ్యతిరేకుల మీద రాజ ద్రోహం కేసులు పెట్టి, సనాతన ధర్మ పరిరక్షకుల కోరికను నెరవేర్చడం. ❑


# భారతీయత.. జాతీయ సమైక్యత



- ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి

**కొత్త సచ్చిదానందమూర్తి (1924సెప్టెంబరు25-2011జనవరి 25) ప్రఖ్యాత తత్వ శాస్త్రాచార్యుడు. ఆంధ్ర విశ్వ కళా పరిషత్లో తత్వ శాస్త్రాచార్యునిగా, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయములో ఉప కులపతిగా పనిచేశాడు. బౌద్ధ మతముపై, బుద్ధుని బోధనల తత్వముపై విశేష పరిశోధనలు చేశాడు. ఆచార్య నాగార్జునిపై ఎంతో కొనియాడబడిన గ్రంథము వ్రాశాడు. భారతీయ తత్వ శాస్త్రానికి సరికొత్త నిర్వచనం చెప్పిన ప్రఖ్యాత తత్వవేత్త, పద్మ విభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి తత్వవేత్తగా 50కి పైగా పుస్తకాలు, వందల కొలదీ వ్యాసాలు రాశారు.**

ముందుగా నాకు ఉత్తేజం కలిగించే మంగళ శ్లోకాన్ని, దాని సారాంశాన్ని తెలియపరుస్తాను. 'విద్యా కైరవకౌము దీమ్ శ్రుతి శిరః సీమంత ముక్తామణిమ్ దారాన్ పద్మభువస్త్రి లోక జననీమ్ వందే గిరామ్ దేవతామ్' కాకతీయ ప్రతాప రుద్రుని ఆస్థానకవి, అలంకార శాస్త్రంలో ప్రావీణ్యుడైన విద్యానాథుడు 'ప్రతాప రుద్రీయం'లో ఈ మంగళ శ్లోకాన్ని రచించాడు. నేను రెండు వరుసలను పఠిస్తాను. 'తామర పువ్వుల నుండి ఉద్భవించి, ముల్లోకాలకు తల్లివంటిదైన, ఎవరి వలన అందరికీ ఉల్లాసం కలుగుతుందో, ఎవరిని వేదాంతం వలన తెలిసికొనగలమో అటువంటి దేవేరి అయిన వాగ్దేవికి నా ప్రణామాలు'. పూర్వ కాలం భారతదేశ చరిత్రను అవలోకనం చేసుకొన్నట్లయితే, కొన్ని స్వతంత్ర రాజ్యాలుగాను (suzerians), మరికొన్ని పరతంత్ర రాజ్యాలుగా (vassals) కొనసాగుతుండేవి. భారతదేశం ఏ కాలంలోను ఐక్యతను సాధించలేకపోయింది. అవి చిన్న రాజ్యాలు కావడం, ఒకరిపై మరొకరికి ద్వేషం, దాడులు జరుపుతూ ఓడిన వారి సంపత్తిని దోచుకొని వారిని నిర్వీర్యం చేయడం, లేదా తమకు అనుకూలురను పరాధీన రాజ్యాలుగా గుర్తించడం, అమలులో ఉన్న ఆచారాలను, న్యాయాన్ని, మతాన్ని ధ్వంసం చేయడం వంటి వాటితోపాటు ఏ రాజుకు విశాల సామ్రా జ్యాన్ని ఏర్పాటు చేయాలనే ముందుచూపు లేకపోవడం వంటి వాటిని కారణాలుగా పేర్కొన వచ్చు. ఇంకా వివరంగా నేను వ్రాసిన ఇండియన్ ఫారిన్ పాలసీలో వివరిం చడం జరిగింది. పైవాటికితోడు శిక్షణ పొందిన సైన్యాలు కాని, ఏకీకృత పరిపాలన గాని, ఒకే న్యాయ వ్యవస్థ కాని లేవు. ఒకరి మీద అనుమానంతో మరొకరు, సామ్రాజ్య విస్తరణ కాంక్ష వలన, భయంకర విజయాలకు (లోభవిజయ - అసురవిజయ) ఉద్యుక్తులయ్యేవారు. ఈ కారణాల వలన భారతదేశము ఏకీకృతపాలన లేదా ఒకే రాజవంశం కిందికి రాలేకపోయింది.




భారతదేశ పూర్వ చరిత్రను అవలోకించి నట్లయితే అసాధారణంగా ఒక అంశం మన దృష్టిలో పడక మానదు. పశ్చిమ చాళుక్యులు చోళులకు, యాదవులు, హొయసలులు, పాండ్యులు, కాకతీ యులు సామంతులు. అయితే చాళుక్యులు, చోళులు కొన్ని శతాబ్దాల నుండి అంతఃకలహాలతో బలహీనపడటం కారణంగా పైన పేర్కొన్న నాలుగు రాజవంశాలు స్వాతంత్ర్యాన్ని పొందాయి. అందులో ఎక్కువ రాజ్యాలు ఉప ప్రాంతీయతత్త్వంపై (sub-regionalism) ఆధారపడితే, కాకతీయులు ప్రాంతీయ భాషా తత్త్వం (regional linguism) పైన ఆధారపడ్డారు. వివిధ శాసనాల పరంగా కాకతీయులు దుర్జయ రాజ వంశానికి చెందినవారు, చాతుర్వర్ణ్య వ్యవస్థలో నాల్గో కులానికి చెందినవారు. శాతవాహనుల తర్వాతి కాలంలో తెలుగు మాట్లాడేవారి నందరిని ఒకే ప్రభుత్వం క్రిందకు తీసుకువచ్చినవారు కాకతీయులే. ఇది ఆంధ్రత్వ అనే భావనతో తెలుగువారిలో తెనుగు చైతన్యాన్ని తీసుకువచ్చింది. వారి కాలంలో ఆంధ్ర, త్రిలింగ అనేవి పర్యాయ పదాలుగా (synonymous) వాడబడుతుండేవి. ఆ కాలం నాటి శాసనాలు మిగతా దేశాలకంటే త్రిలింగదేశం ఉన్నతంగా ఉండేదని పేర్కొన్నాయి. కాకతీయుల కాలంలోని అభివృద్ధిని ఆ కాలం నాటి ముస్లిం సందర్శకులు వర్ణించడం

జరిగింది. దక్షిణ భారతయాత్రకు వచ్చిన మార్కోపోలో రుద్రమదేవి కాలంలో (1269-89) కాకతీయ రాజ్యాన్ని సందర్శించి, పురజనులకు కావలసిన అవసరాలన్నీ వారికి పుష్కలంగా ఆచార్య సచ్చిదా నందమూర్తి అందుబాటులో ఉండేవని పేర్కొన్నాడు. మార్కోపోలో రుద్రమదేవి వివేకానికి లేదా విచక్షణకు నివాళి అర్పించడం కూడ జరిగింది. కొందరి అభిప్రాయంలో, ఆ కాలంలో విశేష కీర్తి గాంచిన తెలుగు కవి తిక్కన 'ఆంధ్రావళిమోదము' అనే పద్యం లో ఆంధ్రావనిని గూర్చి ప్రస్తుతించడం జరిగింది. శాసనాలలో ఈ విధంగా వ్రాయబడి ఉంది. 'తేషామ్ శిరోభూషణ మేవ దేశ త్రిలింగ నామ జగదేక సీమ'. కాకతీయులు కళలకు, సాహిత్యానికి, శాస్త్రానికి(scientific), వాణిజ్యానికి, వ్యాపారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మిగతా వారిలాగే కాకతీయులు ఎంతవేగంగా పైకి వచ్చి సాధించారో. అంతే వేగంగా వారి పతనం జరిగింది. ఇది వారి ఒక్కరి గురించి మాత్రమే కాదు, పూర్వ కాలపు, మధ్యయుగాలలో అన్ని రాజవంశాలలోను ఇది సర్వసాధారణ విషయం. ఈ విధంగా ప్రాంతీయ రాజవంశాలు బలహీనపడటం, వారిలో ఐక్యత లేకపోవడం, పటిష్ఠమైన సైన్యాలు లేకపోవడం, ప్రజల నుండి సరైన సమర్థత లభించక పోవడంతో మన భారతదేశం విదేశీ దండయాత్రలకు, దోపిడీకి ఆలవాలమైపోయింది.

ఇక్కడ రుద్రమదేవి కొలువులో ఉన్న బద్దెన సుమతీశతకం అనే సంప్రదాయ పుస్తకం వ్రాశాడు. దాని గురించి కొంత ప్రస్తావి స్తాను. వాస్తవికంగా లేదా సానుకూలంగా ఉద్బోధిస్తూ అందు లో, హాని చేసిన వారికి కూడ ఉపకారం చేయాలని (అపకారికి ఉపకారం), ఇతరులకు మేలు (పరహితం) చేయాలని రాశాడు. సాధారణంగా అంగీకరించిన సత్యం, ధర్మం ఉండేదని అయితే పాలించే వారు అంధకార బంధురులుగా ఉంటారని వ్రాశాడు. స్త్రీల పట్ల, కింది కులాల, అలాగే కొద్దిమంది పై కులాల పట్ల దురభిమానం ఉండేదని రాశాడు. శూద్రులకు చదువు పట్ల అవిశ్వాసం కలగచేయడం చదివిన శూద్రుగని చేరజనదుర మొదలగునవి. అవకాశవాదమే ప్రధానాంశంగా చేసే పనిలో నిబద్ధత (commitment), విశ్వాసం లేకుండా తప్పించుకు తిరుగు వాడు ఆశీర్వాదం పొందిన వాడుగా, భూస్వామ్య వ్యవహార జ్ఞానంతో కూడిన నైతికత ఉండేది. (తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ). ఏది ఏమైనా చెప్పిన దానిని ఆచరించని అవకాశవాదులు దీవెనలు పొందినవారు అవుతారు. ఇది మన భారతీయం ఇవన్నీ విరుద్ధ లేదా నకారాత్మక (Negative) భావనలను సూచిస్తాయి. చాలా కాలం ఇది యువకులకు నీతి శాస్త్రంలాగా ఉంది. అయితే అభివృద్ధి చెందిన నైతిక సూత్రాలను యువకులకు నేర్పవలసిన అగత్యం ఉంది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన పిదప ఒక రాజ్యాంగాన్ని రూపొందించు కున్నాము. సర్వసత్తాక ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా ప్రకటించుకు న్నాం. ఆ తరువాత లౌకిక, సమసమాజ అనే పదాల ను చేర్చారు. శ్రీ అరవిందో భారతదేశాన్ని ఒక మహ త్తర చైతన్యపూర్ణ (Vibrant whole) శక్తిగాను, రాష్ట్రాలను పూర్ణత్వంలోని అంగాలు లేదా భాగాలు (organs)గాను భావించాడు. కేంద్ర ప్రభుత్వానికి సమర్థవంతమైన అధికారం(power) స్థాయి (position), హోదా(prestige) ఉన్నప్పటికి, కొన్ని పరి మితులున్నాయి. ఆ పూర్ణత్వంగల కేంద్రంలో రాష్ట్రాలు భాగాలు. అవి స్వతంత్రంగా మనలేవు. అవి కేవలం భాగస్వామ్యాలు, పూర్వులు పేర్కొన్న ధర్మరాజ్య స్థాపనకు అనగా సమ సమాజాన్ని, శాంతిని, సౌభాగ్యాన్ని దేశ మంతా ప్రవర్ధిల్లచేయడానికి ఇవి సహకరించుకోవాలని వారి అభిప్రాయం. భారత రాజకీయ వ్యవస్థ ఒక జటిలమైన (complex) సముదాయం. భారతదేశము వివిధ భాషలు, కుల మతాలు, ప్రాంతీయ భేదాలకు ఆలవాలం. అటువంటి వాటన్నింటిని కలిపి ఉంచి సమన్వయ పరుస్తూ వాటి స్వేచ్ఛను కాపాడుతూ, వాటన్నింటిని సర్వోన్నత సమన్వయ అధికారంతో ఒక అంగాంగ పద్ధతి ద్వారా (organic system) (అంగాంగ పద్ధతి అనగా మానవ శరీరం లోని ఒక అవయవం మరొక అవయవంపై ఆధారపడినట్లు). పూర్ణత్వంతో ఉంచడమే భారత రాజ్యాంగ సిద్ధాంతం, సూత్రం అని శ్రీ అరవిందో ఉద్దేశం. కలిపి 'భారతీయత్వము' గురించి, మనం మిజోలు, పంజాబీలు, మళయాళీలు, ఆంధ్రులు ఎవరైన ప్పటికీ, మనమంతా ఒకే దేశానికి చెందినవారం. విష్ణు పురాణము చెప్పినట్లు దక్షిణాన సముద్రం నుండి ఉత్తరాన హిమాలయాల వరకు ఉన్న మన మందరము భారతీయులం. ఈ భూమండలంలో గలవారికి ఆధ్యాత్మిక అభివృద్ధి, సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని మార్కండేయ, బ్రహ్మ, బ్రహ్మాండ, భాగవత ఆచార్య సచ్చిదా నందమూర్తి పురాణాలలో చెప్పబడింది.

క్రమంగాను సహజంగాను సంక్రమించిన వివిధ జాతుల (ఆర్యన్, ద్రవిడియన్, ఆస్ట్రోలాయిడ్, మంగోలియన్) వివిధ మతాలు (హిందూ, బౌద్ధ, జైన, ముస్లిం, సిక్కు, క్రిష్టియన్), వివిధ నాగరికతలు (పాశ్చాత్య, ఆసియా) భాగస్వాములుగా ఉన్న సర్వసాధారణ సంస్కృతి అందమైంది, రమణీయమైంది చిత్రవర్ణాలంకృతమైంది. అటువంటి సాధారణ సంస్కృతిలో జాగృతితో లేదా సచేతనంగా(Conscious) ఉందాం. భారతీ యత అనేది అత్యంత విలువైంది. దానిపట్ల మనందరం మోహా న్ని పెంచుకోవాలి. పైన నేను ఇంతకుముందే చెప్పినట్లు మనలో అనేక మతాలు, జాతులు, కులాలు, ప్రాంతాల వారు ఉన్నప్పటికీ మనమంతా భారతీయులం. ఇది ఇక్కడ తిరిగి ప్రస్తావించడా నికి సంబంధం ఉంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సార్వజనీన భారతదేశాన్ని సంపాదించుకున్నాం.

రాజ్యాంగం కూడా ధర్మరాజ్య స్థాపనకు అనుకూలంగానే ఉంది. మనదేశములోని కొన్ని రాష్ట్రాల దృష్టిభావం(attitude), స్వాతంత్ర్యం రాక పూర్వం యాదవులు, కాకతీయులు, హొయశాళులు ఒకరితో మరొకరు ఏ విధంగా ఘర్షణ పడే వారో దానిని స్మరణకు తెస్తుంది. శ్రీ అరవిందో కేంద్ర రాష్ట్రాలు అంగాంగిక (organic) సంబంధం కలిగిన, సహకార భాగ స్వామ్యాలు (Co-operative partners) అని చెప్పినప్పటికి ఆచరణలో ఆ స్పృహ లేదు. ఒక గొప్ప విప్లవ కారుడు, రాజనీతి జ్ఞుడు అయిన లెనిన్ నుడివినట్లు వారసత్వాన్ని కాపాడుకోవడ మంటే దానికి పరిమితమైనట్లు కాదు. మనకు చేతనయినంత వరకు వారసత్వాన్ని కాపాడుకుంటూనే దానిలో ఉన్నటువంటి అసత్యమైన, నిరాకరణమైన (denigration) వంటివాటిని నిర్మూలిస్తూనే ప్రజలకు హానికరమైన (retrograde), ప్రజల సంక్షేమానికి వ్యతిరేకమైన వాటిని పనికి రానివిగా వదలిపెట్టి సమాజ అభివృద్ధికి కృషిచేద్దాం. ఉదాహరణకు, వర్ణవ్యవస్థ హిం దూయిజంలో భాగమైందని భావించడం జరుగుతుంది. కొంత మంది ప్రామాణికులతోపాటు నేను కూడ వర్ణవ్యవస్థ హిందూ యిజంలో భాగం అనుకోవట్లేదు. కొన్ని పురాణాలు, స్మృతులలో చెప్పినట్లు అటువంటిది ఎన్నడూ వ్యాపించి యుండలేదు. ఒకప్పు డు అది అమలులో ఉండి కాలంలో కొంత మంచి చేసి ఉన్నదని అనుకొన్నప్పటికి, ఈ రోజు నైతికంగాను, హేతుబద్ధంగాను ఈ నాగరిక సమాజం దానిని అంగీకరించట్లేదు కాబట్టి దానిని నిర్మూలించాలి. అన్ని కాలాలకు తగిన లేదా లాభం చేకూర్చే జీవిత విధానం లేదా పద్ధతి ఉండబోదని మహాభారతం ప్రకటిం చింది. నహి సర్వహిత కశ్చిదాచార సంపర్వతతే (మహాభారత, శాంతిపర్వ 259). యాజ్ఞవల్క్య స్మృతి కూడ ఒకవేళ దేనినైనా ధర్మమని చెప్పినప్పటికీ దానిని ప్రపంచం చీదరించినట్లయితే దానిని పాటించనక్కర్లేదని పేర్కొంది. కాకతీయుల కాలానికి చెందిన ప్రసిద్ధులే వర్ణవ్యవస్థ అనేది భక్తి, వేదాంతాలకు వ్యతిరేకమని గ్రహించారు. కాకతీయ రాజు రుద్రదేవుని సమకాలికుడు మల్లికార్జున పండితుడు తాను భక్తి మీద ప్రేమను వదులుకోలేనని అలాగే బ్రహ్మమును అనుసరించ కుండా ఉండలేనని చెప్పాడు. "భక్తి మీద వలపు బ్రహ్మంబుతో పొత్తు." పూర్వపు భాగమైన బ్రహ్మంబు అంటే వర్ణవ్యవస్థ, ఆచారవిధి (ritual). అతడు ఈ రెండింటి మధ్య వైరుధ్యాన్ని తెలిసి కొన్నాడు. కాని అతని వారసత్వం, పరిసరాలు (milieu) అతని ని దాని నుండి బైటకు తీసుకురాలేకపోయినాయి. వరంగల్ ప్రాంతానికి చెందిన విద్యారణ్యుడు, హరిహరరాయలు-2 విజ యనగర సామ్రాజ్యాన్ని ఏకీకరణం చేయడానికి సహకరించాడు. ఆయన తన వ్యాఖ్యానంలో "వర్ణాశ్రమ మొదలైనవి శరీరానికి సంబంధించినవని భ్రమాత్మకంగా (illusive) ఊహించుకొంటు న్నారు. (పంచదశి ధ్యానదీప, 101) వర్ణాశ్రమద్వయో దేహి మాయయా పరికల్పితః) "ఎవరైతే తాను బ్రాహ్మణుడినని భ్రాంతి జనకంగా (delusion) ఉంటాడో లేదా భ్రమ చెందు తూ ఉంటాడో అతను అపరాధి అని బాధపడుతుంటాడు. ఎవరైతే జ్ఞానం ద్వారా కులం మొదలగు వాటి నుండి పవిత్రం చేసుకోలేకపోతే సంపూర్ణత్వంతో (absolute) కూడిన భావన లేదా ఊహపొందడం అసంభవం". (అనుభూతి ఆచార్య సచ్చి దానందమూర్తి ప్రకాశ XV.31.3,36). సదాచార వ్యతిరేకులైన ప్రతినిధులు ఇది ఊహాజనితమైంది, ఆచరణీయం కానిది అని వాదించవచ్చు. ఇటువంటి వాదం వేదాంతాన్ని అనుసరించేట వారందరూ చీలికమూర్తిమత్వం లేదా విభజన వ్యక్తిత్వం (split personalities) కలవారుగాను, వారి విశ్వాసాలు వారి కార్యాలకు పొంతన ఉండదని సూచించబడుతుంది. అసమానత్వం, అన్యాయం ఏవిధంగా ప్రోత్సహింపబడుతున్నా వాటిని వ్యతిరేకించి, సమాజంలోని అననుకూల వర్గాల స్వేచ్ఛ, అభ్యుదయాల గురించి సమాజంలో వ్యాపింపచేసి, పైన పేర్కొన్నవి ఏ విధంగా ప్రోత్సహించబడుతున్నప్పటికి వాటిని శాశ్వతంగా నిర్మూలించవలసి ఉంది. పూర్వకాలపు హిందూ, బౌద్ధ సిద్ధాంత వేత్తలు సదాచార, శాంతియుత పద్ధతుల ద్వారా భారతదేశాన్ని సమైక్య పరచి, ఒక రాజు లేదా జ్ఞాని దానిని ధర్మరాజ్యంగా తీర్చిదిద్దాలని భావించారు. అసలు భారతదేశం అంటే ఏది అనే దాని గురించి విష్ణుపురాణంలో, "దక్షిణాదిన సముద్రం నుండి ఉత్తరాన హిమాలయగిరుల వరకు ఉన్న ప్రాంతం "భారత", అందులో జన్మించిన వారు భారతీయులు అని పేర్కొనబడింది. ఏ ప్రాంతంలో అయితే ఆనందం, ఆధ్యాత్మికతకు పాటుపడటం, సంక్షేమం, అభివృద్ధి ఉ ంటాయో అటువంటి ప్రాంతం నివాసానికి అనుకూల మైందని పురాణాలు చెప్పాయి. ఎప్పుడైతే స్థానికంగా ఉన్న రాజవంశాలు వారిలో వారు తగువులాడు కొంటూ నిర్వీర్యమైనాయో, అప్పుడు ఉత్తరం నుండి దోచుకోవడానికి, దండయాత్రలకు తమ సామ్రాజ్యాలను సుస్థిర పరచుకొని, వారి మతాన్ని విస్తృత పరచుకోవడానికి ఇతరులకు అవకాశము ఏర్పడిందని పేరొందిన చరిత్రకారులు శ్రీ కె.ఏ. నీలకంఠశాస్త్రి పేర్కొన్నారు. డిగ్రీలు పుచ్చుకొన్న యువతీ యువకులకు నా శుభాకాంక్షలు. వారందరూ సంతోష కరమైన, ఫలవంతమైన జీవితాలు గడపాలని కోరుకుంటూ, ఈ విశ్వ విద్యాలయ 1980 స్నాతకోత్సవసభలో మదర్ థెరిస్సా చెప్పిన దానిని గుర్తుకు తెచ్చుకుందాం. ❑

**ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి గారు చేసిన స్నాతకోత్సవ ఉపన్యాసాలను 'ఇది మన భారతీయం పేరుతో డా॥కొత్త రఘునాథ్ గారు అనువాదం చేశారు. వెల 150 రూపాయలు. ప్రతులు హైదరాబాద్, విజయవాడలలోని ఎమ్మెస్కో పుస్తకాల షాపుల్లో దొరుకుతాయి. మరిన్ని వివరాలకు డా॥కొత్త రఘునాథ్ 98480 47584.**

# సాహిత్యతత్వానికి దారి దీపం-ఆర్వియార్

(అక్టోబరు 18-ఆర్వియార్ 85వ జయంతి)

- డీవీవీయస్ వర్మ



ఆర్వియార్ (రాళ్ళభండి వెంకటేశ్వరరావు) ప్రజ్ఞ బహుముఖమైంది. వృత్తిపరంగా ఇంగ్లీషు అధ్యాపకుడు. అధ్యాపకుడే కాదు గొప్ప అధ్యయనశీలి. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు సాహిత్యాల మీద పట్టు వుంది. 'చదువులలో మర్మమెల్ల చదివితి' అన్నట్లు ఈ మూడు భాషల సాహిత్య మర్మాలు తెలిసినవాడు. దీనికితోడు యూనివర్శిటీలో విద్యార్థి ఫెడరేషన్లో క్రియాశీల కార్యకర్త. అక్కడ మార్క్సిజంతో పరిచయం, అధ్యయనం మొదలైంది. సాహిత్యతత్వాన్ని విశ్లేషించే సూక్ష్మ దృష్టికి మార్క్సిజం ఆలంబనం అయింది. ఆర్వియార్ 20 వరకు స్వీయ రచనలు చేశారు. అవి కేవలం సాహిత్య విమర్శకే పరిమితం అయినవి కావు. మార్క్సిజం పాఠాలు, చరిత్ర, సంస్కృతి వగైరాలతోపాటు పిల్లల కోసం ఇంగ్లీషు తెలుగు నిఘంటువు, స్పోకెన్ ఇంగ్లీషు తదితరాలు న్నాయి. ఆయన బహుముఖ ప్రజ్ఞకు ఇవన్నీ నిదర్శనాలుగా నిలుస్తాయి. తెలుగు సాహిత్యం మీద నాకు తెలిసి ఐదు పుస్తకాలున్నాయి. రాశిలో తక్కువే అయినా వాసి గల రచనలు. అందులో సాహిత్యతత్వం ఒక అపురూపమైంది. సాహిత్య తత్వాన్ని అవగాహన చేసుకోవడానికి నాటికీ, నేటికీ అదొక దారి దీపం. కుటుంబ రావు శైలి మీద, శ్రీశ్రీ ఆలంకారికత మీద రాసిన సుదీర్ఘ వ్యాసాలు ఆర్వియార్ పరిశోధనకీ, సూక్ష్మ దృష్టికీ తార్కాణాలుగా ఎప్పటికీ నిలిచి వుంటాయి. 20వ శతాబ్ది తెలుగు కవుల మీద ఆర్వియార్ చేసిన రేడియో ప్రసంగాల పుస్తకంలో వున్నవి చిన్న చిన్న వ్యాసాలే అయినా ఉద్దండులైన పలువురి కవులపై 'సాహిత్యపరంగా' ఇచ్చిన తీర్పులు ఆయన సాహిత్య దృక్పథానికి అద్దం పడతాయి. స్వాతంత్ర్య సమర చరిత్ర, మతం-మార్క్సిజం, భగవద్గీత-మార్క్సిజం, ఆంధ్ర సాహిత్య చరిత్రలాంటి స్వీయ రచనలలో మార్క్సిస్టు పరిశీలనా పద్ధతి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 140 పైగా పుస్తకాలను




అనువాదం చేసి రాటు తేలిన అనుభవంతో రాసిన 'అనువాదాలు ఆవిష్కరణలు - అవస్థలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం ఆశ్చర్యం కలిగించదు. ఆయన పుస్తకాలు, అను వాదాలు, వ్యాసాలకే పరిమితం కాలేదు. 'పనికొచ్చే ముక్క పేరుతో విశాలాంధ్ర, ఆంధ్రభూమిలో ఆరు సంవత్సరాలపాటు ఒక శీర్షికను నిర్వహించారు. ఇతివృత్తం వర్తమాన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలే. ఇవి వారం వారం రాసే తేలికపాటి రచనలు కావు. ప్రతి దానిలోనూ పలు భాషా సాహిత్యాల గుబాళింపు వుంటుంది. అలాంటి శీర్షిక ఆయన మాత్రమే నిర్వహించగలరు. ఆర్వియార్ గొప్ప సంభాషణా చతురుడు. ఆయన రచనలకంటే, ప్రసంగాలకంటే ఆయనతో సంభాషణ ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. ఆయన మేధోసంపత్తి విశ్వ రూపం కనిపిస్తుంది. ఆర్వియార్ చేసిన బహుముఖ సాహిత్య సేవ విస్మరణకు గురైందని చెప్పలేము. కాని రావలసిన గుర్తింపు మాత్రం రాలేదు. ఈ ప్రత్యేక సంచిక ఆర్వియార్ బహుముఖ సాహిత్య సేవకు ఒక రేఖామాత్ర పరిచయం మాత్రమే. ఆయన రచనలు మరోసారి చదవడానికి ప్రేరణ ఇస్తుందని ఆశిస్తున్నాం. అలాగే ఈ సంచిక తెలుగు సాహిత్యచరిత్రలో ఆర్వియార్ స్థానాన్ని పదిలపరుస్తుందని భావిస్తున్నాం. ❑

## ఆర్వియార్ విశేష సంచిక గురించి

- ఈ సంచిక పీడీఎఫ్ కాపీ కోరిన వారందరికీ ఉచితం. వాట్సాప్‌లో మెసేజ్ పెట్టండి.
- విశేష సంచిక వెల : రూ.100
- ప్రింట్ కాపీ కావాల్సిన వారు డా॥ రమేష్ గారిని సంప్రదించండి.
- ఫోన్ : 93971 14495

# సమూహా.. అవగాహన పత్రం

**- సెక్యులర్ రైటర్స్ ఫోరమ్**

ఆధునిక నాగరిక సమాజాల్లో రాజ్యాంగబద్ధ పాలన ఉంటుంది. ఈ ప్రాథమిక లక్షణాన్నే మనం ప్రజాస్వామ్యం అంటున్నాం. ఇందులో రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒకటి ప్రజలచేత ఎన్నికైన ప్రజా ప్రతినిధుల పాలన. రెండు ఆ పాలనకు దిశా నిర్దేశం చేసి గాడి తప్పకుండా నియంత్రించే న్యాయవ్యవస్థ, పత్రికా రంగం. ఈ రెండు పార్శ్వాలు చక్కగా పనిచేసినప్పుడే అది ఆధునిక ప్రజాస్వామిక సమాజం అవుతుంది. ఇవేగాక సమాజంలోని స్వతంత్ర సంస్థలు ప్రజాస్వామికీరణకు దోహదం చేస్తాయి, దానిని వేగవంతం చేస్తాయి. కానీ మనదేశంలోనే కాక చాలా దేశాలలో ఎన్నికల ప్రక్రియ ద్వారా గద్దె ఎక్కిన పాలకులు ఆధునిక ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేస్తున్నారు. ఏం చేసైనా అధికారంలోకి రావడమే వారికి పరమావధిగా మారింది. దీంతో రాజ్యాంగ నైతికత, రాజ్యాంగ మౌలిక ఆదర్శాలు, విలువలు మాయమవుతున్నాయి.

భారత రాజ్యాంగం ప్రకారం కులం, మతం, ప్రాంతం, భాష, జెండర్, వర్గం వంటి భేదాలు లేకుండా దేశ పౌరులందరూ సమానులే. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలతో కూడిన నిజమైన లౌకిక ప్రజాస్వామిక దేశాన్ని నిర్మించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. దీని కోసం సమాజంలో హేతుబుద్ధిని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంచి, దేశాన్ని ఆధునికంగా తీర్చిదిద్దవలసి ఉన్నది. కానీ అనేక అసమానతలు, అంతరాలు, ఆధిపత్యాలు దేశంలో కొనసాగుతూనే ఉన్నాయి. అధికశాతం ప్రజలు కుల, మత, పితృస్వామిక అణచివేతలకు గురవుతున్నారు. బహుళ అస్తిత్వాలకు, భిన్న ఆహారపు అలవాట్లకు, ఆహార్యాలకు, భిన్న భాషా సంస్కృతులకు, విశ్వాసాలకు చోటు లేకుండా పోతున్నది. వైవిధ్యంతో ప్రజలు జీవించటాన్ని సహించని వాతావరణం తీవ్రమవుతున్నది. మన సామాజిక రాజకీయ పరిస్థితులు అసహనాన్ని, విద్వేషాన్ని, సాంస్కృతిక ఆధిపత్యాన్ని రోజు రోజుకూ పెంచుతున్నాయి.

మొత్తంగా ఉపశ్రేణి సమూహాల భిన్న సంస్కృతులను ఆధిపత్య సంస్కృతి నిరంకుశంగా అణచివేస్తున్నది. పీడిత ప్రజా సమూహాల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నది. వీటి నుంచి ప్రజలలో రేకెత్తే భావోద్వేగాలను పాలకులు ఓట్లుగా మలుచుకుంటూ ఉన్నారు. అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ మౌలిక స్ఫూర్తినే దెబ్బ తీస్తున్నారు. ఏకరూప సంస్కృతిని అందరి మీదా రుద్దుతున్నారు. మతతత్వ ధోరణులను ప్రవేశపెట్టి అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు. చారిత్రకంగా భిన్న మత సముదాయాల మధ్య కొనసాగుతున్న సామరస్య, సహజీవన విలువలన్నిటినీ పాతర వేస్తున్నారు. చరిత్రలోని వైరుధ్యాల, వైషమ్యాల జ్ఞాపకాలను మాత్రమే నొక్కి చెబుతున్నారు. వీటి ప్రాతిపదిక మీద దేశ చరిత్రను తిరగరాస్తున్నారు. పౌర సమాజ సంబంధాలలో, రాజ్య నిర్వహణలో మతప్రసక్తి ఉండరాదనే లౌకిక వాదాన్ని దెబ్బ తీస్తున్నారు. అల్ప సంఖ్యాకుల మతాలను శత్రువుగా చూపెడుతూ అధిక సంఖ్యాక మతస్తులను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. లౌకిక వాదమంటే మైనారిటీలను బుజ్జగించటం అనే విపరీత అర్థాన్ని ఫాసిస్టు పాలకులు సృష్టించారు. తద్వారా మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మెదళ్లలో హింసోన్మాదాన్ని నింపటానికి ప్రయత్నిస్తున్నారు.

దీనినే దాదాపు యాభై ఏళ్ల క్రితం ప్రజాకవి కాళోజీ ఏకీభవించనోడి పీక నొక్కు సిద్ధాంతమే ఫాసిజం అని చెప్పాడు. ఏకీభవించని వాళ్ళు ఎవరు? రాజ్యాంగం పట్ల స్పృహ, హక్కుల చైతన్యం, ఆధునిక ప్రజాస్వామిక విలువలపట్ల అవగాహన ఉన్న వాళ్లు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలతో వీళ్లు ఏకీభవించడం లేదు. సమాజంలోని సమస్త

అసమానతలను ప్రశ్నిస్తున్నారు. అనేక రూపాల్లోని ఆధిపత్యానికి, హింసకు, అణచివేతకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజల పోరాటాలకు స్పందిస్తున్నారు. నిరంకుశత్వాన్ని నిరసిస్తున్నారు. అదే దేశద్రోహ నేరం అవుతున్నది. శిక్షార్హం అవుతున్నది. ఇలాంటి వర్తమానంలో మనం ఉన్నాం.

ఈ నేపథ్యంలో హేతుబద్ధత, సమానత్వం, స్వేచ్ఛ, వైజ్ఞానిక చింతన మొదలైన విలువలను, లౌకికవాద స్పృహను సమాజంలో వ్యాపింప చేయటం కవులుగా, కళాకారులుగా, చింతనాపరులుగా మనముందున్న కర్తవ్యం. స్నేహం, ప్రేమ, సహృదయత, సానుభూతి, సహానుభూతి, మానవత్వం వంటి సున్నిత విలువల ఉమ్మడి స్వరాన్ని బాధిత సమూహాల తరపున వినిపించాల్సి ఉన్నది. వ్యక్తులుగానూ, వేరువేరు సంస్థల్లో భాగంగానూ సృజనకారులుగా మనం ఆ పని చేస్తూనే ఉన్నప్పటికీ అది ఇంకా బలహీనంగానే ఉన్నది. దాన్ని బలోపేతం చేయాలంటే మనం ఏకం కావాలి. అలాంటి అత్యవసరమైన సమకాలీన చారిత్రక సందర్భంలో మనం ఉన్నాం. ఈ అవసరాన్ని తీర్చడానికే ఈ వేదిక నిర్మాణం.

ప్రపంచ మార్కెట్ కోసం దేశాల మధ్య చెలరేగిన ఆధిపత్య పోరుకు పుట్టిన వికృత శిశువు ఫాసిజం. ఇది దేశకాల పరిస్థితులనుబట్టి మారుతూ వస్తున్నది. మన దేశంలో భిన్న జాతులను, భిన్న ఆచార సంప్రదాయాలను, భిన్న అభిప్రాయాలను, ప్రతివాదాలను, ప్రతిపక్షాలను సహించని పెను ఉప్పెనగా ఫాసిజం బలపడుతున్నది. బహుళత్వానికి, ప్రజాస్వామ్యానికి ప్రబల శత్రువు ఇది. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గపు ప్రయోజనాల కోసం అది పనిచేస్తున్నది. కాలంచెల్లిన భూస్వామ్య అంధ కుల మత విశ్వాసాలను జాతీయత పేరుమీద ప్రచారం చేస్తున్నది.

మానవతకు, సహనానికి శత్రువు అయిన ఫాసిజం ప్రమాదాన్ని గుర్తించి ప్రతిఘటించటంలో సాహిత్యకారులు వంద సంవత్సరాల నుంచి ముందు భాగాన ఉంటున్నారు. రెండు ప్రపంచయుద్ధాల మధ్య కాలంలో ఇటలీ, జర్మనీ స్పెయిన్ దేశాలలో పెచ్చురిల్లిన ఫాసిజం ప్రమాదం నుంచి ప్రజలను, ప్రజా సంస్కృతిని రక్షించాలని అంతర్జాతీయంగా రచయితలు పిలుపునిచ్చారు. దాన్ని అందుకొని భారతదేశంలో రచయితలు ప్రతి సందర్భంలోనూ ఫాసిస్టు వ్యతిరేక కూటమి వైపు నిలబడ్డారు. అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి, ఇప్టా ఏర్పడక ముందే ఈ కృషి ప్రారంభమైంది. ఆ తరువాత మరెన్నో ప్రగతిశీల సాహిత్య సంస్థలతో ఈ ఒరవడి ముందుకు సాగింది. దేశంలో ప్రతిపక్షాన్ని, ప్రతివాదాన్ని తుడిచిపెట్టిన ఎమర్జెన్సీ నిరంకుశత్వాన్ని కూడా తెలుగు సాహిత్యకారులు నిరసించారు. ఆ తర్వాత ఫాసిస్టు ధోరణులు పడగ విప్పినప్పుడల్లా కవులు, రచయితలు ఐక్యమవుతూనే ఉన్నారు.

గుజరాత్ మారణకాండలోని గాయపు నొప్పిని తెలుగు కవులు, రచయితలు, సాంస్కృతిక కార్యకర్తలు తమదిగా అనుభవించారు. ఉమ్మడి నిరసనల రూపంలో కవిత్వంగా వ్యక్తమయ్యారు. పత్రికా రచయితలు పరిశోధనాత్మక నివేదికలు సమర్పించారు. జాతి విద్వేష ఘటనలకు వ్యతిరేకంగా వేదికలు పెట్టి పనిచేసిన అనుభవం మనకు ఉంది. ఆ అనుభవాల నుండి గుణపాఠాలు నేర్చుకొంటూ హేతుదృష్టితో, సత్యశోధనకు, స్వతంత్ర పరిశోధనలకు పూనుకొనాలి. స్వేచ్ఛగా, నిక్కచ్చిగా రాయటానికి, తినటానికి, బతకటానికి అవకాశం రోజురోజుకు తగ్గిపోతున్న పరిస్థితులతో తలపడాలి. మూఢత్వానికి, నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని నిర్మించాలి. పోరాటాలకు సంసిద్ధం చేయాలి. ఆ లక్ష్యాలతోనే ఇప్పుడీ వేదికను నిర్మించుకొంటున్నాం.

**వేదిక లక్ష్యాలు :**

- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మౌలిక రాజ్యాంగ విలువలను సామాజిక జీవిత విలువలుగా గుర్తించటం, గౌరవించటం, అమలు కావటానికి ప్రయత్నించటం.
- కులం, మతం, జెండర్, భాష, ప్రాంతం, వర్గం, వయసు, వరుస వంటి అనేక అసమానతలు ప్రజల లోకజ్ఞానంలో వారికి తెలియకుండానే ఇంకిపోయాయి. వారి ప్రవర్తనలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి రక రకాల ఆధిక్య, న్యూనతా భావనల గురించి, వివక్షను గురించి అవగాహనలను అభివృద్ధిపరచటం.
- వ్యక్తిగత జీవితానికి మాత్రమే పరిమితం కావాల్సిన మత పరమైన భక్తి విశ్వాసాలను సామాజిక ఆవరణలో ఉన్మాద స్థాయిలో ప్రేరేపిస్తున్న పాలకవర్గ దుర్మార్గాన్ని గురించి అవగాహన కల్పించటం.
- కులోన్మాదానికి, మతోన్మాదానికి, అసహనానికి, ద్వేషానికి, మారణహోమానికి కారణమవుతూ ప్రజలను నిలువునా చీలుస్తున్న స్వార్థ అధికార రాజకీయాల గురించి పౌర సమాజంలో చైతన్యాన్ని కలిగించటం. సమాజాన్ని మరింత మానవీయంగా మార్చుకొనే సంసిద్ధతను పెంచడం.
- సమాజంలో ఆధిక్యతా న్యూనతల సంబంధాలు అనుక్షణం ఉత్పత్తి అవుతుంటాయి. స్థిరీకరించబడుతూ ఉంటాయి. వివిధ సంస్థల ద్వారా, రకరకాల మాధ్యమాల ద్వారా అవి కొనసాగుతూ ఉంటాయి. ప్రచారమవుతూ ఉంటాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనది విద్యా వ్యవస్థ. ఆధిపత్య వర్గాలకు విద్యా వ్యవస్థ భావజాల ప్రచార సాధనంగా మారింది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనే నైతికతను, శాస్త్రీయతను అభివృద్ధి పరచటం మీద కేంద్రీకరించి పనిచేయటం.

- విద్యా రంగం నుంచి నుండి ప్రభుత్వ వ్యవహారాల దాకా సంస్కృతం, హిందీ భాషల ఆధిక్యాన్ని, ఆధిపత్యాన్ని స్థాపించటానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకొనటం.
- అసమానతలతో కొనసాగుతున్న సంస్కృతిని, నాగరికతను ఆధునికత, ప్రజాస్వామికత గీటురాయిగా తీర్చిదిద్దటానికి భావజాల రంగంలో కృషి చేయటం.

**వేదిక కార్యక్రమాలు**

- రచయితల కోసం అంతర్గతంగా చేయవలసినవి, జనంలోకి తీసుకుపోవటానికి బహిరంగంగా చేయవల సినవి అనే రెండు కోణాలలో వేదిక కార్యక్రమాలు రూపొందించుకొంటుంది.

**రచయితల కోసం కార్యక్రమాలు**

- ఫాసిస్టు భావజాల ధోరణులు, ప్రక్రియల గురించి రచయితలుగా మనం సరైన జ్ఞాన చైతన్యాన్ని పెంచు కోవాలి. దీనికి కనీసం దేశవిభజన కాలం నుంచి అయినా దేశ చరిత్రను తిరిగి అధ్యయనం చేయాలి. అందులో భాగంగా భారతీయ ఫాసిజాన్ని అన్ని వైపుల నుండి సమగ్రంగా అర్థం చేసుకోవాలి. దీనికి అవసరమైన అవగాహనా తరగతులను, కార్యశాలలను నిర్వహించుకోవాలి.
- ఫాసిజం గురించి మాట్లాడేటప్పుడు, రాసేటప్పుడు వాడే పదాలు, భాష, పరిభాషల విషయంలో ఎక్కువమందికి ఆమోదయోగ్యంగా, ఎక్కువ మందిని కలుపుకు వచ్చేలా తీసుకోవలసిన జాగ్రత్తలు, సూత్రాలు నిర్దేశించుకొనటానికి చర్చలు నిర్వహించుకోవాలి.
- మనకు తెలియకుండానే మన లోకజ్ఞానంలో కూడా ఇంకిపోయి మనలను నడిపిస్తున్న ఆధిక్య అధికార లక్షణాల గురించి, వివక్ష, న్యూనతభావాల గురించి హెచ్చరికగా ఉండటానికి నిరంతరం సంభాషణలకు అవకాశం కల్పించుకోవాలి. ఎప్పటికప్పుడు మనలను మనం సరిచేసుకొనటానికి సిద్ధంగా ఉండాలి. ఈ క్రమంలో మనం ఎదుర్కొనే ఆంతరంగిక, బహిరంగ సంఘర్షణలను సాహిత్య వస్తువు చేయగలిగితే మన సంభాషణ, చర్చ మరింత విస్తారం, అర్థవంతం అవుతాయి.
- ఫాసిజానికి వ్యతిరేకంగా మనం చేసే రచనలను ఎక్కడికక్కడ అధ్యయన సమూహాలను ఏర్పరచుకొని చర్చించుకొనటం ద్వారా రచయితలం నిరంతర సంభాషణలో మరింత సన్నిహితం కావచ్చు.

**రచయితల చేత కార్యక్రమాలు**

- ఊడలమర్రిలా సమాజ సంబంధాలలో వేళ్లూనుకొని విస్తరించిన ఫాసిజం బహురూపాలను గుర్తిస్తూ వాటిని ప్రజలకు అర్థమయ్యే రీతిలో పాటో, కవిత్వమో, కథో, నవలో, నాటకమో, వ్యాసమో రాయటం. పాటలు పాడటం, ప్రదర్శన రూపాలను అభివృద్ధి చేయటం రచయితలుగా, కళాకారులుగా మన మొదటి పని.
- కవి సమ్మేళనాలు, కథా పఠనాలు, పాటల జాతరలు, సాహిత్య పండుగలు, అవగాహనా సదస్సులు, చర్చా గోష్ఠులు, నాటక ప్రదర్శనలు నిర్వహించటం. వీటిని పాడ్ కాస్టుల ద్వారా, వీడియోల ద్వారా ప్రచారంలో ఉంచటం.
- సృజన విమర్శన విశ్లేషణా రచనలు, కరపత్రాలు ప్రచురించటం.
- సాంకేతిక మాధ్యమాల్లో వివిధ రూపాలను తయారుచేసుకోవడం. తద్వారా సహనశీలమైన సహ జీవన విలువలతో కూడిన, సరైన ప్రజాస్వామిక ఆలోచనా విధానానికి ప్రాచుర్యం కల్పించటం.
- అసహన, విద్వేష సంస్కృతిపాలు కాకుండా యువతను హెచ్చరించి సరైన ఆలోచనా విధానం వైపు మళ్లించాలి. దానికి వినూత్న, సృజనాత్మక కార్యక్రమాలతో పాఠశాలలను, కళాశాలలను కార్యక్షేత్రాలుగా చేసుకొని పనిచేయటం.
- వైవిధ్య పూరితమైన బహుళ సాంస్కృతిక విలువలను విద్యార్థులలోకి, యువతరంలోకి తీసికెళ్లడానికి తగిన కార్యక్రమాలు రూపొందించుకోవడం.
- కులోన్మాదంతో, మతోన్మాదంతో మారణహోమాలు జరిగిన ప్రతిసారీ మహిళలే మరింత క్రూరమైన దాడులకు గురవుతున్నారు. కాబట్టి ఫాసిస్టు నేపథ్యంలో వివిధ వర్గాల స్త్రీల అనుభవాలను మరింత నిశితంగా అధ్యయనం చేయటం. దానిని సాహిత్య కళా వస్తువుగా మలిచి చర్చలోకి తేవటం.
- రచయితలను, కళాకారులను సమీకరించటానికి జిల్లా స్థాయి రచయితల సమావేశాలు నిర్వహించటం.
- బుద్ధిజీవులను, సామాజిక శాస్త్ర, విజ్ఞాన రంగాలకు సంబం ధించిన నిపుణులను, పత్రికా రచయితలను, ప్రగతిశీల ప్రచురణ సంస్థలను వేదికలో చేర్చుకొంటూ వేదికను విస్తరించటం, బలోపేతం చేసుకొనటం. మనలాగే ఆలోచిం చే సంఘాలను, వ్యక్తులను సమీకరించడం. తక్షణ అవస రాలపై పని చేస్తూనే దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా వేదిక పని విధానాన్ని రూపొందించుకోవడం. వేదిక పక్షాన మూడు నెలలకు ఒక బులిటెన్ ప్రచురించటం. ❑

# 'మార్క్స్ - అంబేద్కర్లు మన మార్గదర్శులు'
# హైదరాబాద్‌లో పుస్తకావిష్కరణ



- రేకా చంద్రశేఖరరావు

సెప్టెంబరు 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమరయ్య హాలులో 'మార్క్స్-అంబేద్కర్లు మన మార్గదర్శులు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. సభికులకు ప్రొఫెసర్ శంకర నారాయణగారు స్వాగతం పలికి, వేదికపైకి అధ్యక్షవర్గాన్ని అతిథులను ఆహ్వానించారు. మొదటగా మార్క్స్-అంబేద్కర్ల ఫొటోలకు సీనియర్ అంబేద్కరిస్టు జేబీ రాజు గారు, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు గారు పూల మాలలు వేశారు. అధ్యక్ష వర్గంగా బొజ్జా బిక్షమయ్య, నల్లా సూర్య ప్రకాష్, వనం సుధాకర్ సభను నిర్వహించారు. బొజ్జా బిక్షమయ్య గారు సభ ఉద్దేశాన్ని చెప్పారు. మార్క్స్-అంబేద్కర్లు మన మార్గదర్శులు పుస్తకాన్ని జేబీ రాజు గారు, బీవీ రాఘవులు గారు కలసి ఆవిష్కరించారు. మొదటిప్రతి ఎంసీపీఐ(యూ) అఖిల భారత కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ గారు స్వీకరించారు. అనారోగ్య కారణంగా సభకు హాజరు కాలేకపోయిన రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు గారి మౌఖిక సందేశాన్ని బిక్షమయ్య చెప్పారు. తాను లాల్-నీల్ మైత్రి నిత్య ప్రచారకుడిని అని, తన పుస్తకం సంకెళ్ళను తెంచుకుంటూ లాల్- నీల్ మైత్రి గురించి గట్టిగా చెప్పానని, తాను లాల్-నీల్ మైత్రీ ఉద్యమంలో చురుకైన భాగస్వామిని అని తన సందేశం మాధవరావు గారు పంపారు. లాల్ - నీల్ మైత్రీ విధాన పత్ర స్థూల అవగాహనను, లాల్ - నీల్ మైత్రీ వేదిక సభ్యులు రేకా చంద్రశేఖరరావు గారు వివరించారు. తర్వాత జేబీ రాజు గారు మాట్లాడుతూ, అంబేద్కర్-కమ్యూనిస్టులు కలసి పనిచేసిన అనేక సంఘటనలు ఉదహరించారు. లాల్-నీల్ శక్తులు సహజ మిత్రు లని చెప్పారు. వారిద్దరి మైత్రి నేడు దేశానికి చాలా అవసరమని చెప్పారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు గారు మాట్లాడుతూ  లాల్-నీల్ మైత్రి అవసరమని, ఈ మైత్రి విస్తృత పరచుకుంటూ వెళ్లాలని అనేక ఇతర శక్తులను కలుపుకుని పోరాడాలని చెప్పారు. వర్గము - కులముతోపాటు పితృస్వామిక దోపిడీపైన పోరాడాలని చెప్పారు. రేపు బీజేపీ ఓడిపోయినా మనువాదం ఓడిపోదని, ఆ పోరాటం కొనసాగించవలసి ఉంటుందని అదే సందర్భంలో తక్షణం కేంద్రంలో బీజేపీని దించడం కూడా చాలా అవసరమని చెప్పారు. లాల్-నీల్ మైత్రి విధానమే తమ పార్టీ విధానంగా ప్రకటించుకున్న ఎంసీపీఐ (యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ గారు మాట్లాడుతూ లాల్-నీల్ మైత్రి ఆవశ్యకత



గురించి, తమ పార్టీ అందుకోసం ఎలా కృషి చేస్తున్నదీ వివరించారు. నేటి మనువాద, సంఘ పరివార్ బీజేపీ ప్రమాదాన్ని చెబుతూ దానిని లాల్-నీల్ శక్తులు కలిసి పోరాడి ఓడించాలి అని చెప్పారు. ప్రొఫెసర్ కాశీం, గాదగోని రవి, జి.రాములు, ఇంద్రవెల్లి రమేష్ తదితరులు లాల్-నీల్ మైత్రిని నొక్కి చెబుతూ తమ సందేశాలను ఇచ్చారు. భారత్ బచావో నాయకులు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ సంఘ్ పరివార్ శక్తులు ప్రతి వారిని కలుపుకుంటున్నారు, మనమేమో చిన్న చిన్న తేడాలతో విడిపోతున్నామని చెబుతూ మహాత్మాగాంధీ హత్య తర్వాత ఆర్ఎస్ఎస్‌ను సర్దార్ వల్లభాయ్ పటేల్ నిషేధించారు. ఆర్ఎస్ఎస్‌ను నిషేధించిన వల్లభాయ్ పటేల్‌ని వ్యతిరేకించకుండా సంఘ పరివార్ బీజేపీ శక్తులు తమ వాడిగా ప్రకటించుకుని మూడు వేల కోట్ల ఖర్చుతో గుజరాత్‌లో 597 అడుగుల పెద్ద విగ్రహాన్ని కట్టించారు. పర్యాటక కేంద్రంగా చేశారని, మనువాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బుద్ధుడిని తమ వాడిగా చెప్పుకుంటున్నారని, వారి భావజాలానికి ప్రత్యర్థి అయిన భగత్‌సింగ్‌ని తమవాడిగా సంఘ పరివార్ చెప్పుకుంటున్నారని గుర్తుచేశారు. లాల్-నీల్ శక్తులు మైత్రి నెరపకపోగా గోరంత తేడాలు కనపడగానే కొండంత కేకలు వేస్తున్నారు. మొదట మన మధ్య ఉన్న చిన్న చిన్న తేడాలను, విభేదాలను సర్దుబాటు చేసుకోకపోతే, సంయమనం పాటించకపోతే మనం దుర్మార్గమైన, బలమైన మనువాద, సంఘ పరివార్ శక్తులను ఓడించలేమని చెప్పారు. పటిష్టమైన లాల్ - నీల్ శక్తుల మైత్రి సంఘ పరివార్ మనువాద శక్తులను నిలువరించగలదని చెప్పారు. కుల వివక్ష పోరాట సమితి నాయకులూ స్కైలాబ్ మాట్లాడుతూ సంఘ్ పరివార్ శక్తులు ఇప్పటికే కమ్యూనిస్టులను, అంబేద్కరిస్టులను, ముస్లిములను, క్రైస్తవులను శత్రువులుగా ప్రకటించి ఉన్నారని, లాల్-నీల్ శక్తులు ఐక్యమై మనువాద ఫాసిస్ట్ పాలకులను ఓడించాల్సిన తక్షణ కర్తవ్యం అని పిలుపునిచ్చారు. చివరగా డా.మార్కశంకర్ నారాయణ మాట్లాడుతూ మనువాద ఫాసిస్టు పాలకులు ఒక్కొక్కటిగా భారత రాజ్యాంగాన్ని మొత్తానికి మొత్తంగా తీసివేసే దిశలో అడుగడుగునా ప్రయత్నిస్తున్నారని చెబుతూ, రాజ్యాంగం ఎందుకొద్దో మనువాద పాలకులను బీసీ, ఎస్సీ, ఎస్టీలు ప్రశ్నించేటట్లు వామ పక్షవాదులు, అంబేద్కరిస్టులు కృషి చేయాలనీ అన్నారు. ఎంసిపిఐ(యూ) కార్యకర్తలు సభకు ర్యాలీగా రావడం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ❑

## నిశ్శబ్ద శబ్దం.. లక్ష్మి గొల్లపల్లి సాహిత్యం

**ఈ సంకలనం పై కొందరు ప్రముఖుల ప్రశంసలు**

- ఎంత చక్కనిదమ్మ నా తల్లి ఈ పాట సామాన్య గీతం కాదు. ఆర్యుల 'మాతృదేవోభవ'కు అచ్చమైన దళిత రూపం. లక్ష్మి తన గుండెల నిండా దళిత ఇజాన్ని నింపుకుంది.

  - డా. ఎండ్లూరి సుధాకర్

- గొల్లపల్లి లక్ష్మి కవిత్వానికి అంబేద్కర్ ఆలోచనా విధానం వెన్నెముక. కులనిర్మూలన దగ్గర్నుంచి బౌద్ధం స్వీకరించేదాకా అంబేద్కర్ ఆదర్శాలు, ఆచరణలూ ఆమె కవిత్వం నిండా పరచుకుని ఉన్నాయి.


  - కొప్పర్తి వెంకటరమణమూర్తి

- మాకుందీ వేదం/పలుగుబట్టి, పారబట్టి/ పొద్దుకుల పనిచేసి/ రెక్కలాడినా డొక్కలాడని/మట్టిజీవుల వెట్టిజీవుల కంటకారే రక్తధారల రుధిర వేదం' (పంచ(మ)వేదాలు అంటూ దళితుల కవిత్వ మార్గం ఏమిటో చాటి చెప్పారు.

  - డాక్టర్ నూకతోటి రవికుమార్

- నానీలు, పాటలు, కవితలు ఈ మూడు ప్రక్రియల్లో ప్రవేశంతోపాటు విషయ నైపుణ్యం, శిల్ప సౌందర్యంతో రచనలు చేసిన కవయిత్రి గురించి మాట్లాడుకోవాల్సి వస్తే నాకు తెలిసి గొల్లపల్లి లక్ష్మిని ప్రముఖంగా చెప్పుకోవాలి.

  - తాడిపర్తి సంపతరావు




- పుస్తకం వెల : 150
- ప్రతుల కోసం : గొల్లపల్లి అంబేడ్కర్, 94402 62612

# ఒక జిజ్ఞాసి లోతైన ఆలోచనలు

(రమేష్ పట్నాయక్ వ్యాస సంపుటానికి ముందుమాట)

- ఎన్.వేణుగోపాల్



చిరకాల మిత్రుడు రమేష్ పట్నాయక్ తాను రాసిన ఐదు వ్యాసాలను ఒక సంపుటంగా ప్రచురిస్తూ దానికి ముందుమాట రాయమని నన్ను అడగడం ఒక ఆశ్చర్యం. ఈ ఐదు వ్యాసాలలో రెండు నా సంపాదకత్వంలోని 'వీక్షణం'లోనే వెలువడినప్పటికీ, ఆ రచనల్లో వ్యక్తమైన రాజకీయ అవగాహనలతో నాకు ఏకీభావం లేదని కొత్తగా చెప్పనవసరం లేదు. అలా ఏకీభావం లేకపోయినా ప్రగతిశీల శిబిరంలోని అన్ని భావాలనూ, భావ ఛాయలనూ ఆహ్వానించే ఒక వేదిక సంపాదకుడిగా ఆ వ్యాసాలను ప్రచురించడం వేరు, నేరుగా ఆ రచనల సంపుటానికే ముందుమాట రాయడం వేరు. అయితే ఎంత ఏకీభావం లేని విషయంతోనైనా చర్చ, సంభాషణ, సంవాదం జరపాలని, స్థూలంగా ఒకే శిబిరంలో వున్న భిన్నాభిప్రాయాల మధ్య, అభిప్రాయాల ఛాయాభేదాల మధ్య ఆరోగ్యకరమైన ఆదానప్రదానాల చర్చ నిరంతరం జరుగుతుండాలని నేననుకుంటాను. బహుశా నా రాజకీయాభిప్రాయాలు, తన అభిప్రాయాలతో నా విభేదాలు తెలిసికూడా నా నుంచి ఈ నాలుగు మాటలు కోరుతున్నందు వల్ల రమేష్ కూడా అట్లాగే ఆలోచిస్తున్నారని అనుకుంటాను. ఏమైనా నా నుంచి ఈ నాలుగు మాటలు కోరడం రమేష్ సౌహార్ద్రానికి, అత్యవసరమైన ప్రజా స్వామిక చర్చా సంప్రదాయానికి గౌరవనీయమైన నిదర్శనం.




రమేష్‌తో నా పరిచయం ముప్పై ఏళ్లకుపైనే కావచ్చు. పేరు వినడమైతే నలభై ఏళ్లుగా. డిగ్రీలో నా క్లాస్‌మేట్, నాకు చాలా ఇష్టమైన ఆలోచనాచరణవేత్త కె.లక్ష్మి నారాయణ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ చేయడానికి వెళ్లి, అక్కడ సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్.యు.సి.ఐ) ప్రభావంలోకి వచ్చాక, ఆ ప్రభావంలోనే ఉండిన సహ విద్యార్థి, నిశితమైన చదువరి, ఆలోచనాపరుడు, అప్పటికే ఆ భావధారలో నాయకుడు రమేష్ గురించి వినడం మొదలైంది. ఆ తర్వాత లక్ష్మీనారాయణ రమేష్ కుటుంబ సభ్యుడు కూడా అయినందు వల్ల సన్నిహితమయ్యాడు. తర్వాత విద్యా పరిరక్షణ ఉద్యమంలో, అనేక ప్రజా ఉద్యమాల కార్యక్రమాలలో ఇద్దరమూ తరచుగానే కలుసుకుంటున్నాం. వేదికలు పంచుకుంటున్నాం. అభిప్రాయాలలో తేడాలు, కచ్చితమైన నిబద్ధతలు ఉన్నప్పటికీ మానవ సంబంధాలలో స్నేహం, ఆర్ద్రత కొనసాగవచ్చు. అలాగే, ఎంత తీవ్రమైన అభిప్రాయభేదం ఉన్నప్పటికీ, అవతలివాళ్ల ఆ అభిప్రాయాన్ని గాఢమైన అభినివేశంతో, లోతైన అధ్యయనంతో, ఆచరణతో ఏర్పరచుకుని ఉన్నప్పుడు, తప్పనిసరిగా వారిని గౌరవించవలసి ఉంటుంది. రమేష్ పట్ల ఆ స్నేహ సంబంధంతోనూ, గౌరవంతోనూ ఈ పుస్తకం మీద నా అభిప్రాయం రాయడం గౌరవంగా భావిస్తున్నాను.

ఇక్కడ సంపుటీకరిస్తున్న ఐదు వ్యాసాలు ('భారతదేశంలో భూస్వామ్యవిధానం ఉందా?', 'పెట్టుబడిదారీ ఉత్పత్తి - శ్రమ దోపిడీ - మార్కెట్ సంక్షోభం', 'కులం - కుటుంబం - తెగ (కులం రాజకీయార్థ శాస్త్రం)', 'డేవిడ్ హార్వే పెట్టుబడి - ఏడు ప్రాథమిక వైరుధ్యాలు', 'గిట్టుబాటు ఇస్తే వినియోగధరలు పెరుగుతాయా?') ఐదు భిన్నమైన సందర్భాలలో రాసినవి. అంటే బహుశా భిన్నమైన పాఠకులను ఉద్దేశించి, భిన్నమైన చర్చలలో భాగంగా రాసినవి. మూడు లోతైన సైద్ధాంతిక చర్చ కోసం రాసినవి, దశాబ్దాలుగా కొన సాగుతున్న ఒక రాజకీయార్థిక సంవాదంలో భాగంగా చూడవలసినవి. ఒకటి ఒక ప్రజా ఉద్యమ సందర్భంగా వెలికి వస్తున్న ఒక వాదనకు జవాబుగా ఉద్దేశించినది. ఒకటి ఒక అంతర్జాతీయ మార్క్సిస్టు రాజకీయార్థికవేత్త రాసిన

పుస్తకంలోని కొన్ని భావాలను వివరిస్తూ, విశ్లేషిస్తూ, చర్చిస్తూ రాసినది. సహజంగానే ఈ ఇతివృత్తాల, సందర్భాల, పాఠకుల వైవిధ్యం వల్ల అవి వేరు వేరు అభివ్యక్తితో, వేరు వేరు వాదనలుగా రాక తప్పదు. అయినప్పటికీ, వాటికి అవన్నీ ఒకే రచయిత రాశారనే ఏకసూత్రత మాత్రమే కాక, ఒకే రాజకీయార్థిక దృక్పథం నుంచి వెలువడినవనే ఏకసూత్రతా ఉంది. అన్ని వ్యాసాలలోను ఉమ్మడి అంశం ఇవి యథాలాపంగా, పైపై పరిశీలనలతో రాసినవి కావు. రచయితకు లోతైన అధ్యయనం, సునిశితమైన దృష్టి, సమాజ చలనం నుంచి తగిన ఉదాహరణలు ఎంచుకోగల సామర్థ్యం, మంచి వాదనా పటిమ ఉన్నాయని ప్రతి వ్యాసమూ చూపుతుంది. దాదాపు ప్రతి వ్యాసంలోనూ ఎన్నో కళ్లు మిరుమిట్లు గొలిపే వాదనలు, ఉదాహరణలు, సూత్రీకరణలు ఉన్నాయి. సాధారణంగా పాఠకులకు తెలిసిన విషయాన్నే ఇలా మరొక కోణం నుంచిచూడవచ్చునా అని ఆశ్చర్యం గొలిపే చర్చ ఉంది. తెలుగు నాట మార్క్సిస్టు ఆలోచనా ధారలో ఒకప్పుడు విరివిగా ఉండినప్పటికీ, ఇటీవల బాగా తరిగిపోతున్న ఒక నిశితమైన సైద్ధాంతిక చర్చా, సంవాద సంప్రదాయానికి విలువైన చేర్పులు ఇవి. ఈ వ్యాసాలలో అక్కడక్కడ చేసిన వ్యాఖ్యల పట్ల, నిర్ధారణల పట్ల నాకు భిన్నాభిప్రాయం ఉన్నప్పటికీ, మొత్తంగా వ్యాసాల దిశ తప్పనిసరిగా ఆహ్వానించవలసిందనడంలో సందేహం లేదు. చేయదలచుకున్న వాదనకు అవసరమైన, తగిన ఉపపత్తులను చూపడం, అవతలి వాదనలను పూర్వపక్షం చేయడం, ప్రణాళికా బద్ధమైనవాదనా నిర్మాణానికి పూనుకోవడం, తాను విశ్వసించే రాజకీయావగాహన నుంచి వెలువరించే నిర్ధారణల దిశగా వాదనలను నడపడం వంటి ఎన్నో అవసరమైన మంచి లక్షణాలు ఈ వ్యాసాల్లో ఉన్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ గురించి, రాజకీయార్థ శాస్త్ర ప్రాతిపదికల గురించి, భారత సమాజ నిర్మాణం గురించి, భారత సమాజంలో జరగవలసిన విప్లవం గురించి ఈ వ్యాసాలు చాలా అవసరమైన, కీలకమైన ప్రతిపాదనలు చేస్తాయి.

పాఠకులను మొట్ట మొదట ఆకర్షించేది ఆ కీలక ప్రతిపాదనల విశిష్టత. ఒక సమాజ చలన క్రమంలో, భౌతిక పరిస్థితుల వేగవంతమైన మార్పులలో, స్వీయ మానసిక శక్తులు మధ్యంతర దశ అనుకుని ప్రారంభించిన ఆచరణ దీర్ఘకాలిక దశగా మారవచ్చుననే విలువైన ఆలోచనను విస్తరించకపోయినా, సూచనప్రాయంగానైనా రమేష్ ఒక వ్యాసంలో ప్రతిపాదించారు. ఇది మన సామాజికాచరణలో సాగుతున్న ఒడిదుడుకులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే సూత్రీకరణ. అలాగే, 'శ్రమ కాసారాలైన సరుకులు ఎటువంటి శ్రమ లేని నోట్లతో మారకం జరగడం' అనే ద్రవ్యం గురించిన రాజకీయార్థ శాస్త్ర భావనను చాలా ఆలోచనాస్ఫోరకంగా వివరించారు.

వ్యవసాయాన్ని కూడా ఒక వృత్తిగా గుర్తించాలనీ, వ్యవసాయం ఇతర వృత్తుల వలె ఒక సంప్రదాయ వృత్తి అనీ, కులం గురించి న చర్చను అటు రాజకీయార్థ శాస్త్రంలోకి, ఇటు కుటుంబం లోకి విస్తరించడానికి ప్రయత్నం చేశారు. కుటుంబం ఉత్పత్తి యూనిట్ అని మార్క్సిస్టు రాజకీయార్థ శాస్త్రంలో శతాబ్దానికి పైగా ఉన్న భావనకే మరెన్ని కోణాలు, స్థాయిలు, పొరలు ఉండగల అవకాశం ఉందో సృజనాత్మకంగా విస్తరించారు.

మార్క్స్ కాపిటల్ మీద అపారమైన, అద్భుతమైన కృషి చేసిన డేవిడ్ హార్వేను సగౌరవంగా విశ్లేషిస్తూనే, ఆయన భావనలలో, వాదనలలో కూడా ఎటువంటి లోపాలు ఉన్నాయో, ఉండే అవకాశం ఉందో వివరించారు. డేవిడ్ హార్వే వివరించిన పదిహేడు వైరుధ్యాలలో ఏడు వైరుధ్యాలను తీసుకుని, భారత ఆర్థిక వ్యవస్థ ఉదాహరణల నుంచి మంచి మేధా చర్చ చేశారు. రెంటియర్ క్లాస్(కౌలు వసూలుదారీ వర్గం) అనేది న్యాయా న్యాయాల చర్చ కాదు అని రాజకీయార్థ శాస్త్ర చర్చలో అవసరమైన సైద్ధాంతిక పటుత్వం మీదికి దృష్టి మళ్లించారు. హార్వే సూచించిన రాజకీయ పరిష్కారాలను ఆమోదించడం కష్టం అని నిష్కర్షగా ప్రకటించారు. రాజ్యం పట్ల హార్వే వైఖరి లోని సందిగ్ధాలను విమర్శించారు.

> **రైతులకు గిట్టుబాటు ధరలు ఇస్తే వినియోగదారులకు ధరలు పెరుగుతాయనే అపోహను ఖండించడానికి జరిపిన అద్భుతమైన, విస్తారమైన చర్చలో వేరు వేరు ధరలను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం గురించి, వాల్యూ చైన్ (విలువ గొలుసు)ను ఇంకా లోతుగా అర్థం చేసుకోవలసిన అవసరం గురించి ఎన్నో ఆలోచనాస్ఫోరకమైన వాదనలు చేశారు.**

ఎట్లాగూ మీరీ వ్యాసాలను లోతుగా చదవాలని కోరుకుంటున్నాను గనుక ఆ విశిష్టతల గురించి ఇంకా ఎక్కువ చెప్పను. కాని ఈ వ్యాసాల పరిధిలోనే రమేష్ కొన్ని వాదనలను, చర్చలను ఇంకా విస్తరిస్తే, మరికొన్ని కోణాలు కూడా కలిపి చర్చిస్తే బాగుండునని నాకనిపించింది. ఉదాహరణకు కౌలు వసూలుదార్ల గురించి చర్చ వచ్చినప్పుడు వారికి కౌలు వసూలు మీద, జూదం మీద ఉన్న దృష్టి, ఉత్పత్తి మీద, ఉత్పాదకత పెరుగుదల మీద ఉండదని, లేదా ఉండడం లేదని చాలా చర్చ జరిగింది. ఆ చర్చను ఇక్కడ విస్తరించి ఉండవలసింది. అలాగే సోషలిజంలో కూడా 'పనిని బట్టి ప్రతిఫలం' అనే స్థితి ఉండక తప్పదని, కమ్యూనిస్టు దశలో మాత్రమే 'శక్తి కొద్దీ పని, అవసరం కొద్దీ ప్రతిఫలం' అనే స్థితి వస్తుందని జరిగిన విస్తారమైన చర్చను కూడా విలువ చర్చలో భాగం చేయవలసింది. కులానికి పాదార్థిక (భౌతిక) మూలాల గురించి చేసినఅద్భుతమైన చర్చలో సాంస్కృతిక, భావజాల ప్రోద్బలాల

గురించి, చరిత్ర వారసత్వ భారం గురించి కూడా చర్చించవలసింది. వాల్యూ చైన్ చర్చ సందర్భంలో ఉదాహరణగా ఇచ్చిన లెక్కను ఇంకా విస్తరించి మొత్తం వ్యాపారం, మొత్తం లాభాల గురించి కూడా వివరించవలసింది. సరుకులు అమ్మకం కాకపోవడం వల్ల వచ్చే సంక్షోభం (రియలైజేషన్క్రైసిస్) గురించి మాట్లాడుతున్నప్పుడే, అధికోత్పత్తి సంక్షోభం గురించి మరి కొన్ని కోణాలు చర్చించవలసింది. అది కేవలం అమ్మకం కాకుండా మిగిలిపోయే సరుకుల వ్యవహారం మాత్రమే కాదు, అసలు అధికోత్పత్తి అనేదే చరిత్రలో మొదటి సారి పెట్టుబడిదారీ విధానపు సృష్టి అని మార్క్స్, ఎంగెల్స్ లు చేసిన విశ్లేషణలను వినియోగించుకోవలసింది.

మొత్తంగా ఈ పుస్తకాన్ని, ఈ పుస్తకం ద్వారా రమేష్ సాగించిన, సాగించదలచిన అన్వేషణను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తూనే నా భిన్నాభిప్రాయాల్ని ప్రకటించవలసి ఉంది. అది సాధారణ ముందుమాటల ఆనవాయితీ కాదు గాని, ఈవ్యాసాలు చదువుతున్న పాఠకులకు మరొక కోణాన్ని చూపడం అవసరమని అనిపిస్తున్నది. ఎన్నో ఆహ్వానించవలసిన, ప్రశంసించవలసిన వాదనలూ విశ్లేషణలూ సూత్రీకరణలూ ఉన్న ఈ వ్యాసాలలో నిర్ధారణల దగ్గరికి వచ్చేసరికి మాత్రంకొన్నిచోట్ల రమేష్ తన వాదనల నుంచి తానే పక్కకు జరిగారని నాకనిపించింది. ఖండిస్తున్న వాదనను సంపూర్ణంగా, యథాతథంగా ఉటంకించి ఖండించడం కాకుండా, దాన్ని పొరపాటుగా, పలుచబరచి ఉటంకించి, ఒకరకంగాగడ్డిబొమ్మను తయారుచేసి, దాన్ని ఖండించామనుకునే అలవాటు ఒకటి మామూలుగా తెలుగు మేధా సంప్రదాయంలో ఉంది. కొన్ని సందర్భాలలో రమేష్ కూడా దానికి లోనయ్యారా అని విచారం కలిగింది. ఇతరుల వాదనలను విమర్శించేటప్పుడు రమేష్ చాలా సందర్భాలలో అవసరమైన సమన్వయం పాటించారు గాని, ఆ సమన్వయం కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.

'అర్ధవలసగా ఉండడం వలననే వ్యవసాయక పారిశ్రామిక రంగాలలో తక్కువ వృద్ధి రేటు ఉంది' అని, 'ప్రజాస్వామిక హక్కులు లేవు గనుక ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ కాదు' అని ఎవరో వాదిస్తున్నారని, వారు పునరాలోచించుకోవాలని అంటున్నప్పుడు రమేష్ ఆ అవతలి వాదనలను పూర్తిగా చిత్రించకుండా వ్యాఖ్యానించారనిపించింది. ఆ అవతలి వారు ఈ నిర్ధారణలను విడిగా ఏకైకం అన్నట్టుగా మాట్లాడడం లేదని, ఇటువంటి మరెన్నో నిదర్శనాలను కలిపి వాదిస్తున్నారనీ చూడకుండా, విడదీసి ఒక అంశానికి, ఒక కోణానికి జవాబు చెప్పినా, ఖండించినా, ఆ ఒక్క అంశాన్ని విడదీసినప్పుడు గెలుపు సాధించినా తానే ఇతరంగా చూపుతున్న తన మేధా సంప్రదాయానికి గౌరవం కాదు.

యూరోపియన్ భూస్వామ్యానికి, భారతీయ భూస్వామ్యానికి సామ్యాలు, భేదాలు పరిగణనలోకి తీసుకుని, సమ్యగ్ దృక్పథం పాటించాలని రమేష్ చేసిన సూచన అత్యవసరమైనది. ఆ నేపథ్యంలో యూరపియన్ కౌలు రూపాలకూ, భారతీయ కౌలు రూపాలకూ పూర్తి సామ్యమూ లేదు, పూర్తి భేదమూ లేదు అని గుర్తించి స్వతంత్ర, సృజనాత్మక విశ్లేషణ చేయవలసి ఉంది. అలాగే భారత సమాజంలో 'పెట్టుబడి అభివృద్ధి క్రమం అపభ్రంశం అయింది' అని కూడా రమేష్ సరిగ్గానే గుర్తించారు. కాని అదే నిర్ధారణను మరొక రూపంలో చేసిన వారి మీద, 'యూరప్ తరహా పెట్టుబడిదారుల కోసం వెతికి, వారు కనిపించకపోవడంతో పెట్టుబడిదారీ వ్యవస్థ వృద్ధి చెందలేదని' అంటున్నారనీ, వారు 'పెట్టుబడిదారీ దోపిడీదాని ఇతర రూపాలలో జరిగే అవకాశాలను పరిశీలించలేదు' అని, 'ముందుగా నిర్ణయించుకున్న రాజకీయ పంథానుబల పరచుకోవడం అనే సంకుచిత లక్ష్యంతోనే', 'భూమి సమస్య విప్లవ సమస్య కాదంటే... అవకాశవాదులమై పోతామేమోననే భయం'తోనే వారాపని చేస్తున్నారని అన్నారు. 'భూమిపై ఉత్పత్తిదారుడికి ఏ విధమైన హక్కు లేని, అదనపు ఉత్పత్తి విలువ ఏదో ఒక రూపంలో పెట్టుబడిగా మారే ఈ ఉత్పత్తి విధానాన్ని భూస్వామ్య విధానంగా చెప్పడంకష్టం' అనీ, 'వ్యవసాయ కూలీల శాతం పెరుగుతుండడం పెట్టుబడిదారీ విధానాన్ని సూచిస్తుంది' అనీ వాదించారు.

**'విస్తృతంగా సాగుతున్న సరుకుల ఉత్పత్తి' పెట్టుబడిదారీ విధానానికి ఏకైక సూచిక అన్నట్టు వాదించారు. ధనికరైతులకూ, వ్యవసాయ కూలీలకూ మధ్య 'స్వతంత్రమైన కాంట్రాక్టు' ఉందని కాస్త చిత్రమైన వాదన చేశారు. కౌలు చెల్లించినవాడు అస్వతంత్ర రైతు కానప్పుడు, కౌలు స్వీకరించిన వాడు భూస్వామి కానప్పుడు, వారి మధ్య సంబంధాన్ని భూస్వామ్య సంబంధం అనగలమా అనీ, వసూలు చేస్తున్న కౌలును 'ఏదో ఒక రూపంలో పెట్టుబడిగా మారుస్తున్నప్పుడు' పెట్టుబడిదారుడు అని ఎందుకు అనగూడదు అని ప్రశ్నించారు.**

ఈ మొత్తం వాదనల నుంచి ఒక రాజకీయ నిర్ధారణగా 'దున్నేవారికి భూమి నినాదానికి చారిత్రక సందర్భం ఉందా' అని ప్రశ్నించారు. 'గణాంకాలు భూస్వామ్యాన్ని రుజువుచేయడం లేదు' అనీ, 'విముక్తి ప్రాంతాల భావన నుంచి విముక్తి చెందనిదే ఈ పార్టీలు విస్తరించలేవు' అనీ అంతిమ నిర్ధారణలు చేశారు.

ఈ వాదనలూ చర్చలూ నిర్ధారణలూ దశాబ్దాలుగా భారత సామాజిక శాస్త్రాలలో, సామాజికాచరణలో సాగుతున్న విస్తారమైన చర్చలో భాగం. దాని మీద అంతిమ నిర్ధారణ ఏమీ

లేదు. ఏ ఒక్క నిర్ధారణకూ ఇదే నూటికి నూరుపాళ్లు సక్రమ మైన, సమగ్రమైన నిర్ధారణ అని చెప్పగల అవకాశాన్ని భారత సమాజం ఇవ్వడం లేదు. అయితే స్థూలంగా గుర్తించదగిన అంశాలు కొన్ని ఉన్నాయి. ఒక ఉత్పత్తి విధానం నుంచి మరొక ఉత్పత్తి విధానానికి పరివర్తన మౌలిక విచ్ఛిత్తి (రాడికల్ రప్చర్) అనే మార్క్సిస్టు సూత్రీకరణను అంగీకరిస్తే, భారత సమాజంలో ఆ మౌలిక విచ్ఛిత్తి జరిగిందా ? ఎప్పుడు ? ఆ మౌలిక విచ్ఛిత్తికి యూరప్ చరిత్రలోనైతే బూర్జువా ప్రజాస్వామిక విప్లవం అనే వ్యక్తీకరణ ఉండింది. భారత సమాజంలో దానితో సరిపోల్చగలిగిన చారిత్రక పరిణామం ఏదైనా ఉందా? బూర్జువా ప్రజాస్వామిక విప్లవాల క్రమంలో యూరప్‌లో ఆవిర్భవించిన వ్యవస్థలను అటువంటి విప్లవమేదీ లేకుండానే భారత సమాజంలో అంటు కట్టడం వల్లనే అవి వక్రీకృతరూపాల్లో పని చేస్తున్నాయనే వాదనలో వాస్తవం లేదా? అసలు పెట్టుబడిదారీ విధానమే దాని తొలి రోజుల ప్రగతిశీల స్వభావాన్ని, భూస్వామ్య వ్యతిరేకతను, కాలక్రమంలో అది ద్రవ్య పెట్టుబడిగా, సామ్రాజ్యవాదంగా మారిన తర్వాత పోగొట్టు కుందని, అది భూస్వామ్యంతో, పెట్టుబడి పూర్వ సంబంధాలతో మిలాఖత్తును సాధించిందని చరిత్ర చూపుతున్నప్పుడు (పెట్టుబడి అభివృద్ధి క్రమం అపభ్రంశం అయిందని కూడా ఒప్పుకుంటు న్నప్పుడు) ఇవి పెట్టుబడిదారీసంబంధాలే అనాలనే పట్టుదల ఎందుకు? పెట్టుబడి రానే లేదనీ, సరుకీకరణ జరగనే లేదనీ ఎవరూ వాదించడంలేదు. వచ్చిన పెట్టుబడి స్వభావం ఏమిటి, సరుకు స్వభావం ఏమిటి అనేవే చర్చనీయాంశాలు. అలాగే, ఉత్పత్తి సంబంధాలుఅనే మాటలు మార్క్స్ కేవలం ఆర్థిక, పాదార్థిక ఉత్పత్తికి మాత్రమే పరిమితం చేసినట్టుగా అర్థం చేసుకోవడం సరైనదేనా? సామాజిక-ఆర్థిక నిర్మితిలో సామా జిక, సాంస్కృతిక అంశాలను వేరు చేసి ఉత్పత్తి గణాంకాల, సరుకుల గణాంకాలఆధారంగా మాత్రమే ఉత్పత్తి సంబంధాలను అర్థం చేసుకోవడంలో అసమగ్రత లేదా?

ఇటువంటి అంశాల చర్చకు ఒక ముందుమాట వేదిక కాదు గాని, రమేష్ చర్చించిన అంశాలకు, ముఖ్యంగా నిర్ధారణలకు ఇతర కోణాలు ఉన్నాయని చూపడమే నా ఉద్దేశం. అసలు ఇలా భిన్నాభిప్రాయాలు తలెత్తడానికి కారణమేమిటో నా ఆలోచనచెప్పి ఈ చర్చ ముగిస్తాను. రూపసారాల మధ్య ఏకీభావం ఉంటే శాస్త్రమే అవసరం ఉండదన్నాడు మార్క్స్. నిజానికి మార్క్స్ మాటను ఇంకా విస్తరించడానికి అవకాశం ఉంది. రూపం అని ఆయన ఏకవచనంలో చెప్పినట్టున్నాడు గాని, అది ఎప్పుడూ ఏకవచనం కాదు. ఒకే సారం అనేకానేక రూపాల్లో వ్యక్తమవుతుంది. పరిశీలకులు నిలబడిన స్థానం, చూసేకోణం వల్ల రూపాలు భిన్నంగా కనబడే అవకాశం కూడ ఉంది. సారం కూడ కచ్చితంగా ఒకటే అనడానికి వీలు లేదు. తాత్విక అర్థంలో సారానికి ఏకసూత్రత ఆపాదించవచ్చు గాని, సారం అనేది అనేక అంశాల సమ్మేళనం అయినప్పుడు, ఆయా అంశాలలో దేనికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలనేది స్వీయాత్మక నిర్ణయమే అవుతుంది. అంటే ఒక వస్తువు గురించివిశ్లేషించేటప్పుడు అది అనేక రూపాల్లో కనబడుతున్నందువల్ల, దాని సారంలోని భిన్నాం శాలకు పరిశీలకులు ఇచ్చే ప్రాధాన్యత వల్ల రూప సారాల గురించి భిన్నమైన, సాపేక్షికమైన అంచనాలు, విశ్లేషణలు, నిర్ధారణలు వెలువడే అవకాశంఉంది. ఇటువంటి సాపేక్షిక వైఖరి, నిరంతర అధ్యయనం, నిరంతర విశ్లేషణ, అంతిమ పరి శీలనలో ఆచరణ మాత్రమే స్వీయాత్మక ఆలోచనల గీటురాయి అనే తులనాత్మక అవగాహన ఇవాళ్టి స్థితిలో ఉచితమనుకుం టాను. ఆ విషయం అలా ఉండగా, ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదివి చర్చించవలసిన పుస్తకంగా సాదరంగా, సగౌరవంగా, స్నేహ పూర్వకంగా ఆహ్వానిస్తున్నాను. 'తాత్కాలికంగా కార్మికవర్గ విప్లవాలు వెనుకపట్టు పట్టినా, పెట్టుబడి వ్యవస్థ సృష్టిస్తున్న మార్కెట్ సంక్షోభం, ఉత్పత్తిఅయిన సరకులు అమ్ముకోలేక పోవడమనే సంక్షోభం, మరింత విస్తృతంగా, మరింత బలంగా, మరింత విధ్వంసకరంగా ముందుకు వస్తుంది. అది వివిధ దేశాలలోనూ, ప్రపంచస్థాయిలోనూ విప్లవానికి కావలసిన పరిస్థితులను కల్పిస్తూ ఉంది. విప్లవ యుగంలో విప్లవాలు ప్రతి క్షణం రావు. విప్లవ యుగంలో విప్లవ సంక్షోభాలు అనేకమార్లు వస్తాయి. కాని ప్రతి విప్లవ సంక్షోభం వెంటనే విప్లవం కాజాల దు. ఆపైన విప్లవం సద్యోజనితమైనది కాదు. అది మానవజాతి అత్యున్నత చైతన్యవంతమైన చర్య. అందుకు విప్లవ పార్టీ అవసరం. కార్మికవర్గ విప్లవం ప్రస్తుతమున్న ఉత్పత్తి సంబంధాల స్థానంలో చారిత్రకంగా అవసరమైన, సాధ్యమైన కొత్త ఉత్పత్తి సంబంధాలను ఏర్పరుస్తుంది. ఆ కొత్త ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తులను, వాటితోపాటు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, నైతిక, సాహిత్య కళా రంగాలలో, పర్యావరణ రంగంలో సమాజాన్ని ప్రస్తుత సంక్షోభం నుంచి విముక్తి చేయడానికి ప్రాతిపదికలు కల్పిస్తాయి. ముందుకు తీసుకు వెళతాయి.

**కార్మికవర్గం కుల, మత, లింగ, ప్రాంత, భాషా పరమైన అణచివేతలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను తనపోరాటంలో అంతర్భాగంగా చూడాలి. అట్టి పోరాటాల నిర్వహణకు చొరవ చూపాలి. మధ్యతరగతి వర్గం కార్మిక వర్గంతరపుననే నిలబడాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టిస్తున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, నైతిక, పర్యావరణ విధ్వంసానికి కార్మిక వర్గ విప్లవమే పరిష్కారం" అని రమేష్ చేసిన నిర్ధారణతో, ప్రకటించిన ఆకాంక్షతో, ఆశావాదంతో సంపూర్ణంగా ఏకీభవిస్తూ, ఈ వ్యాసాలలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను.** ❑

# మార్క్స్ సిద్ధాంతాలు : సమాజం, భావజాలం

- అనువాదం :ఆర్వీయార్

- క్లిఫ్ స్లాటర్

## మతం గురించి

మార్క్స్ నిరీశ్వరవాది. ఆయన అంచనాలో దేవుళ్ళూ, దెయ్యాలూ వున్నాయన్న భావన, మనుషులు తామున్న భౌతిక పరిస్థితుల నుంచే పుట్టుకొచ్చింది. మత విశ్వాసాలకి ప్రతిగా హేతుబద్ధ వాదనల మీద దృష్టి కేంద్రీకరించే 'స్వేచ్ఛా' చింతనాపరులు లేదా హేతువాదుల లాంటి వాడు కాదు మార్క్స్. తార్కికత, శాస్త్రానికి నప్పని తీరులో వున్నదని చెప్పి మతాన్ని ఓడించాలని హేతువాదులు లేదా 'స్వేచ్ఛా' చింతనాపరులు అనుకుంటారు. అందుచేత వారు తార్కిక, శాస్త్రీయ ఆలోచన నెగ్గుకు రాగానే మతం అదృశ్యం అయిపోతుందని సహజంగానే భావిస్తారు. ఇలాంటి దృక్పథానికి 'వికాసం' అనేది పెద్ద సమస్య. కొంత మంది హేతువాదులు చేస్తూ వున్న కృషిని మార్క్స్ ఎంత గానో మెచ్చుకున్నాడు. ముఖ్యంగా డిడెరాట్ లాంటి వాళ్ళ కృషిని మెచ్చుకుంటూనే భిన్నమైన అభిప్రాయాలు వెల్లడించాడు. దేవుడు, పవిత్ర సామ్రాజ్యం మనిషి చైతన్యం నుంచి పుట్టు కొచ్చినవే. అవి వాళ్ళ మనసుల్లో తప్ప మరెక్కడా వుండవు అన్నంత మేరకే మార్క్స్ హేతువాదులతో నడిచాడు.

అయితే మానవ చింతన ఈ ప్రత్యేక భ్రమను ఎందుకు సృష్టించింది ? నిత్య జీవిత అస్తిత్వానికి పైన ఎత్తులో ప్రకృతికి భిన్నమైన ఒక శుద్ధ వాస్తవాన్ని గురించి ఎందుకు భావన చేసింది? మార్క్స్ ముందు ఫ్యూయర్బఖ్ ఇదే ప్రశ్నను ఒక అస్పష్ట రీతిలో ప్రతిపాదించాడు. ఆయన ఇచ్చిన సమాధానాన్ని మనం పరిశీలిస్తే ఈ విషయంపై మార్క్స్‌కు వున్న ప్రత్యేక దృక్పథం మనకి స్పష్టంగా తెలుస్తుంది. క్రైస్తవ మత అంతస్సారం మనిషి అంతస్సారమే. మనిషికి ఉన్న మౌలిక విశిష్టాంశాలేనన్నాడు ఫ్యూయర్బఖ్. అంతేగాని మనిషికే వున్న శక్తులుగా అర్థం చేసుకోలేదు. మనిషి ఇది తన అంతస్సారమేనని అర్థం చేసుకోవడానికి బదులుగా, దాన్ని ఏదో మానవాతీత శక్తికి లేదా దేవునికి అంటగట్టాడు. ఫ్యూయర్బఖ్ మానవ అంతస్సారాన్ని మానవ జీవితంలో ప్రతి ఒక్కళ్ళకీ సంక్రమిస్తూ వచ్చిన మానవ స్వభావంగా చూశాడు. 'మానవ స్వభావం' గురించి మార్క్స్‌కి పూర్తిగా భిన్నమైన దృక్పథం వుంది. దాని నుంచే మతం గురించి కూడా ఆయన భిన్నమైన సూత్రీకరణ చేసింది. మార్క్స్‌కి సంబంధించి మనుషుల మూలభూత శక్తులు వాళ్ళ సామాజిక ఉత్పత్తి ద్వారా వచ్చినవి. సమాజ పురోగతి అంటే ముఖ్యంగా సామాజిక శ్రమ విభజనలో పురోగతి. దాని ద్వారానే మనుషులు ప్రకృతిని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. తొలి నాటి సమాజాల్లో వాళ్ళకి తక్షణం అందుబాటులోవున్న ప్రాకృతిక పరిసరాల నుంచి వచ్చిన జ్ఞానం మీదనే ఆధారపడ్డారు. ఆ జ్ఞానం వారి పూర్వుల నుంచి వారికి అందివచ్చింది. తరం తరువాత తరానికి అలానే సంక్రమిస్తూనే వచ్చింది. అత్యంత ప్రాచీన మతాలు మనుషులకీ వాళ్ళ చుట్టూ ఉన్న సహజ పరిసరాలకీ మధ్యనున్న సన్నిహిత సంబంధాల్ని ప్రతిబింబిస్తాయి. వాటి మీదనే వాళ్ళూ, వాళ్ళ తాత ముత్తాతలు ఆధారపడ్డారు. ఆధారపడుతూనే వున్నారు. ఈ మతాలలో అంటే వంశ లాంఛనం (totemism) లాంటి వాటిలో, ప్రాకృతిక సామాజిక-మానవశక్తుల్ని విడివిడిగా తేల్చి చెప్పడం కష్టం. ఓ పక్కన మానవ సంకల్ప సృష్టి విస్తరణగా ప్రకృతిని దర్శించడం వుంటుంది. మానవ ఆచరణాత్మక కార్యకలాపాల విస్తరణగా దర్శించడం వుంటుంది. మరో పక్క ప్రాకృతిక సహజ నివాసం ఉన్న జంతువుల నుంచీ, వృక్ష జాతుల నుంచీ మనిషి ఇంకా వేర్పాటు అవలేదు. కర్మకాండలూ, నమ్మకాలూ గడ్డకట్టుకు పోయి, రూపంలో స్థిరీకృతం అవుతాయి, సామాజిక జీవిత చక్ర వృత్తంతో పొత్తు కలిసి వుంటాయి. తరువాతి తరాలు దీక్ష పొందుతూ వుంటాయి. తూ.చ. తప్పకుండా ప్రాకృతిక చక్రానికి అనుగుణంగా వుండాల్సిన అవసరాన్ని ప్రతిబింబిస్తూ వుంటాయి. అలా వుండడాన్ని వేట, ఆహార సేకరణ ఆర్థిక వ్యవస్థ తెచ్చిపెట్టింది. మతం అనేది మానవుల స్వయం చైతన్యం అంటాడు మార్క్స్. ఆ



మనుషులు తమని తాము ఇంకా తెలుసుకోలేదు (ఆదిమ మతం) లేదా తమని తాము కోల్పోయిన వాళ్ళు (వర్గ సమాజాల్లో మతం). దీన్ని బట్టి మార్క్స్ ఉద్దేశించింది ఏమంటే మానవులు శ్రమ విభజన ద్వారా, సాంకేతికంగా సాధించిన పురోగతి ఆధారంగా రాను రాను ప్రకృతి నియమాల మీద ఆధారపడడం నుంచీ, కరవు కాటకాలు వంటి ప్రాకృతిక ప్రమాదాల నుంచీ విముక్తులు అవుతూ వచ్చారు. అయితే ఇంతటి పురోగతిని హాయిగా తీసుకు వచ్చిన శ్రమ విభజన మనుషులకు తాము చేసే పని మీదా, తమ జీవితాల మీదా అదుపు పోయేటట్లు చేసింది. ఎందుకంటే సొంత ఆస్తి, పీడనా వూపిరి పోసుకున్నాయి కాబట్టి.

అప్పుడు మతం పరాయీకరణ రూపాల్లో ఒకటి అవుతుంది. అదే రకంగా, ఉదాహరణగా సమాజాన్ని నియంత్రించే అధికారంగా పరిగణించే రాజ్యాధికారం, అది తాను పని చేసేటట్టు నిత్యం పునరపి జననం అయ్యేటట్లు చేస్తుంది. అయితే, ఈ పరాయీకరణ చెందిన రూపం వెనుక యధార్థ పరిస్థితి వుంది. రాజ్యం అనేది సమాజంలో వర్గాల వల్ల పుట్టుకొచ్చినటు వంటిది. ఆ వర్గాలకి అది కారణం కాదు. అయితే దేవతల లోకం వేరు. అది మానవ మస్తిష్కాల నుంచి పుట్టుకు వచ్చింది. అది నిరాకార భావం మాత్రమే కాదు. మతాన్ని విశ్వసించే వాళ్ళ అనుభూతులు, ఆకాంక్షలు అందులో నిమగ్నమై వుంటాయి. స్త్రీలకీ పురుషులకీ వెల్లడించడానికి ఏదో నిగూఢ భావం వుండడం మాత్రమే కాదు. పొరపాటుగా అర్థం చేసుకున్న తమ శక్తుల్ని అదే సమయంలో కప్పి వుంచుకోవడమూ కాదు. మతంలో వాళ్ళకి భగ్నమైన మానవ శక్తుల్ని సాధించడం వ్యక్తమౌతుంది. ఇది భ్రమాన్విత సాధనేననుకోండి. మార్క్స్ ఇలా అంటాడు. మతం అనేది 'మానవ మాత్రులకి నిజమైన యధార్థం దక్కనంత మేరకు అది అభూత సాధనగా' వుంటుంది. ఈ మతానికి రెండు పార్శ్వాలుంటాయి.

'మతపర వ్యధ నిజమైన వ్యధకు వ్యక్తీకరణగానూ, నిజమైన వ్యధకు నిరసనగానూ కూడా ఏకకాలంలో వుంటుంది. అణగారిన ఆర్తుని నిట్టూర్పు మతం, హృదయం లోకపు హృదయం. అనాధ్యాత్మిక పరిస్థితుల ఆత్మ. అది ప్రజలపాలిటి మత్తుమందు.' ఈ కారణంగానే మార్క్స్ మతాన్ని విమర్శించ దంతోనే చేతులు దులుపుకోలేదు. అలా చెయ్యడం శాస్త్రీయత, హేతుబద్ధత లేకపోవడాన్ని సూచిస్తుంది. యదార్థలోకం 'హృదయం లేకుండా' ఉన్నంత కాలం, మానవ జీవిత పరిస్థితులు ఉత్పత్తిదారుల అదుపులో లేకుండా వాళ్ళని పీడించినంత కాలం మతం వూపిరితో వుంటూనే వుంటుంది. అందుచేత కర్తవ్యం ఏమిటంటే మతం సహజంగా పుట్టుకొచ్చిన పరిస్థితులకి వ్యతిరేకంగా పోరు సాగించడం. అంటే మతం పుట్టుకొచ్చిన ఆధార భూత పరిస్థితుల మీద పోరు సాగించడం. మతానికి వ్యతిరేకంగా పోరాడటం అంటే, పరోక్షంగా, మతమే ఆధ్యాత్మిక సుగంధంగా వున్న ప్రపంచానికి వ్యతిరేకంగా పోరాడడం మానవునికి భ్రమాన్విత ఆనందంగా ఉన్న మతాన్ని రద్దు చేయాలనే కోరిక నిజమైన ఆనందం కావాలన్న కోరిక. తమ పరిస్థితులలోవున్న భ్రమల్ని తొలగించాలన్న పిలుపు, భ్రమలు అవసరమయేట్లు చేస్తున్న పరిస్థితుల్ని తొలగించాలన్న పిలుపు. అసలు తక్షణ కర్తవ్యం ఏమంటే లౌకిక రూపంలో మానవ పరాయీకరణ ముసుగు తొలగించడం. ఇప్పుడు దాని పవిత్ర రూపం ముసుగు తొలగించడం జరిగింది కాబట్టి.

మతం గురించిన ఈ సిద్ధాంతాన్ని మార్క్స్ ఎప్పుడో 1843లోనే విపులీకరించాడు. దాని నుంచి ఆయన ఎన్నడూ పక్కకి మళ్ళలేదు. ఈ సిద్ధాంతాన్ని మరింత విపులీకరిస్తే, ఆయా ప్రత్యేక తరహా మతాలను, వర్గ సమాజపు ప్రత్యేక పద్ధతుల, భావజాల ప్రతి ఫలనంగా, సమర్థనగా మాత్రమే బోధపరచు కోగలం (నైరూప్య వ్యక్తిత్వ ఆరాధనతో వున్న ప్రొటెస్టాంటిజం పెట్టుబడి దారీ విధానానికి అతికినట్లు సరిపోతుందని మార్క్స్ పెట్టుబడిలో సూచించినట్టు). మతాన్ని నిషేధించడం ద్వారానో, రద్దు చెయ్యడం ద్వారానో దానితో పోరాడవచ్చు అని మాట్లాడడం మార్క్స్ దృక్పథరం రీత్యా, శుద్ధ ప్రలాపం అని దీన్ని బట్టి తెలుస్తుంది. మతం ఆవిర్భవించడానికి కారణ భూతమైన పరిస్థితులను తొలగించడం ద్వారా మాత్రమే మతం అదృశ్యమవుతుందని మార్క్స్ భావించాడు.

### కళలు, సంస్కృతి

మార్క్స్ భౌతికవాది, జీవిత భౌతిక సాధనాలుగా ఉత్పత్తి విధానపు ప్రాముఖ్యతని నొక్కిచెప్పాడు. అందుచేత సృజనాత్మక సాహిత్యం, దృశ్య కళలు, సంగీతం మొదలైన వాటిని తేలికగా, అంత ప్రాముఖ్యం లేనివాటిగా పరిగణించాడని అనుకోవడం జరగవచ్చు. అలా ఎంత మాత్రం కాదు. మార్క్స్ స్వయంగా నాటకాలని, కవిత్వాన్ని, నవలల్ని అనేక భాషలలోని వాటిని ఆసక్తిగా చదివేవాడు. ఆయన రాసిన శాస్త్రీయ, చారిత్రక గ్రంథాలు సందర్భోచితంగా సాహిత్య సూచనలతో, ఉల్లేఖనల తో తొణికిసలాడుతూ వుంటాయి. (ఎస్.ఎస్. ప్రావర్ రాసిన "కారల్ మార్క్స్ ప్రపంచ సాహిత్యం" అన్న గ్రంథాన్ని ముఖ్యంగా చూడండి) అయితే ఇక్కడ మనకు కావలసింది కళనీ, సాహిత్యాన్ని గురించి మార్క్స్‌కు వున్న సామాజిక, తాత్విక సిద్ధాంతాలు ఏమిటీ అన్నది.

ఒక ఫలానా సమాజంలోని స్త్రీ, పురుషుల దృక్పథం ఆ సమాజపు పాలకవర్గ భావజాల ఆధిపత్యంలో వుంటుంది. కాబట్టి రచయితలు, ఇతర కళాకారుల కృషి, ఆ భావ జాలాన్ని వ్యక్తీకరించేదిగా ఉండడం తప్పనిసరి. అయితే ఆ సమాజాలన్నీ

వైరుధ్యాల ద్వారా అభివృద్ధి చెందుతూ వుంటాయి. ఆ సమాజ వర్గపోరాటాలలో నిమగ్నం అయిన స్త్రీ, పురుషులు ఈ వైరుధ్యాల్ని కొంచెం అటూ ఇటూగా చైతన్యయుతంగానే గ్రహిస్తారు. ఆర్థిక, రాజకీయ చింతనలలో మాదిరిగానే ఈ పోరాటాలు, అనుభవాలు కొంతమంది వ్యక్తుల్ని ఒక అవగాహనను అందుకోవడం కోసం ఉత్తేజితం చేస్తాయి. ఆ అవగాహన అప్పటికి చలామణిలో ఉన్న వ్యవస్థనీ, దాని భావజాలాన్నీ చుట్టూ వున్న పరిమితుల్ని ఎదిరిస్తుంది. అందుచేత కొంత మంది రచయితలూ, కళాకారులూ, తమ అనుభవాల అంతరార్థాన్ని అలంకారికంగా ప్రదర్శించే తపనలో (సాహిత్య పరంగా కావచ్చు, దృశ్యమానంగా కావచ్చు, లేదా ధ్వనిపరంగా కావచ్చు) సంచితంగా వున్న పాతతరాల కళాత్మక నైపుణ్యాన్ని కొత్త పద్ధతుల్లో అభివృద్ధి చేసుకుంటారు. అవి అనుభూతులకూ, ఆలోచనలకూ వున్న మూస పద్ధతుల్ని లాగి పారేస్తాయి. లేనట్లయితే మనుషులను కాలం చెల్లిన పద్ధతులకు అవి కట్టు బానిసల్లాగా పడి వుండేటట్లు చేస్తాయి. మార్క్సిజం సౌందర్య శాస్త్ర సిద్ధాంతం కాదు. అంటే అలంకారాలు ఎలా పుట్టుకొస్తాయి, వెల్లడౌతాయి అని చెప్పే సిద్ధాంతం కాదు. లేదా వాటి గుణ యోగ్యతల్ని ఎలా పరిశీలించాలి అన్న ప్రమాణాల్ని నిర్ణయించే శాస్త్రమూ కాదు. అది ఆయా ప్రత్యేక రంగంలో వుండే ప్రత్యేక వస్తువు. అయితే మార్క్సిజం, ఒక పక్క కళ, సాహిత్యాల చరిత్రకీ, మరో పక్క వర్గ పోరాటాల చరిత్రకీ మధ్య వుండే సంబంధాన్ని, ప్రకాశమానం చేస్తుంది. మార్క్స్ అభిప్రాయంలో కళ అనేది ఏదో కాలక్షేపం మాత్రమే కాదు. అది మనం బ్రతుకుతూ వున్న ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ఆసరా అందించే అనేక మార్గాల సమూహంలో ఒకటి కూడా. ప్రకృతితో తలపడేటప్పుడు తమ స్వభావంతో సహా, వెల్లడైన అవకాశాలతో స్త్రీ, పురుషులు అనాదిగా సృజనాత్మక ప్రయోగాలు చేశారు. వ్యవస్థీకృత శాస్త్రీయ కార్యకలాపం వాటిలో ఒకటి. ఎన్ని దృష్టి కోణాల నుంచి చూసినా, బహుశా, తీదే చాలా ముఖ్యమైంది.

ఏమంటే మానవుల మౌలిక స్వేచ్ఛకి, పూచీ ఇచ్చే శక్తి సామర్థ్యాలు దానికి వున్నాయి. అయితే ప్రకృతిలోని అద్భుతాల్ని, 'మానవ స్వభావాన్ని' ఎదుర్కోవడానికి, సుసంపన్నంగా అనుభవంలోకి తెచ్చుకోవడానికి ఇదొక్కటే మార్గం కాదు. అత్యంత ప్రాథమిక స్థాయిలో, సుస్పష్టంగా సాహిత్యాన్ని, కళనీ ఆస్వాదించేందుకు తగ్గట్టు వ్యక్తిని తర్ఫీదు చెయ్యడం ఉచితం. యుగాలుగా మానవాళి తయారుచేసిన సృజనాత్మక భాండాగారానికి ద్వారాలు అలా తెరవవచ్చు.

అయితే దాన్ని అక్కడే అలా వదిలిపెట్టడం మార్క్సిస్టు దృక్పథం ప్రకారం పాక్షికం అవుతుంది. ఇంకా చెబితే తిరోగమనం కూడా అవుతుంది. ఏమంటే దానివల్ల మన యుగ మౌలిక అంశం, నిజానికి సకల వర్గ సమాజ మౌలిక అంశం కప్పబడిపోతుంది. ఆదిమ సమాజం అంతమైనప్పటి నుంచీ సాహిత్యం, కళ, సంస్కృతి ఇంకా చెబితే తీరిక కూడా, ఏ కొద్దిమంది అల్ప సంఖ్యాకులకో పరిమితం అయివుండేవి. ప్రజా బాహుళ్యాన్ని దాస్యంలో వుంచడం వల్లా, సంస్కృతికి దూరంగా వుంచడం వల్లా వీటన్నింటిని అనుభవించే స్వేచ్ఛ వాళ్ళకి నిలబడింది. శ్రామిక వర్గ విప్లవం గురించి మార్క్స్ అన్నది ఒప్పు అయితే కనుక అంటే ఈ సారి విప్లవం అధిక సంఖ్యాకులది, మళ్ళీ అల్పసంఖ్యాకుల దోపిడీకి సంబంధించిన కొత్తరూపం కాదు. నిజమైన మానవ సమాజానిది – అప్పుడు సోషలిజం మొట్టమొదటి సారిగా స్త్రీ పురుషులు యావన్మందికీ, మానవాళి సాంస్కృతిక వారసత్వాన్ని అందుకునే తలుపులు తెరుస్తుంది. అప్పుడు కళాత్మక కార్యకలాపాలు, ఆస్వాదన ఏ కొద్దిమంది అల్పసంఖ్యాకుల విలాసాలుగా వుండవు. పెట్టుబడిదారీ సమాజం సాగుతున్నంత కాలం, సోషలిజం పాదుకో సంత కాలం కళ నష్టపోతుంది. ఏమంటే అది పోషకులే కొనేట్టు వుంటుంది. తమ సౌకర్యానికి సరిపడుతుందా, మనశ్శాంతికి సరిపడుతుందా అని, తదితర ప్రయోజనాలకు తూగుతుందా అని సొమ్ము చెల్లించేవాడు చూసుకునే రీతిలో వుంటుంది. ఇదే మార్క్స్ దృక్పథం. పెట్టుబడిదారీ విధానపు పతన దశ అని మార్క్స్ భావించిన సమయానికంటే ముందుగా కూడా, ఆయన దృష్టిలో అది కళాకారునికి ప్రతికూలమైన వాతావరణం వున్న ఒక వ్యవస్థే. కొన్ని రకాలుగా కళాత్మక అభివృద్ధికి ప్రేరకంగా వున్నప్పటికీ అది అంతే. ఫ్యూడల్ భావజాల బంధనాల నుంచి బూర్జువా వ్యక్తి విమోచనను సంబరంగా చేసుకునేందుకు భూమికగా కళ వికసించినా కూడా, నూతన పెట్టుబడిదారీ ఆర్థిక విధానం మరో దాన్ని అటు పక్క తెచ్చి పెట్టింది. అదేమంటే వాళ్ళకు సంబంధించి అన్నింటిని పరిమాణాత్మక 'విలువ' భావానికి కుదించే ధోరణి. వాటి అనితర ప్రత్యేక గుణాలకు అనురూపంగా సృజనాత్మక నైపుణ్యం, వాటికి అవి ఉండేటట్లు వస్తువుల్ని తయారు చెయ్యడం అనేవి ఆ కాలం నాటి ఆర్థిక వ్యవస్థకు పనికి, డబ్బుకు లొంగి పడి వుంటాయి.

స్త్రీలు పురుషులు తమ సామాజిక సంబంధాల్లో నిరంతరం తమ మధ్యనున్న 'నగదు లావాదేవీలకు' అణకువగా వుండేటట్లుగా తమ మానవత్వాన్ని తరిమి వెయ్యడం జరుగుతుంది. కళ నిజాయితీగా వుండాలంటే ఈ ధోరణుల నిర్మూలన' కోసం సాగాలి. కళాత్మక సత్యాన్వేషణలో నిమగ్నమైన కవులు, చిత్రకారులు తరం తర్వాత తరంగా బూర్జువా అస్తిత్వానికి వ్యతిరేకంగా లేదా దాన్నుంచి స్వేచ్ఛగా వుంచే, మార్గాల కోసం చూశారు. ఇరవయ్యవ శతాబ్దంలో అనేక కవిత్వ, కళాశాఖలు శ్రామికవర్గంతో, విప్లవోద్యమాలతో సంబంధాల కోసం అన్వేషించాయి. ❑

# ప్రజాపక్ష మేధావి గరిమెళ్ళ నారాయణ అస్తమయం

- గౌరవ్





ఇప్పుడే తెలిసిన విషాదకరమైన వార్త. జట్టు పద్మజ గారి ద్వారా సుమారు పదేళ్ల నుంచి నాకు ఎంతో ఆప్తులైన పెద్దలు, మిత్రులు, సమాజ హితైషి, ఎప్పుడూ నా శ్రేయస్సును ఆకాంక్షించే శ్రేయోభిలాషి, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక మొదలు దేశంలోని గాంధేయవాద, సామ్యవాద సమాజ సంస్థలెన్నింటితోనో ప్రత్యక్ష సంబంధాలు గల మహోన్నత వ్యక్తి, అసాధారణ బుద్ధి జీవి, ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ కోసం అహర్నిశలు శ్రమించిన 'మానవ వాహిని' వ్యవస్థాపకులు, ఉమ్మడి గోదావరి జిల్లా గంగ్రేడులో జన్మించి జాతీయ స్థాయిలో అనితర సాధ్యమైన ఎత్తుకి ఎదిగిన మనిషి గరిమెళ్ళ నారాయణ గారు నిన్ననే ముంబయిలో మరణించారని తెలిసింది! పిఠాపురంలో ఏక వ్యక్తి సైన్యం పుస్తకాన్ని ఆవిష్కరించిన గరిమెల్ల నారాయణ స్వాతంత్ర్యోద్యమాన్ని కళ్ల ముందు ఎక్సరే తీసి చూపెట్టినంత స్పష్టంగా విశ్లేషించగల నిపుణులు. ఒక్క గాంధీయే కాదు, నెహ్రూ, జె.పి, అంబేద్కర్, లోహియా, రస్సెల్ వంటి దేశ విదేశీ బుద్ధి జీవుల్ని లోతుగా అర్థం చేసుకున్న నేత నారాయణ. ఆయనతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్. ఈ ఏడు ఫిబ్రవరిలో పిఠాపురంలో జరిగిన నాన్న సంస్మరణ సమావేశానికి ప్రత్యేకంగా రావడమే కాక, 'ఏక వ్యక్తి సైన్యం' పుస్తకాన్ని అప్పటికప్పుడే చదివి మాట్లాడిన ప్రేమాస్పదులు. 'నిన్ను తల్చుకోని క్షణం లేదు. ఇవే ఆయన ఫోన్‌లో నాతో మాట్లాడిన చివరి మాటలు. జయరావు, నేనూ, శివ ప్రసన్నతో కలిసి ముంబై వెళ్ళి చూసొద్దామనే అనుకున్నా. ఇంతలోనే ఈ వార్త వినాల్సి వచ్చింది!

చుండి జగన్నాథం ఆధ్వర్యంలో నడిచిన 'చక్రం' పత్రికలో మద్యపాన నిషేధానికి సంబంధించిన నిర్మాణాత్మక రచనలు చేయడం మొదలు, మేధాపాట్కర్ వంటి సామాజిక ఉద్యమ కారులతో కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం వరకూ ఆయనో తిరుగులేని స్వాప్నికుడు. కనీసం వారంలో ఒకసారైనా ఫోన్ చేసి మరీ పలకరిస్తూ, తెలుగు ప్రాంతంలో ప్రజా చైతన్య యాత్రను నన్ను ప్లాన్ చేయమని పదేపదే కోరిన వ్యక్తి. దాదాపు తొంభై ఏళ్ళ వయసులో కూడా తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారోద్యమం చేయాలని తపించిన ఆలోచనాపరుడు. నా అక్షరాల్ని, ఆచరణను నాకంటే ఎక్కువగా ప్రేమించిన వ్యక్తి!


అటు పార్వతీపురం మొదలుకొని ఇటు గుంటూరు వరకూ, విశాఖపట్నం నుండి హైదరాబాద్ దాకా, ఒడిషాతో మొదలు పెడితే గుజరాత్ వరకు నెలలో కనీసం నాలుగైదు కార్యక్రమాలకి హాజరయ్యేవారు. దేశంలోని ఎక్కడెక్కడి సామాజిక కార్యకర్తలతోనూ ఎప్పుడూ సంబంధాలు కలిగి ఉండేవారు. విపరీతంగా అధ్యయనం చేసేవారు. అలాంటి సామాజిక ఆలోచనాపరులు, ప్రజాపక్ష మేధావి గరిమెళ్ళ నారాయణ అమర్‌రహే! ఆయన ఆశయాల్ని కొనసాగిస్తామనే మాటిస్తూ, కన్నీటి నివాళులతో..అసాధారణ ప్రజాపక్ష మేధావి కీ.శే. గరిమెళ్ళ నారాయణ! ❑

(సకలం సౌజన్యంతో)

## గరిమెళ్లకు దారి దీపం నివాళి

**గరిమెళ్ళనారాయణ గారు ప్రజా ఉద్యమాలే ఊపిరిగా జీవించారు. లోక్‌సత్తా నిర్వహించిన 'సురాజ్య' ఉద్యమానికి సమన్వయకర్తగా వున్నారు. ఒక ప్రజా ఉద్యమంగా దానిని మల్చడానికి నాతో అనేక చర్చోపచర్చలు చేశారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడు మా నివాసంలో నాతో చాలా రోజులు వున్నారు. వయస్సు ఎంత పైబడుతున్నా ఏదో ఒక ప్రజా ఉద్యమం చేసి తీరాలని చివరి వరకు తపిస్తూనే వున్నారు. నాతో అప్పుడప్పుడు ఫోన్ సంభాషణలు చేస్తూనే వున్నారు. చివరిగా ఆగస్టు 1న ఫోన్ చేసి, దారి దీపం పీడీఎఫ్ చదవలేకపోతున్నాను. ప్రింట్ కాపీ పంపించమన్నారు. దారిదీపం పత్రికకు 4000/- విరాళం కూడా పంపించారు. సెప్టెంబరులో తణుకు వస్తానని చెప్పారు. మిత్రుడు, ఆప్తుడు నిరంతర ఉద్యమకారుడు గరిమెళ్ళకు నివాళులర్పిస్తున్నాను.**

- డీవీవీఎస్ వర్మ.




మాట దాగదు

వన్ ఓటు








ఒక్కడి కోసం

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 2 - Issue No : 2 November 2023








## కొత్త పుస్తకాలు స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.